SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 6
November-2022, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

నవంబరు 2022
వెల రూ. 20/-
పుటలు-56



తిరుమల శ్రీవారి పుష్పయాగ మహోత్సవం
01-11-2022

**తిరుమల శ్రీవారికి 27-09-2022 నుండి 05-10-2022 వరకు జరిగిన బ్రహ్మోత్సవ వైభవ చిత్రమాలిక.**

అందులో పాల్గొన్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు మరియు భక్తులు





















## గీతాశ్లోకార్థసారం

శ్లో : దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥

శ్లో : ఉత్సన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన
నరకేఽ నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 43, 44వ శ్లోకాలు)

**ప్రతిపదార్థం:** కులఘ్నానామ్= కులమును నాశనము చేయువారియొక్క; వర్ణసంకరకారకైః=జాతిని సంకరముచేయు; ఏతైః= ఈ; దోషైః= దోషములచేత; శాశ్వతాః= శాశ్వతములైన; జాతిధర్మాః= జాతిధర్మములు; కులధర్మాశ్చ= కులధర్మములున్ను; ఉత్సాద్యన్తే= నశింపబడుచున్నవి; జనార్దన= ఓకృష్ణా!; ఉత్సన్నకులధర్మాణామ్= నశించిన కులధర్మములుగల; మనుష్యాణామ్= మనుజులకు; నరకే= నరకమునందు; నియతమ్= ఎల్లప్పుడును; వాసః= నివాసము; భవతి= కలుగును; ఇతి= అని; అనుశుశ్రుమ=(పెద్దలవలన) వినియున్నాము.

**భావం:** ఓ కృష్ణా! కులనాశకులయొక్క జాతిసాంకర్యహేతువులైన ఈదోషములచేత శాశ్వతములగు జాతిధర్మములు, కులధర్మములు నశించిపోవుచున్నవి. కులధర్మములు నశించిన మానవులకు శాశ్వత నరకనివాసము కలుగునని పెద్దలవలన వినియున్నాము.

---

## ఆదిలక్ష్మి మోహన కమలంబున

అలుకలు చెల్లవు హరి! పురుషోత్తమ
నలి నిందిర నీతో నవ్వినది

ఆదిలక్ష్మి మోహన కమలంబున
వేదమాత నిను వేసినది
ఆ దెస నీకై అభయహస్తమును
సాదరమున కడు సాచినది

సిరి తన చూపుల చింతామణులను
పారి నీపై దిగ బోసినది
వరద హస్తమున వల చేయి పట్టుక
నరుదుగ నిను మాటాడించినది

జలధికన్య తన సర్వాంగంబుల
పిలిచి నిన్ను నిటు పెనఁగినది
అలముక శ్రీవేంకటాధిప! నిను రతి
కెలమి నీ వురం బెక్కినది

(సంపుటం-20, సంకీర్తన-06)





*శ్రీవేంకటాచలవాసా! హరీ! పురుషోత్తమా! నీవు లక్ష్మిపై అలుక వహించుట చెల్లదు స్వామీ! ఆమె చేతిలోని పద్మంతో సరసంగా నీ మేనిపై స్పర్శిస్తూ ఉంది. తన ప్రసన్నమైన చూపులను నీపై ప్రసరింపజేసి, ఆప్యాయంగా తనచేతితో నిన్ను పట్టుకొని మాట్లాడిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ, నీకు ఉత్తేజాన్ని కలిగిస్తూ ఉంది. సర్వాంగీణముగా తనకు తానై నీకు సమర్పితయైన లక్ష్మి నీ వక్షఃస్థలాన్ని అలంకరించినది అంటూ అన్నమయ్య వర్ణించాడు.*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక వెలలో మార్పు అమలులోకి వచ్చింది.

ఇది నూతన చందాదారులకు
మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.



### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-



శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!

వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264363, 2264543




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 నవంబరు, 2022 సంచిక : 06


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| శ్రీహరి హృదయనివాసిని.. | శ్రీమతి ఎన్.సి. హెచ్. శ్రీలక్ష్మి | 07 |
| పద్మావతి అమ్మవారికి కుంకుమపూజ | డా॥ కోగంటి వేంకట శ్రీరంగనాయకి | 09 |
| బ్రహ్మోత్సవశోభ... | యస్. లావణ్య | 11 |
| కపిలతీర్థంలో.. అన్నాభిషేకం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 13 |
| తరలిరండి!! (గేయం) | డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు | 14 |
| అలమేలుమంగమ్మప్రసాదాలన్నీ అమృతమయం!! | డా॥ యస్.పద్మావతి | 15 |
| మంగళకైశికి మాహాత్మ్యము | డా॥ మైలవరపు లలితకుమారి | 17 |
| వస్త్రాలంకరణసేవలో... స్వతంత్రవీరలక్ష్మి | డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి | 19 |
| కుమారస్వామి కల్యాణం | డా॥ పి.లలితవాణి | 22 |
| పువ్వులతో చేసేదే పుష్పయాగము | నాగజ్యోతి | 24 |
| గజవాహనంపై ఐశ్వర్యప్రదాయిని | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 25 |
| ఆకాశరాజు పుత్రిక 'పద్మావతి' తిరుచానూరు 'పద్మావతి' | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 28 |
| బంగారువెలుగులతో.. దేదీప్యమానంగా... | శ్రీ కె.వి.యల్.యన్.అప్పలాచార్యులు | 31 |
| జగదేకవీరుడు పరశురాముడు | డా॥ పి.వి.ఉమాశశి | 34 |
| గాజుల విశిష్టత | డా॥ దేవులపల్లి పద్మజ | 37 |
| దేవుడి నుండి దేవేరి కి.. | పల్లం పద్మావతి | 39 |
| కార్తికపున్నమి జ్వాలాతోరణ మహోత్సవం | శ్రీమతి కె. నాగవేణి | 40 |
| పాంచరాత్రాగమం.. | శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు | 41 |
| తిరుక్కూడలూర్ (ఆడుదురై పెరుమాళ్‌కోయిల్) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 42 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 44 |
| స్వామి అక్షతలతో... | శ్రీ పెనుగొండ శ్రీనివాస్ | 45 |
| మనసు మార్చరానిది (విశ్వదాభిరామం) | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| అలమేలుమంగ అనుగ్రహం (చిత్రకథ) | కథ: డా॥ జె.అనీల్‌కుమార్<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| కాకమ్మే కాపాడింది!! | శ్రీ పచ్చా పెంచలయ్య | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (04) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి పుష్పయాగమహోత్సవం, తిరుమల
వెనుకచిత్రం : శ్రీఅలమేలుమంగమ్మవారి పుష్పయాగమహోత్సవం, తిరుచానూరు


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఎ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా(12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.


24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333




వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# అద్భుతం! పరమాద్భుతం!!

దివ్యక్షేత్రమైన తిరుచానూరులో పవిత్రమైన పద్మసరోవరపుణ్యజలాలనుండి బంగారుసహస్ర దళపద్మంలో ఆవిర్భవించిన అలమేలుమంగమ్మకు పద్మావతి అనేపేరుతోపాటు 'స్వతంత్రవీరలక్ష్మి' అనేపేరు ప్రసిద్ధంగా ఉంది. తిరుచానూరు శ్రీమహారాజ్ఞి అయిన అలమేలుమంగమ్మకు పాంచరాత్రా గమశాస్త్రరీతిగా 'స్వతంత్రవీరలక్ష్మ్యారాధన' పేరుతో నిత్యారాధనలు, ఉత్సవాలు, ఊరేగింపులు ఘనంగా జరుగుతాయి.

పద్మావతిదేవిగా కొలువైఉన్న ఆలయంలోకి అడుగుపెట్టీపెట్టగానే పరిమళపుసుగంధద్రవ్యాల సువాసనలతో, మంగళవాద్యాలనాదాలతో, అర్చకుల మంత్రోచ్చారణలతో, ప్రసాదాల కమ్మని గుబా ళింపులతో ఎంతో హృద్యమైన, మంగళకరమైన, ఆహ్లాదకరమైన ఆధ్యాత్మికశోభతో అలరారుతూంటుంది. ఈ ఆలయం నిత్యమూ జనసందోహాల గోవిందనామఘోషలతో నిండిఉంటుంది. ఆలయపరిసరాల్లోనైతే పుష్కరిణిసోయగం, అన్నప్రసాదవితరణశాలలో ఆహారపదార్థాల గుబాళింపులు, ఆస్థానమండపంలో నిత్యమూ అలరారే వివిధ సాంస్కృతికకార్యక్రమాలు మొదలైనవాటితో ఆధ్యాత్మిక వాతావరణం ప్రతి బింబించేలా ఉంటుంది. ఇక్కడ నిత్యమూ ఎన్నోరకాలఉత్సవాలు జరుగుతూంటాయి.

ఆ క్రమంలోనే నవంబరు 20 నుండి 28 దాకా అమ్మవారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా, కన్నులపండువుగా జరుగుతాయి. ఆలయపరిసరప్రాంతమంతాకూడా పండుగవాతావరణంతో కళకళ లాడుతూంటుంది. విద్యుత్కాంతులమెరుపులతో, ఫలపుష్పప్రదర్శనలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. బ్రహ్మోత్సవప్రారంభంలో ఇక్కడ అమ్మవారికి లక్షకుంకుమార్చనసేవ జరుగుతుంది. ఈసేవను బ్రహ్మోత్సవాల్లో ఏ ఆటంకాలూ కలక్కుండా మంగళప్రదంగా, దిగ్విజయంగా జరగాలని అమ్మవారిని వేడుకుంటూ చేస్తారు.

ఇక ప్రతిరోజూ అమ్మవారు వివిధరకాలవాహనాలపై ఆసీనులై నాలుగుమాడవీథుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు. ప్రతివాహనసేవలో పద్మావతిఅమ్మవారి ఉత్సవమూర్తికి, శాంతినిలయంలో కొలువైఉన్న పద్మావతిఅమ్మవారికి నిత్యమూ ఎన్నోరకాల పరిమళపుష్పాలతో, ఘనమైనపట్టుచీరలసోయగంతో, వివిధరకాల పూలమాలలతో, ఎన్నోరకాల వెలలేని రత్నాభరణాలతో అమ్మవారిని ముస్తాబు చేయడం చూస్తే అద్భుతంగా, పరమాద్భుతంగా, ఎంతకన్నులపండువుగా ఉంటుందో కన్నులతో చూడాల్సిందే గాని మాటలతో వర్ణించలేం. పంచమీతీర్థమహోత్సవానికైతే ఇక జనసందోహమే! ఇక తిరువీథుల్లో ఐతే భక్తుల గోవిందనామఘోషలు, కళాబృందాలకోలాటాలు, చెక్కభజనలు, పండరిభజనలు, పిల్లనగ్రోవులు; జీయర్ల వేదప్రబంధపారాయణలు, మంగళవాయిద్య నాదాలు మొదలైనవాటితో నిండిపోయి అంగరంగవైభవంగా కనిపిస్తుంది.

అలాగే, ఈమాసంలో పద్మావతిఅమ్మవారికి, తిరుమల శ్రీవారికికూడా 'పుష్పయాగమహో త్సవం'; అన్నం పరబ్రహ్మస్వరూపం అంటూ తిరుపతి కపిలేశ్వరస్వామివారికి 'అన్నాభిషేకం'; తిరుమల ఆలయంలో 'కైశికద్వాదశిఆస్థానం', సుబ్రహ్మణ్యషష్ఠిసందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణోత్సవం మొదలైనవన్నీకూడా ఎంతో అద్భుతంగా, పరమాద్భుతంగా జరగడం గొప్పవిశేషం. అమ్మవారి బ్రహ్మోత్సవాలతోపాటు ఈ విశేషసేవలన్నింటిలోకూడా మనమందరమూ పాల్గొని ఆయాదేవతల ఆశీస్సులు పొందుదాం.

# శ్రీహరి హృదయనివాసిని..

- శ్రీమతి ఎన్.సి. హెచ్.శ్రీలక్ష్మి, 77803 19160





"కలౌ వేంకటనాయకః" అని భక్తులచే కొనియాడబడుతూ, కోరిన వరాలనొసగే కొండంత దేవుడిగా నీరాజనమందుకుంటున్న శ్రీవేంకటేశుని హృదయపీఠంలో పద్మాసనయై ఉన్న ఈ లక్ష్మినే "వ్యూహలక్ష్మి"గా అర్చిస్తారు. "వ్యూహం" అనగా ఊహింపబడేది. అనగా ఈ తల్లి రహస్యంగా, నిగూఢంగా శ్రీనివాసునిహృదయంలో విరాజిల్లుతూ భక్తులందరినీ శ్రీస్వామివారి అనుగ్రహానికి పాత్రులను చేస్తుంది. అందరికీ అన్నివేళలా ఈతల్లి దర్శనం లభించదు.. అందువలనే రహస్యంగా ఉన్న ఈ లక్ష్మి "వ్యూహాలక్ష్మి"గా పిలువబడుతోంది.

**ద్విభుజా వ్యూహాలక్ష్మీః స్యాత్ బద్ధ పద్మాసన ప్రియా!**
**శ్రీనివాసంగ మధ్యస్థా సుతరాం కేశవ ప్రియా!!**

ఈ జనని శ్రీనివాసుని హృత్పద్మంలో' "శ్రీవత్సం" అనే గుర్తుగా నిలిచి, దయ, కరుణ, క్షమ అనే సహజాతిసహజమైన దివ్యగుణాలతో విలసిల్లు తోంది. శ్రీనివాసుని హృదయమందు కొలువైఉన్న "వ్యూహలక్ష్మి" అమ్మవారే భక్తులకు సదా దర్శన మిచ్చేందుకై సువర్ణముఖీనదీతీరాన ఉన్న శ్రీశుక పురంలో (తిరుచానూరు) అలమేలుమంగ "స్వతంత్రవీరలక్ష్మి" పేరుతో అవతరించి, భక్తులకోర్కెలను తాను తీర్చడమేకాక, తన విభుడైన శ్రీవేంకటేశునికి విన్నవించి, ఆ స్వామి చేతకూడా వరాలను ఇప్పిస్తున్నది. ఆ జగన్మాత శ్రీనివాసుని వక్షఃస్థలంలో ఉబ్బెత్తుగా ముందుకు చొచ్చుకొని ఉండి, తన స్వామికంటే ముందుగా భక్తులందరి ప్రార్థనలను ముందుగా తానే వింటుంది. ఈ జగజ్జనని లక్ష్మీ, కీర్తీ, జయా అను మూడువిధాలైన వ్యూహబేధాలతో వెలు గొందుతూ ఉంటుంది. సర్వసంపత్ప్రదాత్రియైన ఈమాత శ్రీవేంకటేశుని నల్లనిహృదయాకాశంలో మిరుమిట్లుగొలుపుతూ నక్షత్రంవలే భాసిస్తూ ఉంటుంది. భూలోకవైకుంఠమైన శ్రీవేంకటేశ క్షేత్రంలో వక్షఃస్థలమహాలక్ష్మితోపాటు శ్రీనివాస భగవానుడు అర్చామూర్తిగా అవతరించడానికి కొన్నివేలసంవత్సరాలకుపూర్వమే ఈ క్షేత్రం ఆది వరాహక్షేత్రంగా ఆవిర్భవించింది. ఈ దివ్యస్థలం శ్రీమహావిష్ణువు భయంకరమైన "శ్వేతవరాహక్షేత్రం"అనీ, వరాహస్వామివారు వామాంకంలో భూదేవిని ధరించినందువల్ల "భూవరాహక్షేత్రం" అనీ వివిధనామాలతో ఈ క్షేత్రం ప్రసిద్ధి కెక్కింది.



ఆ తర్వాత కొన్నివేలసంవత్సరాలకు మళ్ళీ వైకుంఠంనుంచి శ్రీవేంకటేశ్వరుడనేపేరుతో వక్షఃస్థల మహాలక్ష్మితో అర్చామూర్తిగా ఈ ఆదివరాహక్షేత్రంలో వెలసి ఉండడానికి సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి కారకురాలు అయ్యింది. అప్పట్నుంచి వేంకటాచలక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. ఆ తర్వాత శ్రీవేంకటేశుని ప్రార్థనపై శ్రీమహాలక్ష్మి తానుగా శ్రీశుకపురం (తిరుచానూరు)లో పద్మసరోవరంలో అలమేలుమంగగా అవ తరించి "స్వతంత్రవీరలక్ష్మి"యై అర్చామూర్తిగానూ, వేంకటాచల క్షేత్రంలో శ్రీనివాసుని వక్షఃస్థలంలో "వ్యూహలక్ష్మి"గానూ కొలువై అర్చనలందుకుంటూ భక్తులచేత ఆరాధింపబడుతున్నది.

భగవద్రామానుజులవారికి స్వయంగా శిష్యుడైన అనంతాళ్వారులు శ్రీస్వామివారి పుష్పకైంకర్యంకోసం అహరహం శ్రమించి, అద్భుతమైన పూదోటను పెంచాడు. స్వామివారికి జరిగే తోమాలసేవకు సుందరంగా కూర్చిన పూమాలలను ధరించి ఆనందించిన స్వామి అనంతాళ్వారుని

పరీక్షించదలచాడు. ఏకాంతసేవ అనంతరం, వక్షఃస్థలంమీదున్న అలమేలుమంగాసమేతుడై అనంతాళ్వారునితోటలో ప్రత్యక్షమైనాడు. ఆ తోట దివ్యసౌందర్యాన్ని తిలకించి పరవశులై విహరించారు. అందుకొన్నిపూలను ధరించి, కొన్ని పూలపరిమళాలు ఆస్వాదించి, ఇరువురు తోటంతా కలియతిరుగుతూ ఇంచుమించుగా నాశనంచేసి, సుప్రభాతసమయానికి ఆలయానికి చేరుకున్నారు. మరునాడు ఉదయం తనతోటంతా చిందరవందరగా ఉండడం చూసి ఎంతగానో బాధపడ్డాడు అనంతాళ్వారులు. ఇలా రోజూ తనతోటను ఎవరో పాడుచేయడం చూసిన అనంతాళ్వారు తోటకు కాపుకాయడం మొదలుపెట్టాడు.

తొమ్మిదవరోజు అర్ధరాత్రిసమయంలో పొదలమాటున ఎవరో తచ్చాడుతుండడం చూసి ఆవేశం ఆపుకోలేక పరుగెత్తుకు వెళ్ళి, వారిరువురిని దొరకబుచ్చుకున్నాడు. ఆ పెనుగులాటలో పురుషుడు పారిపోగా, దొరికిన స్త్రీని ఒక సంపెంగచెట్టుకు కట్టివేసి ఆమెను బెదిరించాడు.



అందుకు ఆమె "నాయనా నీ బిడ్డలాంటిదానను" నన్ను విడిచిపెట్టు! నా మానాన నేనుపోతాను అంటూ ఎంత బ్రతిమాలినా వినిపించుకోక బయట తచ్చాడుతున్న పురుషుని తరుముకొన్నాడు. అతడు ఆలయప్రదక్షిణమార్గంలో అప్రదక్షిణంగా పరుగెత్తి, అనంతాళ్వారునితోటవద్ద మాయమైనాడు. చేసేదిలేక వెనక్కివచ్చి ఆ స్త్రీని కట్టేసిన సంపెంగచెట్టు వద్దనే నిద్రించాడు.

మర్నాడు శ్రీనివాసుని హృదయమునందు మహాలక్ష్మి కనిపించకపోవడంతో కలవరపడ్డారు- అర్చక స్వాములు. అందుకు వేంకటేశుడు ఆమె అనంతాళ్వారునితోటలో ఉంది. ఆమెను పూలగంపలో వేంచేపు చేయించుకుని పెండ్లికూతురువలే పిలుచుకురమ్మని చెప్పాడు. వ్యూహలక్ష్మిని తండ్రివలే అనంతాళ్వారే స్వయంగా నాకు అప్పచెప్పాలని ఆదేశించాడు. ఇది తెలుసుకున్న అనంతాళ్వారు తన అపరాధానికి క్షమించమని వేడుకుని, ఊరేగింపుగా జగన్మాతను ఆలయానికి తీసుకునివెళ్ళి స్వామివారికి అప్పగించాడు. అందుకు శ్రీనివాసుడు "మామ! నాకు వ్యూహలక్ష్మిని సమర్పించి కన్యాదాతవైనావు". నీ గాథ ఆచంద్రార్కం నిలిచి ఉంటుందని వరమిచ్చాడు. ఈ విధంగా ఆ లోకమాత అనంతాళ్వారుకు తనయ అయింది.



ఓనాడు శ్రీనివాసునితో వియోగాన్ని భరించలేక... పద్మావతి దుఃఖించింది. అందుకు వేంకటేశుడు ఆమెను ఓదార్చుతూ... నీవు నా హృదయంలో ఉన్న వ్యూహలక్ష్మితో సంయోగాన్ని పొందు. అవతారలక్ష్యాలనుబట్టి భిన్నులుగా కనబడినా మీరిరువురూ అభిన్నులని తెలిపాడు. అప్పుడు ఆకాశరాజుకుమార్తెఐన పద్మావతి శ్రీనివాసుని వక్షఃస్థలంపై వ్యూహలక్ష్మితో సంయోగం చెంది, భూతకారుణ్యలక్ష్మిగా వెలసింది. శ్రీనివాసుని భక్తసంరక్షణమనే లోకకల్యాణకారకమైన మహాకార్యంలో తానూ తోడ్పడుతూ భక్తులమీద ఎనలేని వాత్సల్యాది గుణాలతో ప్రకాశిస్తూ దర్శనమిస్తున్నది. ప్రేమస్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మి వేంకటాచలక్షేత్రంలో తిరుమలేశుని హృదయకమలంలో వ్యూహలక్ష్మిగానూ, తిరుచానూరులో అర్చామూర్తియై శ్రీపద్మావతిదేవిగానూ, అలమేలుమంగగానూ భక్తులందరిచే అర్చనలందుకుంటూ ఆరాధింపబడుతోంది.



# పద్మావతి అమ్మవారికి కుంకుమ పూజ

– డా॥ కోగంటి వేంకట శ్రీరంగనాయకి,
98661 08214

*హిందూసనాతనధర్మంలో కుంకుమకు విశేషప్రాధాన్యముంది. లక్ష్మి, సరస్వతి, పార్వతి అమ్మవారిపేర్లతో పిలుస్తున్న శక్తిఅమ్మవారికి ప్రతిరూపం సింధూరం లేదా కుంకుమకు ప్రాశస్త్యముంది. అమ్మవారిఆలయాల్లో బ్రహ్మోత్స వాలులాంటి భారీఉత్సవాలను నిర్వహించేముందు అర్చకులు లక్షకుంకుమార్చన నిర్వహించడం సంప్రదాయం. ఈ విశిష్టమైనసేవద్వారా అమ్మవారు ప్రసన్నమై ఉత్సవానికి ఎలాంటిఆటంకం రాకుండా విజయవంతంగా జరిగేలా ఆశీర్వదిస్తారని భక్తులనమ్మకం.*

*తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారిఆలయంలో వార్షిక కార్తికబ్రహ్మోత్సవాలసందర్భంగా లక్షకుంకుమార్చన వైభవంగా నిర్వహిస్తారు. ఆరోజున అమ్మవారిని వేకువజామునే మేల్కొలిపి సహస్రనామనిత్యార్చనలతో నిత్యకైంకర్యాలు నిర్వహిస్తారు. తర్వాత ఆలయంలోని శ్రీకృష్ణముఖమండపంలో శ్రీపద్మావతిఅమ్మవారిని ఆశీనులను చేసి అర్చకులు శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనసేవ నిర్వహిస్తారు. ఈసందర్భంగా అర్చకులు లక్ష్మీఅష్టోత్తరం, లక్ష్మీసహస్రనామాలు పఠిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారినామాన్ని లక్షమార్లు స్తుతిస్తూ అర్చనచేస్తారు. అలాంటి ప్రాశస్త్యమున్న కుంకుమగురించి కొంత తెలుసుకుందాం...*

*స కుంకుమ విలేపనాం, అళిక చుంబి కస్తూరికామ్* – అని లలితాఅమ్మవారి ధ్యానశ్లోకం. అమ్మవారిముఖం కుంకుమ పూతతో, కస్తూరినామంతో ప్రకాశిస్తున్నదని చెబుతున్నది. సాధారణంగా కుంకుమనే తిలకమనికూడా అంటారు. కావ్యాలలో తిలకాయమాన అనేమాట వినిపిస్తుంది. తిలకం ముఖానికి ఎంతోశోభని చేకూరుస్తుంది. సంప్రదాయాలనుబట్టి అమ్మవారి నుదుట నిలువుగా లేక వర్తులాకారంగా కుంకుమని అలంకరిస్తారు. కుంకుమ కేవలం స్త్రీమూర్తులకే కాదు పురుష మూర్తులకుకూడా అలంకరిస్తారు. పరమేశ్వరుని లింగాష్టకంలో 'కుంకుమచందనలేపితలింగం' అని కుంకుమతో భాసిల్లే మూర్తినే స్తోత్రంచేశారు. ఏ దేవతామూర్తినైనా గంధం సమర్పించినతరువాత గంధస్యోపరి అలంకరణార్థం కుంకుమాం విలేపయామి అని కుంకుమని సమర్పిస్తారు. అలివేలుమంగమ్మకి నిలువుబొట్టు ప్రత్యేకం. అది అలివేలుమంగమ్మబొట్టుగానే ప్రసిద్ధిచెందింది. అటువంటి బొట్టు మరేమూర్తికీ కనిపించదు. ఎక్కడైనా కనిపిస్తే అదీ గోదాదేవికి తప్ప.

పూర్వకాలంలో అమ్మవారిముఖానికి అర్చకులే పసుపు పూసి కుంకుమతో బొట్టు పెట్టేవారు. ఇటీవలికాలంలో భక్తులు అమ్మవారికి రత్నాలుపొదిగిన బంగారుబొట్టును సమర్పిస్తున్నందువల్ల కుంకుమతో అలంకరింపబడిన దేవతామూర్తుల ముఖమండలాలు అంతగా కనిపించటం లేదు.

అమ్మవారికి పసుపుకుంకుమలను సమర్పిస్తే సౌభాగ్యం వర్ధిచెందుతుందనే నమ్మకంతో ముత్తైదువలు అమ్మవారికి విశేషంగా పసుపుకుంకుమలను సమర్పిస్తారు. అమ్మవారు ప్రకృతి స్వరూపిణి. ప్రకృతిలో సహజసిద్ధమైన పసుపుప్రధానంగా వెలిగారం కలిపి కుంకుమని తయారుచేస్తారు. కుంకుమార్చనవల్ల భక్తులు విశేషమైన లాభాలను పొందుతారు. ముఖ్యంగా కుంకుమ ఎరుపుగా ఉంటుంది. ఇది రజోగుణానికి ప్రతీక. 'స్త్రీ' అన్న అక్షరంలోనే స్, త్, ర్ లలో 'స'కారం. సత్వగుణాన్ని, 'త'కారం తమోగుణాన్ని, రేఫ రజోగుణాన్ని సూచిస్తాయి. త్రిగుణాత్మక అయిన అమ్మవారిలో రజోగుణానికి కుంకుమతో అర్చనచేస్తే మానవులకి గ్రహబాధల నుండి ఉపశమనం కలుగుతుంది. ప్రధానంగా రాహుగ్రహానికి అమ్మవారు అధిదేవత. ఎరుపురంగుకుంకుమతో అమ్మవారిని పూజిస్తే ఆ రాహుగ్రహంవల్ల కలిగేబాధలు చాలావరకు తొలగిపోతాయి. అమ్మవారికిష్టమైన అర్చనలలో కుంకుమార్చన ఒకటి. ఎన్నిరకాలపువ్వులతో పూజించినా కుంకుమార్చన చెయ్యకుండా భక్తులుండరు. నవరాత్రులలో కొందరు అమ్మవారికి కోటికుంకుమార్చన చేసేవాళ్ళు ఈనాటికీ లేకపోలేదు. ఏ అమ్మవారిసన్నిధికి వెళ్ళినా (గాయత్రీ, కనకదుర్గ, సరస్వతీ, మహాలక్ష్మి, పార్వతీ) భక్తులకు ప్రసాదంతోపాటు పూజచేసిన కుంకుమపొట్లాన్ని పూజారులిస్తారు. అందులో అమ్మవారి కుంకుమ అంటేనే ఎంతోప్రీతి భక్తులకు. ఏ శుభకార్యక్రమాన్ని ఆరంభిస్తున్నా ముందుగా తమనుదుట స్త్రీపురుషులిద్దరూ కుంకుమని ధరించవలసిందే.

***"తిరుచానూరులో అమ్మవారిదర్శనం చేసుకొని వస్తున్న భక్తులందరికీ కుంకుమ పొట్లాలివ్వటం ప్రత్యేకవిశేషం. అమ్మవారి అనుగ్రహాన్ని ఆవిధంగా భక్తులకు అంద చేస్తున్నారు. మామూలుగా పులిహోర, పొంగలి, ఈ ప్రసాదాలతోపాటు కుంకుమ నిచ్చేవిధానం విశేషం. పురాతనమైన కొన్ని దేవాలయాలలో మాత్రమే పూజ చేయించుకొన్నవాళ్ళకి కుంకుమ చిన్నపొట్లాం కట్టి ఇస్తారు. తిరుచానూరులోమాత్రం కుంకుమార్చన చేయించుకొన్నవాళ్ళకి, చేయించుకోనివాళ్ళకి అందరికీ అందిస్తారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలకి ముందుగా ప్రత్యేకంగా తి.తి.దే. వారు కుంకుమను కూడా తయారుచేయిస్తారు."***

మానవులు కుంకుమని ధరించినందువల్ల ముఖానికి ఒకఅందం వస్తుంది. అమ్మవారు ధరిస్తే కుంకుమకే అందం వస్తుంది.

కొంతమంది కష్టాలు వచ్చినప్పుడు కనకదుర్గమ్మవారికి కాని, గ్రామదేవతలకికాని, పసుపుకుంకుమలని సమర్పిస్తామని మొక్కుకొంటారు. కొందరు గ్రామ పసుపుకుంకుమనోముకూడా నోస్తారు.

అమ్మవారినుదుట రత్నాభరణం ప్రకాశిస్తున్నా అమ్మవారి పాదాలచెంత భక్తుల గోత్ర నామాలు చెప్పి కుంకుమతో అర్చన చేసి మంత్రపూతమైన ఆ కుంకుమని భక్తులకందిస్తారు. 'అనుదిన పూజిత కుంకుమధూసరవర్ణ మనోహర కాంతిమయే' అని సంతానలక్ష్మిని ప్రార్థించేటప్పుడు అమ్మవారి కుంకుమార్చనవైభవాన్ని చాటారు. దహరాన, కనిపించు ఇన బింబమనిపించు మా తల్లి కుంకుమకు నీరాజనం. నిండైన నీరాజనం, భక్తిమెండైన నీరాజనం అని ఒకకవి అమ్మవారికుంకుమకు మంగళనీరాజనాన్ని సమర్పించారు.

కుంకుమపూజ చేసేముందు ***"వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదామ్"*** అని అమ్మవారిని ప్రార్థించి పూజ ప్రారంభిస్తారు.

భాగ్యంతోపాటు సౌభాగ్యాన్నికూడా అనుగ్రహించే లక్ష్మీదేవీ వేంకటేశ్వరస్వామి తపస్సుచేస్తే పద్మంలో ఆవిర్భవించి పద్మావతీదేవిగా ప్రశస్తిని పొంది తిరుచానూరులో కొలువై భక్తులకు కొంగుబంగారంగా పూజలందుకొంటున్నది. ఈనాటి కాలంలో జరిగే ప్రమాదాలనుండి రక్షణకోసం, సౌభాగ్యం (సుమంగళిత్వం) కోసం భక్తులందరూ అమ్మవారికి కుంకుమార్చనలని సమర్పించి ఆ తల్లి అనుగ్రహంతో సుఖశాంతులని పొందాలని ఆశిద్దాం.

# బ్రహ్మోత్సవశోభ...

– యస్. లావణ్య



జగజ్జనని అలమేలుమంగ కార్తికమాసంశుక్లపంచమిరోజున పద్మసరోవరంలో ఆవిర్భవించిన దివ్యముహూర్తాన్ని పురస్కరించుకొని ఏటేటా కార్తికబ్రహ్మోత్సవాలు నిర్వహింపబడతాయి. పాంచరాత్రాగమోక్తంగా అంకురార్పణ, ధ్వజారోహణం వివిధరకాల వాహనసేవలు, రథోత్సవం, పంచమీచక్రస్నానం వైభవంగా నిర్వహించబడతాయి. ఆగమోక్తకైంకర్యాలతో కూడిన అంకురార్పణపూర్వక విష్వక్సేనోత్సవంతో ఈ ఉత్సవాలు మొదలువుతాయి. విష్ణువు సేనాపతి విష్వక్సేనులవారి పర్యవేక్షణలో, సుదర్శనచక్రత్తాళ్వార్ ఆధ్వర్యంలో ఈ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. అందుకే ప్రారంభంలో విష్వక్సేనారాధన, చివరలో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరుగుతాయి.

సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి తన స్వీయాంశతో తిరుచానూరులో వెలసి భక్తుల కొంగుబంగారమై పసిడిసిరులను కురిపించేదేవిగా కీర్తించబడుతూ అలరారుతున్న దేవి శ్రీపద్మావతీదేవి. ఆ దేవియే అలమేలుమంగగా భక్తులచే కొనియాడబడుతోంది. ఈక్షేత్రం ఒకప్పుడు శుకమహర్షి తపస్సుచేసిన పరమపవిత్రప్రదేశం. శుకముని ఇక్కడ తపస్సు చేస్తున్నరోజుల్లో ఆ మహర్షిని దర్శించడంకోసం వచ్చిన భక్తులు కొందరు ఇక్కడే నివాసాలు ఏర్పరచుకోవడంవల్ల ఇక్కడ ఒకఊరు ఏర్పడింది. ఈఊరు ఆ మహర్షిపేరు మీదుగా 'శుకమునిఊరు' అని, 'శ్రీశుకనూరు' అని, ప్రజలవాడుకలో 'తిరుచ్చుకనూరు'గా వినుతికెక్కి కాలక్రమేణా నేటికి తిరుచానూరుగా పరిణమించింది.

శ్రీమహావిష్ణువు మహాలక్ష్మి అనుగ్రహంకోసమై తపిస్తుండగా "మహాలక్ష్మి అనుగ్రహంపొందాలంటే సువర్ణముఖీనదీతీరంలో తపస్సుచేయాలి" అని ఆకాశవాణి చెప్పింది. అంతట శ్రీనివాసుడు శ్రీశుకనూరుగా వినుతికెక్కిన నేటి తిరుచానూరులో కుంతాయుధంతో నేలను త్రవ్వి ఒకసరోవరం నిర్మించాడు. దేవలోకంనుండి పసిడిపద్మాలను తెచ్చి ఆ సరోవరంలో ఉంచాడు. ఆ సరోవరమే పద్మసరోవరం. ఆ పద్మాల వికాసంకోసం ఆ సరోవరానికి తూర్పువైపున సూర్యనారాయణస్వామిని ప్రతిష్ఠించి పూజించాడు. పిమ్మట మహాలక్ష్మి అనుగ్రహంకోసం పన్నెండేండ్లపాటు కఠోరతపస్సు చేశాడు శ్రీనివాసుడు.

అలా తపస్సుచేసిన శ్రీనివాసునికి కార్తికశుక్లపంచమితిథి, ఉత్తరాషాఢ నక్షత్రం, శుక్రవారంనాడు శ్రీమహాలక్ష్మి సహస్రదళస్వర్ణపద్మంనుంచి ఆవిర్భవించి సాక్షాత్కరించింది. ఈమె ఆనాటి నారాయణవనంప్రభువైన ఆకాశరాజుకు పద్మంలో పసిపాపగా కనిపించి ఆ రాజుచే పెంచబడి, పద్మావతి అను పేరుతో ప్రసిద్ధిగాంచింది. యుక్త వయస్సు వచ్చాక శ్రీనివాసుడినే వివాహమాడింది. స్వామి ఆదేశానుసారం తిరుచానూరులో కొలువై పద్మావతి దేవిగా, అలమేలుమంగమ్మగా కీర్తించబడుతూ, పూజలందుకొంటూ, భక్తుల కోర్కెలు తీరుస్తూ, భక్తుల నీరాజనాలు అందుకుంటూ ఉంది. అందుకే తిరుచానూరు 'అలమేలుమంగాపురం'గా నేటికీ ఖ్యాతి పొందుతూంది.





















నాటినుంచీ తిరుచానూరుక్షేత్రంలో శ్రీపద్మావతీదేవికి నిత్య పూజలతోపాటు, ఉత్సవాలు, ఊరేగింపులు, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్తికమాసం శుక్లపంచమీ తిథిరోజు పద్మసరోవరంలో అమ్మవారు ఆవిర్భవించింది గనుక నేటికీ కార్తికశుక్లపంచమికి పూర్తయ్యేవిధంగా కార్తికబ్రహ్మోత్స వాలను తి.తి.దే. భక్తరంజకంగా, అంగరంగవైభవంగా నిర్వహి స్తోంది. నిత్యసేవలు, నివేదనలు, ఉత్సవాలు, ఊరేగింపులు, బ్రహ్మోత్సవాలు అన్నీ తిరుమలలో స్వామివారికి జరిగినట్లే తిరుచానూరులో అమ్మవారికికూడా జరుగుతాయి. ఈ ఉత్సవాలు గజధ్వజపటంతో అందరికీ ఆహ్వానం పలుకుతూ కన్నుల పండువుగా ఆరంభమవుతాయి. ఇవి తొమ్మిదిరోజులపాటు నిర్వహించబడతాయి.

ఈ ఉత్సవాలలో అమ్మవారు ప్రతిరోజు మణులు, మాణిక్యాలు పొదగబడి ధగద్ధగాయమానంగా మెరిసే దివ్యా భరణాలను ధరించి దేదీప్యమానంగా ప్రకాశిస్తూ పగలు ఒక వాహనమును, రాత్రి ఇంకొకవాహనమును అధిరోహించి తిరు చానూరుక్షేత్రంలోని తిరుమాడవీథులలో విహరిస్తూ భక్తులకు నయనానందం కలిగిస్తుంది.

ముందుగా తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణంతో తిరు చానూరు పద్మావతీఅమ్మవారిఉత్సవాలు ప్రారంభమౌతాయి. శేషవాహనం, హంసవాహనం, ముత్యపుపందిరివాహనం, సింహవాహనం, కల్పవృక్షవాహనం, హనుమద్వాహనం, పల్లకీవాహనం, గజవాహనం, సర్వభూపాలవాహనం, గరుడవాహనం, సూర్యప్రభవాహనం, చంద్రప్రభవాహనం, రథోత్సవం, అశ్వవాహనం, తిరుచ్చిఉత్సవం, పంచమీతీర్థం, చక్రస్నానం, ధ్వజఅవరోహణం ఈవిధంగా ఈఉత్సవాల తొమ్మిదిరోజుల్లోనూ ఉదయసాయంకాలములందు వివిధ వాహనములనధిరోహించి తిరుచానూరు తిరుమాడవీథుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు శ్రీపద్మావతిఅమ్మవారు.

ఆ వాహనసేవలసమయంలో అమ్మవారిముందు,వెనుక, ఇరుప్రక్కల వివిధకళాబృందాల కోలాటాలు, చెక్కభజనలు, కేరళసంప్రదాయవాయిద్యాలు, మంగళవాయిద్యాలు, జియ్యర్ల ప్రబంధంనడుమ అమ్మవారు తిరువీథుల్లో ఊరేగుతూ అను గ్రహిస్తారు. కొందరుభక్తులు వివిధదేవతలరూపాలను ధరించి వచ్చి అమ్మవారిముందు ప్రదర్శనలిస్తారు.

తిరుచానూరు సమీపప్రాంతాలవారు ప్రతిసంవత్సరమూ లేదా రెండుమూడేండ్లకొకసారైనా ఈ పంచమీతీర్థఉత్సవాల్లో పాల్గొని తమ జన్మధన్యమయ్యిందని ఆనందిస్తూ ఉంటారు. దూర ప్రాంతాలవారుకూడా ఎంతోభక్తితో తిరుచానూరుకు తరలివచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందుతూ ఉంటారు.

*"అలమేలుమంగమ్మ ఉత్సవాల్లో పాల్గొందాం..*
*అమేయమైన అమ్మ అనుగ్రహం పొందుదాం"*








# కపిలతీర్థంలో.. అన్నాభిషేకం

- శ్రీ యం.వి.యస్.రామశేషు, 99089 92602

"అలంకార ప్రియో విష్ణుః, అభిషేక ప్రియశ్శివః" అంటారు. ఈశ్వరునికి అభిషేకం అంటే అత్యంత ప్రీతిపాత్రం. అందుకే శివలింగం మీద కాసినినీళ్లు పోసినా ఈశ్వరుడు సంతృప్తి చెందుతాడని అంటారు. అభిషేకంఅంటే స్నానం చేయించే ప్రక్రియ. స్వామికి ప్రతిరోజూ పవిత్ర జలం, ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి, తేనె, పంచదార, కొబ్బరినీరు, చెరకురసం, గంధపుసారం, విభూతివంటి 11 పవిత్రద్రవ్యాలతో అభిషేకస్నానం చేయిస్తారు. వీనిలో పంచామృతాలుగా పిలువబడే ఆవుపాలు, ఆవు నెయ్యి, ఆవుపెరుగు, తేనె, పంచదారలతో చేసే అభిషేకం శివునికి అత్యంత ఇష్టమైనది అని భక్తుల నమ్మకం. పై పదార్థాలన్నింటితో చేసే అభిషేకంకన్నా స్వామికి అన్నంతోచేసే అభిషేకం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఏడాదికి ఒకసారి ఈ అన్నాభిషేకం చేయబడుతుంది. కార్తికమాసంలో పౌర్ణమిరోజున కపిలేశ్వరస్వామికి చేసే అన్నాభిషేకం అత్యంత పవిత్రమైనది.

తిరుమలకొండపాదభాగాన అలిపిరికి అతి సమీపంలో ఒక శివాలయం ఉన్నది. అదే కపిలేశ్వరస్వామివారిఆలయం. ఈ ఆలయానికి సమీపంలో ఉన్న తీర్థమును కపిలతీర్థమని, చక్రతీర్థమని, ఆళ్వార్‌తీర్థమని వ్యవహరిస్తారు. కృతయుగంలో కపిలమహర్షి పాతాళలోకంలో పూజించిన శివలింగం భూమిని చీల్చుకుని స్వయంభూలింగంగా ఇక్కడ వెలసింది. కపిలుడు పూజించిన లింగము కనుక ఇది కపిలేశ్వరలింగంగా ప్రసిద్ధి పొందింది.

"శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే"- అన్నట్లుగా శ్రీవారిపాదాలచెంతనున్న ఈ ఆలయం శివకేశవ అభేదాన్ని తెలుపుతుంది. ఈ ఆలయంలో కార్తికమాసంలో ప్రత్యేకపూజలు జరుగుతాయి. కార్తికమాసంలో సోమవారాలు, ఏకాదశి, మాసశివరాత్రి, పూర్ణిమ మొదలైన ప్రత్యేకతిథులలో స్వామికి విశేషార్చనలు నిర్వహిస్తారు. ఆలయప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగిస్తారు.

"అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః!
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః!!"

- అని భగవానుడు గీతలో చెప్పాడు. అన్నంవలన సమస్తసృష్టి సంతృప్తిని పొందుతుంది. మన పవిత్రగ్రంథాల ప్రకారం బియ్యం జీవితం, సంపద, శ్రేయస్సుకు చిహ్నం. మానవజీవితంలో అన్నంయొక్క ప్రాముఖ్యత, దైవంయొక్క పాత్రను సూచించడానికి ఈ అన్నాభిషేకాన్ని నిర్వహిస్తారు. తైత్తిరీయోపనిషత్తులో...

"ఆత్మనా ఆకాశస్సమః ఆకాశా ద్వాయుః
వాయో రగ్నిః అగ్నే రాపః ఆపః పృథివీ
పృథివ్యా ఓషధయః ఓషధీభ్యఃఅన్నం
అన్నా ద్రేతః రేతసః పురుషః"

- అని చెప్పబడింది. మానవజీవనానికి ఆధారమైన అన్నంయొక్క ప్రాధాన్యత ఈ శ్లోకంలో వర్ణించబడింది.

కార్తికపౌర్ణమిరోజున శ్రీకపిలేశ్వరమహాలింగమైన స్వామికి ఈ అన్నాభిషేకాన్ని నిర్వర్తిస్తారు. ఆరోజున కపిలేశ్వర మహాలింగమూలమూర్తికి ముందుగా శుద్ధోదకస్నానంతో అభిషేకం చేస్తారు. ఆ తర్వాత దాదాపు రెండువందలకిలోల బియ్యంతో వండినఅన్నంతో లింగానికి అన్నాభిషేకం చేస్తారు.

బియ్యం అనేది జీవితం, సంపద, శ్రేయస్సుకు చిహ్నం



తలనుంచి పానవట్టందాకా లింగాన్ని వండినఅన్నంతో పూర్తిగా కప్పివేస్తారు. ఆ తర్వాత దానిపై అన్నంతోనే ఒకలింగ రూపాన్ని తీర్చిదిద్ది అర్చకులు అలంకారాన్ని చేస్తారు. సాయంత్రం భక్తులకు అన్నలింగదర్శనం చేయించి, ఆ తర్వాత ఉద్వాసన చెబుతారు. ఆ తర్వాత అన్నాభిషేకం చేసిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టడం ఆచారం.



కపిలతీర్థంలో ముక్కోటి ప్రసిద్ధి గాంచినదీ ఉత్సవం. సౌరమానం ప్రకారం తులామాసం కార్తికపూర్ణిమ రోజున కపిలేశ్వరస్వామిమూలమూర్తికి అన్నాభిషేకం అనే ఈ విశేషఉత్సవం జరుపబడుతుంది. ఈ అభిషేకఉత్సవం అయిన తరువాత మధ్యాహ్నం విశేషపూజ, నివేదన, సర్వదర్శనం, ప్రసాదవితరణ నిర్వహిస్తారు. అన్నం ప్రకృతిలోని పంచభూతాలకలయికయొక్క ఫలితం. విత్తనం నాటినప్పుడు అది ఆకాశంనుండి కురిసిన వర్షపునీరు, సూర్యునినుండి అగ్నిద్వారా పోషణ పొందుతుంది. తర్వాత గాలిద్వారా వరిగా మారుతుంది. అదే తర్వాత బియ్యంగా రూపాంతరం చెంది జీవులకు ఆహారంగా అందించబడుతుంది. అందుకే పంచభూతాత్మకుడైన పరమేశ్వరునికి చేసే ఈ అన్నాభిషేకంవలన ప్రజల ఈతిబాధలు తొలగిపోతాయి. ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. ఈ అభిషేకప్రసాదము జ్ఞాపకశక్తిని వృద్ధిచేస్తుంది. మనుషులకు అంతర్గతశాంతిని కలుగచేస్తుంది. ముక్కోటిగా ప్రసిద్ధిపొందిన ఈ అన్నాభిషేకాన్ని దర్శించడానికి కార్తికపూర్ణిమరోజున భక్తులు తండోపతండాలుగా కపిలతీర్థానికి తరలివచ్చి స్వామివారికృపకు పాత్రులవుతారు. *సర్వేజనా స్సుఖినో భవన్తు! లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు!!*

# తరలిరండి!!

**తరలిరండి...**
**తరలిరండి తరలిరండి భక్తులారా!**
**కాంచరండి 'మంగమ్మ'ను కనులారా!**
**మ్రొక్కరండి మీరంతా మనసారా!!**

**అలర్‌మేల్‌మంగమ్మకు నిలయం, నిలయం**
**అంతులేని దివ్య, భవ్య కాంతులవలయం**
**అచ్యుతుని అర్ధాంగి ఉత్సవం...**
**అద్భుతమైనది ఈ బ్రహ్మోత్సవం 'అమ్మ' బ్రహ్మోత్సవం**

**పల్లవుల, చోళులా పాలనలో..**
**పల్లవించిన భక్తికి నిదర్శనం**
**చల్లని తన చూపులతో జగతిని**
**కాచే ఆ తల్లికిది బ్రహ్మోత్సవం ఈ బ్రహ్మోత్సవం**

**ఆత్మల పులకింపజేయు నేత్రోత్సవం..**
**పరమాత్ముని కీర్తించే భవ్యోత్సవం**
**నిరుపమానమైనది ఈ దివ్యోత్సవం**
**అమ్మ ఘనత వివరించే మహాఉత్సవం ఈ బ్రహ్మోత్సవం**

**పద్మంపై.. పద్మంపై వెలసినట్టి 'పద్మావతి'కి**
**శిరసువంచి మ్రొక్కంగా రారండి**
**జగమంతా 'శాంతి-వెలుగు' నిండాలని**
**జననిని కోరంగా... వేగరండి మీరు రారండి!!**

*- డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు, 96402 33930*

# అలమేలుమంగమ్మ ప్రసాదాలన్నీ అమృతమయం!

- డా॥ యస్.పద్మావతి, 96762 69300

తిరుచానూరులో కొలువైఉన్న అలమేలుమంగకు ప్రాతఃకాలం సుప్రభాతసేవనుండి రాత్రి పవళింపుసేవవరకు ఎన్నో కైంకర్యాలు జరుగుతాయి. ఈ కైంకర్యాలకుగాను ఎన్నోరకాలైన ప్రసాదాలు నివేదనం చేయబడతాయి. అలాగే నిత్య, వార, పక్ష, మాస, సంవత్సర ఉత్సవాల్లో జరిగే కైంకర్యాలకుకూడా ఎన్నో! ఎన్నెన్నో ప్రసాదాలను అన్నివేళలా అప్రమత్తంగా వేళ మించకుండా, అమ్మవారి ఆకలిని గమనిస్తూ సరైనవేళల్లో సమర్పించేందుకై అహరహం అమ్మవారిపాచకులు వంటశాలలో వంటలతయారీలో నిమగ్నమై ఉంటారు. వారికి ఎప్పుడు ఏఉత్సవం జరుగుతుందో అప్పుడు ఆవేళ అవసరమయ్యే ప్రసాదాన్ని రుచి కరంగా వండివడ్డిస్తూంటారు అమ్మవారి పరిచారక అర్చకస్వాములు. ఈ ప్రసాదాల తయారీలో కొన్ని నిబంధనలుకూడా తప్పక పాటించాలని మరీచికల్పం చెప్తోంది. అవి ఒకేపాత్రలో ద్రోణంకన్నా ఎక్కువ అన్నం వండరాదు. మట్టి కుండలు నైవేద్యానికి ఉపయోగిస్తే ఒకమాసం పైబడినవాటిని వాడకూడదు. అమ్మవారికి సిద్ధంచేసిన ప్రసాదాలను వాసన చూడకూడదు. పక్వంకాని ప్రసాదాన్ని వదిలేయాలి. వెంట్రుకలు, కీటకాలుపడిన ప్రసాదం నివేదించ రాదు. ప్రసాదాలు అమ్మవారికి నివేదించేవరకు అన్యులదృష్టి పడకూడదు. చెమట ప్రసాదంలో చిందకూడదు. చల్లబడినదీ, ఒకపాత్రలో మిగిలిన అన్నాన్ని నివేదించకూడదు. అలాంటి ప్రసాదాలగురించి తెలుసుకుందాం...

సకలప్రాణికోటికి అన్నపానీయాలనిచ్చే విశ్వజనని శ్రీపద్మావతీ దేవి వెలసిన శ్రీతిరుచానూరుక్షేత్రంలో ప్రతిరోజూ త్రికాలములలో దేవికి అనేకరకాలప్రసాదాలను నివేదిస్తారు. వ్యాసపుత్రుడు శుకమునీంద్రుడు తపించిన శ్రీతిరుచానూరుక్షేత్రంలో శ్రీమహాలక్ష్మియే శ్రీపద్మావతిగా కొలువై నిత్యపూజలందుకొంటూంది. ఏదేవాలయంలో శాస్త్రవిధిననుసరించి ఎంతవిశేషంగా అర్చన జరుగుతుందో అక్కడ ఆ దైవం అంత తేజో వంతంగా విరాజిల్లుతుంది. ఎంత నైవేద్యం సమర్పణ జరుగుతుందో అంత శక్తివంతంగా ఉంటుంది. ఈకారణంచేతనే దేవాలయాల్లో అర్చనాదులతోపాటు. నివేదనకు శాస్త్రం అత్యంత ప్రాధాన్యత నిచ్చింది. భక్తిశ్రద్ధలతో నివేదించిన అన్నాదులను అమ్మవారు స్వీక రించి వాటిని అమృతతుల్యములుగా చేసి భక్తులకు ప్రసాదంగా అనుగ్రహిస్తుంది.



అలమేలుమంగమ్మవారికి సుప్రభాత సేవలో చక్కెర, పచ్చిఆవుపాలు, నారికేళఖంధ ద్వయం, (కొబ్బరిచిప్పలు- రెండు) పచ్చ కర్పూరంతో తాంబూలం ఇస్తారు. నిత్య సహస్రనామార్చనలో బెల్లంముక్కలను, కర్పూరతాంబూలమును నివేదిస్తారు. ఉదయం ఆరుగంటలకు ప్రథమఅర్చనలో గుడాన్నం-అంటే బెల్లంపొంగలి, ముద్గాన్నం అంటే కట్టుపొంగలి, పులిహోర, రవ్వకేసరి,

వడ, లడ్డు, చుక్కాన్నం, మాత్రాన్నం అంటే వెన్న, పెరుగుకలిపిన అన్నం, దధ్యోదనం అంటే పెరుగన్నం, కర్పూరతాంబూలం సమర్పిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు గుడాన్నం, ముద్గాన్నం, పులిహోర, దధ్యోదనం, కర్పూరతాంబూలం సమర్పిస్తారు. సాయంత్రం 6గంటలకు గుడాన్నం, ముద్గాన్నం, పులిహోర, దధ్యోదనం, కర్పూరతాంబూలం సమర్పిస్తారు. పవళింపుసేవ రాత్రి తొమ్మిదిగంటలకు. ఈసేవలో కాచిన క్షీరం, చక్కెర, పరవర్ణ్యం, కర్పూరతాంబూలం సమర్పిస్తారు. శుక్రవారం క్షీరాన్నం అంటే పాయసాన్నాన్ని విశేషంగా సమర్పిస్తారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలసందర్భంగా ప్రత్యేక ప్రసాదాలుకూడా తయారుచేస్తారు. అవి– పొంగల్, సీరా, క్షీరాన్నం, వడ, దోసె, బూందీలడ్డు, పులిహోర, కదంబం, దధ్యోదనం, మల్‌హోర, కారంపులిహోర, అప్పం మొదలైనవి. ఇవి బ్రహ్మోత్సవాల్లో దర్శించవచ్చే భక్తులకు పంచబడతాయి. అమ్మవారికి నివేదించిన ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవి. అమ్మవారిప్రసాదాలను పొందిన భక్తులు మహద్భాగ్యంగా కళ్ళకు అద్దుకొని స్వీకరించి యాత్ర సఫలమయ్యిందని భావిస్తారు.

అమ్మవారి దివ్యకరుణాకటాక్షములే అన్నప్రసాదముల రూపంగా భక్తులకు లభిస్తున్నాయి. తల్లి పిల్లలనుండి ఏమీ ఆశించదు. ఏతల్లిఅయినా సంతానంయొక్క సుఖసంతోషాలే కోరుకొంటుంది. విశ్వమాతగా కీర్తించబడే పద్మావతీఅమ్మవారు తనకు నివేదించబడిన పదార్థములను తాను స్వీకరించి ఆయు రారోగ్యసంపత్తులు ప్రసాదించేవాటిగాచేసి తిరిగి సంతానమైన భక్తులకు అందజేస్తుంది.

**అమృతకలశం-**పద్మావతి అమ్మవారికి నివేదించే ప్రసాదాల్లో లడ్డూపేరే అమృతకలశం. శ్రీపద్మావతిదేవిని దర్శించడానికి ప్రతి రోజూ వేలాదిగా భక్తులు తిరుచానూరుక్షేత్రానికి తరలివస్తారు. కరుణాంతరంగయైన శ్రీపద్మావతిఅమ్మవారిదర్శనంతో భక్తులు ఎంతగా ఆనందపరవశులవుతారో ఆ అమ్మవారిప్రసాదాన్ని పొందడాన్ని అంతేభాగ్యంగా భావించి ఆసక్తిగా స్వీకరిస్తారు. అమ్మవారి ప్రసాదం చేతికందగానే ఆనందంతో పరవశిస్తారు. అమ్మవారి ప్రసాదాలన్నింటిలోనూ భక్తులు అధికంగా ఆసక్తి చూపే అమృతపదార్థం అమ్మవారిలడ్డూ. అదే అమృతకలశం. ఈ లడ్డూ ప్రసాదంపొందిన భక్తులఆనందం వర్ణనాతీతం. అందుకే అమ్మవారిలడ్డూ, వడప్రసాదాలప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని తి.తి.దే. 2003 జూలై 23వతేదీన అమ్మవారి సన్నిధిలో లడ్డూపోటు (తయారీ) ప్రారంభించి లడ్డూతయారికి ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టింది. ఆ ప్రసాదమే అమృత మయంగా 2004వ సంవత్సరంనుంచి అమృతకలశంపేరుతో భక్తులకు అందజేస్తున్న చక్కెరలడ్డూలు. మరి ఈ లడ్డూలలో ప్రధానంగా చక్కెర, శనగపిండి, నెయ్యి, యాలకులు, సొంఠి, జాజికాయ, పచ్చకర్పూరం తదితర పదార్థాలను ఉపయోగిస్తారు.

అమృతకలశంలడ్డూల తర్వాత భక్తులు ఎక్కువగా ఆసక్తిచూపే మరోప్రసాదం వడ. ఈ వడలకుగాను మినపప్పు, బియ్యం, నెయ్యి, మిరియాలు, జీలకర్ర వినియోగిస్తారు.

ఈవిధంగా విశ్వమాత అయిన శ్రీపద్మావతిఅమ్మవారి కృపాకటాక్షాలు ఈ ప్రసాదాలరూపంలో భక్తులకు అందు తున్నాయి. ఆ తల్లిఅనుగ్రహం ఆమె ప్రసాదాలరూపంలో ఉంటుందని భక్తులు భావిస్తారు. అందునా అమృతకలశం లడ్డూలను అంటే అది అమృతమయంగా భావిస్తారు. అందుకే భక్తులు ఆ అమృతకలశంలడ్డూకోసం బారులుతీరి నిలిచి వేచి ఉండి ఆ లడ్డూ లభించగానే మహద్భాగ్యంగా అందుకొని భక్తి పారవశ్యంతో కళ్ళకద్దుకొని స్వీకరించి తమకు అమ్మవారి అను గ్రహం సంపూర్ణంగా సిద్ధించిందని సంతృప్తి చెందుతారు. నిజంగా అమృతకలశంలడ్డూ అమృతమయం. అలమేలు మంగమ్మను ధ్యానించు. దర్శించు. తరించు. అలమేలుమంగ అనుగ్రహం అమేయం.

శ్రీపద్మావత్యైనమః







# మంగళకైశికి మాహాత్మ్యము

– డా|| మైలవరపు లలితకుమారి,
99595 10422

**నీ పాదకమల సేవయు**
**నీ పాదార్చకులతోడి నెయ్యము నితాం**
**తాపార భూతదయయు**
**తాపసమందార నాకు దయసేయగదే!**

తిరుమలలో స్వామిఆలయంలో ప్రతిసంవత్సరం కార్తికద్వాదశి రోజున కైశికద్వాదశిఉత్సవం జరుగుతుంది. ఈ కైశికద్వాదశినే క్షీరాబ్ధి ద్వాదశి, మథనద్వాదశి, యోగినీద్వాదశి అనికూడా పిలుస్తారు. ఈ కైశిక ద్వాదశిరోజున ఆలయంలోని పంచబేరమూర్తులలో ఒకరైన ఉగ్రశ్రీనివాస మూర్తి సూర్యోదయానికి పూర్వమే ఆలయంనుండి బయలుదేరి తిరుమల నాలుగుమాడవీథులలో ప్రదక్షిణంచేసి రంగమండపంలోనికి వేంచేసి, శ్రీదేవి భూదేవిసమేతుడై భక్తులను అనుగ్రహిస్తారు. ఆలయంలో అర్చన నైవేద్యాలు ముగిసినతరువాత కైశికద్వాదశిఆస్థానం జరుగుతుంది. ఆసమయంలో స్వామికి కైశికపురాణంలోని నంబాడువాన్‌కథను వినిపించి హరిగానమహిమను తెలియజేస్తారు.

వేదవ్యాసమహర్షి రచించిన అష్టాదశపురాణాల్లో ఒకటైన వరాహపురాణం 44వసర్గలో కైశికద్వాదశిగురించి చెప్పబడింది. వరాహావతారంలో భూదేవికి మహా విష్ణువు చెప్పిన నంబాడువాన్‌కథే కైశికపురాణంగా ప్రసిద్ధిచెందింది.

సాహితీసమరాంగణసార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్త మాల్యదలో దాసరికథ అనేపేరుతో చిన్నచిన్నమార్పులతో ఈ కథను చెప్పాడు. ఇది సంకీర్తనామహిమవైభవాన్ని తెలియజేస్తుంది. శ్రీనివాసుని భక్తుడైన శ్రీకృష్ణదేవరాయలు మోక్షసాధనకు భక్తినిమించిన సాధనం మరొకటిలేదని మానవకోటికి తెలియజేసిన దివ్యప్రబంధం ఆముక్తమాల్యద. మోక్షానికి జాతి మత కులాలు ప్రధానంకాదని భక్తి ఒక్కటే ప్రధానమని చెప్పేదే నిమ్నకులస్థుడైన ఈ దాసరికథ.

శ్రీమహావిష్ణువు వామనరూపంలో వెలసిన పుణ్యక్షేత్రం తిరుకురుం గుడి. ఇది 108 దివ్యవైష్ణవక్షేత్రాల్లో ఒకటి. ఇది తమిళనాడులో ఉన్నది. ఇక్కడి స్వామిని మన్నారుదాసస్వామిగా కొలుస్తారు. ఈ స్వామి ఆలయానికి కొద్దిదూరంలో విష్ణుభక్తుడైన దాసరి నివసించే పల్లె ఉన్నది. స్వామిని తన కీర్తనలద్వారా సేవించడమే ఇతని నిత్యకృత్యం. ప్రతిరోజు బ్రాహ్మీ ముహూర్తంలో లేచి ఇంటినుండి బయలుదేరి ఆలయానికి వెళ్లే వాడు. తనచేతిలోని కిన్నెరవీణమీటుతూ మంగళకైశికిరాగంతో స్వామిని కీర్తిస్తూ గానం చేసేవాడు.



అతడు తననుతాను మరిచిపోయి భక్తితో లయ బద్ధంగా నృత్యంచేస్తూ స్వామిని కీర్తించేవాడు. ఆతరువాత ఆలయప్రాకారానికి ప్రదక్షిణంచేసి గుడిలోనుంచి వచ్చిన భక్తులు పెట్టే తీర్థప్రసాదాలు తీసుకొని సాయంత్రానికి ఇల్లు చేరుకునేవాడు.

ఒకరోజు రాత్రి కోడి అకాలంలో కూసినకూతలు విన్న దాసరి నిద్రలేచి స్వామిఆలయానికి బయలుదేరాడు. దారిలో మర్లుతీగ తొక్కాడు. ఆ తీగతొక్కినవారు దారి మరిచిపోయి అయో మయంగా తిరుగుతుంటారట. ఆ దాసరికూడా దారితప్పి తిరిగి తిరిగి అడవిలోని ఒక మర్రిచెట్టు వద్దకు చేరుకున్నాడు. ఆ చెట్టు మీద ఒక బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు. వాడు దాసరిని చూడగానే వచ్చి గట్టిగా పట్టుకున్నాడు. దాసరి తనదగ్గర ఉన్న కర్రతో వాడిని



కొట్టడం ప్రారంభించాడు. రాక్షసుడు దానిని విరిచేశాడు. ఇద్దరి పెనుగులాటలో దాసరి రాక్షసుడిచేతికి చిక్కాడు. నన్ను ఇంతగా శ్రమపెట్టిన నిన్ను విడువను అన్నాడు. నరమాంసమే నాకు ఆహారం కనుక నిన్ను చంపి తింటాను అన్నాడు. అందుకు దాసరి నా శరీరాన్ని నీకు ఆహారంగా ఇచ్చినందువల్ల నాకు ఎంతోమేలు జరుగుతుంది. ఈ శరీరం ఎప్పుడైనా నశించి పోయేదే. ఆత్మ శాశ్వతమైనది. ఒకప్రాణి ఆకలిని తీర్చి అతని ప్రాణాలు నిలిపినందువలన నాకు శాశ్వతమోక్షం కలిగి స్వామిని చేరుకుంటాను అన్నాడు దాసరి. నా ఈశరీరాన్ని నీకు ఆహారంగా సమర్పించడానికి నేను సిద్ధమే కానీ నాదొక్క ప్రార్థన. నేను ప్రతిరోజు ఇక్కడికి సమీపంలోఉన్న తిరుకురుంగుడిలోనిస్వామిని ప్రార్థన చేస్తున్నాను. ఈ రోజుతో ఆ వ్రతం పూర్తౌతుంది. ఆలయానికి వెళ్ళి రావటానికి అనుమతి ఇవ్వుమని ప్రార్థించాడు. ఎవరైనా నోటికి దొరికిన ఆహారాన్ని వదులుకుంటారా? నేను నీ మాటలు నమ్మను అన్నాడు రాక్షసుడు.

దాసరి ఎన్ని శపథాలు చేసినాకూడా రాక్షసుడు నమ్మ లేదు. నేను నిత్యం సేవించే ఆ దేవదేవునిపైన ఆన అని శపథం చేశాడు. అప్పుడతనిని వదిలిపెట్టాడు రాక్షసుడు.

దాసరి కురుంగుడికి వెళ్ళి తనివితీరా శ్రీహరిగానా లాపనచేసి, స్వామికి సాష్టాంగనమస్కారాలు చేసి, బ్రహ్మ రాక్షసుడివద్దకు వచ్చాడు. తనను ఆహారంగా స్వీకరించుమని కోరాడు. దాసరి సత్యవాక్పరిపాలనకు అచ్చెరువొందిన రాక్షసుడు ఇంతకుమునుపు ఎవ్వరూ ఇలా శరీరాన్ని దానం చేయలేదు అంటూ అతనిని స్తుతించాడు.

ఓ దాసరీ! నీవు శ్రీహరిపాదసేవనమే జీవనంగా కల వాడివి. కురుంగుడిస్వామిదయకు పాత్రుడివి. నీ కిన్నెరవీణను మీటుతూ శ్రీహరిగానం అను తెప్పచే భవసాగరాన్ని దాటు తున్నావు. నీకు సాటిరాగల భక్తుడు ఎవరూ లేరు అన్నాడు రాక్షసుడు. నీ వంటి మహానుభావుడి దయవలనే నేను శాప విముక్తుణ్ణి అవుతాను. నేను పూర్వజన్మలో సోమశర్మ అను బ్రాహ్మణుడిని. ఒక మహాయాగాన్ని చేస్తూ మరణించాను. ఆ యాగానికి విఘ్నం కలిగినందువల్ల ఈ రాక్షసరూపాన్ని పొందాను. నీ మంగళకైశికిరాగగానఫలాన్ని నాకు ధారపోసి ఈ రాక్షసరూపాన్ని పోగొట్టుమని ప్రార్థించాడు రాక్షసుడు. ఆ మాటలకు దాసరి అయ్యా! నేను స్వామిని కీర్తించడమేగానీ ఈ గానమాహాత్మ్యము నాకు తెలియదు, నేనెరుగను అన్నాడు. ఆనాటి గానఫలాన్ని తనకి ఇవ్వుమన్నాడు బ్రహ్మరాక్షసుడు. ఆ ఫలంతో బ్రహ్మరాక్షసుడు శాపవిముక్తిని పొంది తిరిగి వైష్ణవ స్వరూపాన్ని ధరించాడు. ద్వాదశినాటి పుణ్యఫలంగా బ్రహ్మ రాక్షసుడు శాపవిముక్తుడైన రోజుకనుక ఈరోజు కైశికద్వాదశిగా ప్రసిద్ధిపొందింది. కులంకన్నా గుణం మిన్న. పరమాత్మదృష్టిలో కులం మతం జాతి అన్న వివక్షత లేదు. మనం చేసిన ఏ పనైనా పరమాత్మకైంకర్యంగా భావించడమే మోక్షహేతువు అన్నవిషయం ఈ కథద్వారా మనకు అవగతమవుతుంది.

# వస్త్రాలంకరణసేవలో...
# స్వతంత్రవీరలక్ష్మి

- డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి, 82475 78748



**సకల వర్ణ శోభిత**
**గంభీరావర్తనాభిః స్తనభరణ మితా..,**
**శుభ్ర వస్త్రోత్తరీయా..**

*అని అనడంద్వారా శుభ్రమైనవస్త్రాలను ధరించడం లక్ష్మీప్రదమని తెలుస్తోంది. నేటి కాలంలో మనకు అనేకవర్ణాలవస్త్రాలు విరివిగా లభిస్తున్నపటికీ, వాటిలో పట్టువస్త్రాలస్థానం అగ్రిమమే.. తిరుచానూరులో కొలువైఉన్న అల మేలుమంగమ్మకు కార్తికమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు అసంఖ్యాకంగా భక్తులు వస్తారు. ఎందరోభక్తులు ఆ సమయంలో అమ్మ వారికి తమవంతుసేవగా ఎన్నోరకాలచీరలను సమర్పించుకుంటారు. అందులో ఘనమైన పట్టుచీరలైతే అసంఖ్యాకంగా సమర్పించబడ తాయి అమ్మవారికి. పద్మశాలీల సంఘంవారు పద్మావతిఅమ్మవారి సింహవాహనోత్సవం రోజున అమ్మవారికి చీరసారెలు సమర్పించు కుంటారు. అందులో ఘనమైన పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ పట్టుచీరలఅలంకరణలో, రోజుకొక వైభవంగా సౌందర్యంతో ఎంతగానో దేదీప్యమానంగా ప్రకాశిస్తుంటారు అమ్మవారు. ఆ చీరల్లోని వర్ణాలను, వాటి అలంకరణవిశేషాలను కొంత తెలుసుకుందాం...*

పట్టుబట్టలు ఎలక్ట్రోమాగ్నెటిక్ఎనర్జీని ఆకర్షించి, నిల్వచేసే సామర్థ్యాన్ని కలిగిఉంటాయి. శరీరం మరియూ పట్టుబట్టలమధ్యఘర్షణతో విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది. దీనివలన పాజిటివ్ఎనర్జీ విడుదలవుతుంది. పూజాదికార్యక్రమాల్లో ఉత్పన్నమయ్యే సకారాత్మకశక్తిని పట్టుదుస్తులను ధరించినపుడు గ్రహించుటకు మరింత అవకాశం ఉంటుంది. ఈ శక్తి మనసుపై ప్రభావాన్ని చూపుతుంది.

సామాన్యమానవులు ఈ పట్టువస్త్రాలను ధరించడంవలన ఇంతటి ప్రయోజనం ఉంటే, జగన్మాత అయిన ఆ తల్లికి పవిత్రపట్టువస్త్రాలను ధరింప చేయడంవల్ల ఆశక్తి అనంతమై భక్తులపై ఇంకెంతగా ప్రసరిస్తుందో కదా!

వివిధవర్ణాలకు సంబంధించిన వస్త్రాలు ధరించడంవలన ఆ యా గ్రహాలకు సంబంధించిన అనుగ్రహాన్నికూడా మనం మరింతగా పొందవచ్చు. మరి ఆ గ్రహాదిదేవతలకు అధిదేవత అయినటువంటి ఆ పరాత్పరికి వివిధ రంగుల పట్టుచీరలు ధరింపచేయడంచేత భక్తులకుకూడా అనేక అనుకూలములు, శుభములు జరుగుతాయి.

## ఎరుపువర్ణం (కెంపు)

ఆదిత్యునికి సంకేతమైనది. ఈ వర్ణము కార్యశీలతకు, అంతః శక్తికి, శత్రువులపట్ల కోపానికి, మనలోఉన్న ఉత్తేజానికి, ఆరోగ్యానికీ, ఆనంతమైనధైర్యం, తీవ్రమైన అభిరుచికి ఈ ఎరుపువర్ణం ప్రతీకగా నిలుస్తోంది.

*"అరుణారుణకౌసుంభ వస్త్ర భాస్వత్కటీత్కటీ"* అంటూ రక్త వర్ణపువస్త్రాలను ప్రీతికరంగా ధరించేతల్లిగా జగన్మాత కొని యాడబడుతోంది. ఇటువంటి వస్త్రధారణవల్ల భక్తులు అమ్మవారి అనుగ్రహాన్ని పొందుతారు.





**తెలుపువర్ణం-** ఈ వర్ణము చంద్రునికి సంకేతం. చంద్రుడు మనః శాంతికారకుడు. తెల్లటివస్త్రాలు, తెల్లనిపువ్వులు, ముత్యాలు ఇవన్నీ చంద్రునికి ప్రతీకలు. కావున శ్వేతవస్త్రధారిణిఅయిన అమ్మను అర్చించడంవలన చంద్రానుగ్రహాన్నికూడా పొందవచ్చు.

**శ్వేతాంబరధరేదేవి నానాలంకారభూషితే!**
**జగత్స్థితే జగన్మాతః మహాలక్ష్మీ నమోస్తుతే!!**

అనేకవర్ణముల వస్త్రాలున్నప్పటికీ వాటిలో జగన్మాతకు ఎక్కువగా ధరింపచేసేది శ్వేతవర్ణపువస్త్రాలే. అహింసకు తార్కాణం ఈ శ్వేతవర్ణం. శాంతికి, స్వచ్ఛతకు, శుభ్రతకు, నిర్మలత్వానికి ప్రతీకగా ఈ తెలుపురంగును అభివర్ణిస్తారు. ఈప్రకారం మహాలక్ష్మి స్వచ్ఛతకు ఆలంబనగా నిలుస్తుంది. తెలుపువర్ణంమీద



ఏ చిన్నరంగుపడినా, అది సహజత్వాన్ని కోల్పోతుంది. చూడడానికి శోభగా అనిపించదు. అందుకే మనిషికూడా ఏతప్పుచేయకుండా స్వచ్ఛంగా ఉండాలని, ఆ తల్లి ధరించే ధవళవస్త్రాలు సూచిస్తాయి.. అంతేకాకుండా తాను క్షీరాబ్ధితనయ, చంద్రసహోదరి అయినందున ఈవర్ణపువస్త్రాలు ధరించడంవలన ఆతల్లి అనుగ్రహానికి పాత్రులమవుతాం.

**పగడపువర్ణం-** ఇది కుజగ్రహానికి ప్రతీకగా నిలుస్తోంది. చెడుప్రభావాలను నివారించటానికి కుజబలంకోసం మానసికఒత్తిడి, మానసికవ్యాధులనివారణకు, సానుకూలప్రభావానికి ఈ పగడపువర్ణాలవస్త్రాలను ధరించడం శ్రేయోదాయకం. ఈ వర్ణపువస్త్రాలు ధరించిన విష్ణుపత్నిని దర్శించటంచేత కుజుని అనుగ్రహం పొందవచ్చు.



**ఆకుపచ్చవర్ణం-** బుధగ్రహానికి ప్రతీక. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన వర్ణం ఈ ఆకుపచ్చ. ఈరంగు అభివ్యక్తశక్తికి, వికాసానికి ప్రతీక. సారభూతమైన భూదేవి పచ్చదనానికి సంకేతం. ఈవర్ణం ధరించడంవల్ల వృద్ధి, సామరస్యశక్తి లభిస్తాయి. దుష్టగ్రహాలకు, శక్తులకు వ్యతిరేకంగా పచ్చదనాన్ని ఇస్తుంది. రక్తవర్ణానికి వ్యతిరేకంగా ప్రభావాన్ని చూపుతుంది. ప్రకృతితో సన్నిహితం కలిగినది. ధాన్యలక్ష్మికి సంకేతమైనది. కనుక ఈ వర్ణపుచీరను ఆ తల్లికి ధరింపచేయడంవలన ఆమాత చల్లనిచూపులవల్ల ధాన్యాదులతో, ప్రశాంతచిత్తంతో భక్తులు మనగలుగుతారు.



**పసుపువర్ణం-** ఈ వర్ణానికి అధిపతి గురుడు. గురుని ధ్యానించటంవలన జ్ఞానవృద్ధి, విద్యాప్రాప్తి కలుగుతాయి. పసుపువర్ణము ఆనందం, ప్రకాశం,

శాంతి మరియూ ఆనందాన్ని సూచిస్తుంది. పసుపు శక్తికీ, వెలుగుకూ, తెలివికీ ప్రతీకగా నిలుస్తోంది. అందుకే మహాలక్ష్మిని పసుపురంగు వస్త్రాలతో అలంకరించి.. **"పీతవస్త్రాం సువర్ణాంగీమ్ పద్మ హస్త ద్వయాన్వితా"** అంటూ స్తుతించి భక్తులు ఆ లోకమాత అనుగ్రహానికి పాత్రులై, ధనసంపదలను పొందుతారు.



**తెలుపువర్ణం-** శుక్రగ్రహఅనుకూలతకు తెల్లనివస్త్రాలు ధరించటం మేలు. కీర్తి, వైవాహికఆనందానికి శుక్రుడు కారకుడు కావున, గ్రహాధిదేవత అయిన జగజ్జననిని తెల్లనివస్త్రభూషితగా దర్శించటం వల్ల శుక్రుని అనుగ్రహం పొందవచ్చు.

**నీలంవర్ణం-** ఈ వర్ణం శనిగ్రహానికి ప్రతీక. శనిగ్రహం అనుకూలముకై నీలవస్త్రధారణ చేసిన తల్లిని దర్శించటంచేత ఆయుర్వృద్ధిని పొంద వచ్చు. యముని దుష్ప్రభావాలను తొలగించుకోవటానికి నీలవస్త్ర అంబరధారిణిఅయిన అమ్మ దయాదృక్కులు అవసరం. ప్రశాంతంగా ఉండేందుకు ఈ వర్ణం తోడ్పడుతుంది. క్రియాశీలకంగా ఉన్న ఎవరైనా నీలంవర్ణంలో ఉంటారట. నెమ్మదితనం, దైవత్వంతో సంబంధంఉన్న వర్ణమిది. ఇది సృజనాత్మకతను కలిగిస్తుంది. **నిస్తులా నీల చికురా నిరపాయా నిరత్యయా** - అంటూ భక్తకోటిచే నీరాజనాలు అందుకుంటూ... తనను ఆశ్రయించినవారిని అమ్మ సదా రక్షిస్తోంది.



**హేమవర్ణం-** ఆ కరుణాంతరంగకు ఇష్టమైన మరోవర్ణం.. హేమవర్ణం. **తేజోరూపాం కనకవసనాం.. సర్వభూషో జ్వలాంగీమ్** బంగారమువలె దివ్యతేజస్సు కలిగినదీ, కనక వస్త్రధారిణి అయిన ఆ జగన్మాత భక్తులచే పూజింపబడుతోంది. తిరుచానూరులో కొలువైఉన్న అలమేలుమంగతాయారుకు ప్రతిసంవత్సరం కార్తికమాసంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో రథో త్సవం, **పంచమితీర్థంనాడు బంగారుచీరను** ఎంతో శోభా యమానంగా అలంకరిస్తారు. ఆ సమయంలో అమ్మవారిని దర్శించినవారికి సాక్షాత్తు వైకుంఠ శ్రీమహాలక్ష్మిని దర్శించినంత మహద్భాగ్యమని, ముక్తిపదప్రాప్తిని కల్గిస్తుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం. శ్రీవేంకటాచలపర్వతసానువుల్లో చుట్టూరా ఆ యా దివ్యస్థలాల్లో సిరుల తల్లి కొలువై భక్తులను దయతో రక్షిస్తూ, కరుణతో కాపాడుతూ ఉన్నది. తిరుమల క్షేత్రంలో శ్రీనివాసుని హృదయపద్మంలో వ్యూహలక్ష్మిగానూ, భూతకారుణ్యలక్ష్మిగానూ కొలువై ఉంటూ తనను దర్శించిన భక్తులందరికీ సిరులను గుప్పిస్తూ భక్తులపాలిటి కల్పవల్లిగా కోరికలను తీరుస్తూ ఉన్నది.



*ఓం శ్రియై నమః*



# కుమారస్వామి కల్యాణం

- డా॥ పి.లలితవాణి, 98490 26107

**మార్గశిరమాస శుద్ధషష్ఠినాడు ప్రభవించిన పార్వతీ పరమేశ్వరుల కూర్మితనయుడు, షష్ఠినాడే దేవసేనను వివాహం చేసుకొన్న ఆ కార్తికేయుడు, షష్ఠినాడు తనను కొల్చిన భక్తుల కందరికీ సమస్తకామితాలు తీర్చే ఆ సుబ్రహ్మణ్యస్వామి, కుజనులను కడతేర్చే ఆ కుమారస్వామి- ప్రజ్ఞానమూర్తి, ప్రణవ దీక్షాపరతంత్రుడు, వల్లీసనాథుడు. శివశక్తిసముద్భవుడైన శ్రీకుమారస్వామి కారణజన్ముడు. దుష్టసంహారానికై అవతరించిన దేవదేవుడు. శ్రీవల్లీదేవసేనసమేత కుమారస్వామిగా పూజలందు కుంటున్నాడు.**

మహాబలుడైన కుమారుడు క్రౌంచపర్వతాన్ని భేదించి వీరవిజృంభణ చేస్తున్నాడని, హిమవత్పర్వతశిఖరాన్ని నేలపైన పడద్రోశాడని- అంత గొప్పవాడు నిన్నుకూడా ఓడిస్తాడని దేవతలు వచ్చి చెప్పడంతో ఆ వీరుడు శివపుత్రుడని తెలుసుకోక దేవేంద్రుడు ఆతనితో యుద్ధానికి దిగి, ఓడిపోయి, శరణువేడి, ప్రాణాలు దక్కించుకున్నాడు. అప్పటినుంచి కుమారునకేమిచ్చి ఆతనిదయను పొందుదామా అని ఎదురుచూస్తున్న మహేం ద్రుడికి ఒక చక్కనిఅవకాశం దొరికింది.

కుమారునిచేతిలో తనపుత్రిక దేవసేనచేతిని పెట్టి ఇంద్రుడు "పార్వతీతనయా! నా కుమార్తెను నీకు భార్యగా ఇచ్చాను స్వీకరించు" అని అనడంతో తన కోరిక సఫలమైనం దుకు పరమానందభరితుడైనాడు స్కందుడుకూడా. తల్లిదండ్రుల అనుమతితో కుమారుడు దేవసేనను వివాహమాడాడు. కుమారు నికి దేవసేన తగిన ఇల్లాలని సంతోషాత్ములైనారు ఉమా శంకరులు. ప్రమథులు, దేవతలు, మహర్షులు ఒకే ఆసనం మీద కూర్చుని ఆశీస్సులందుకొంటున్న నూతనదంపతులను చూసి జయజయధ్వానాలు చేశారు. కుమారస్వామి దేవసేనను వివాహం చేసుకొన్నరోజు షష్ఠి కావడంతో సర్వలోకాలలోను షష్ఠి పూజనీయమై స్కందషష్ఠిగా పేరెన్నిక గన్నది.



దేవాధీశులందరూ కలిసి కుమారస్వామికి బ్రహ్మాండాధి పత్యాన్ని గట్టి ఆ స్వామి నాయకత్వంలో ఊపిరి పీల్చుకున్నారు. తమకష్టాలు తీరడానికి తమతో అసురసంహారానికి కుమారుని దేవసేనానిగా పంపమని పరమేశ్వరుని ప్రార్థించారు. జననీ జనకుల అనుమతితో కుమారస్వామి శక్తిఆయుధాన్ని ధరించి దేవసేనలతో కదలివెళ్ళి క్రూరాతిక్రూరులైన తారక, బాణ, ప్రలంబాసురులనందరినీ వధించి లోకకల్యాణాన్ని సమ కూర్చాడు.

విశ్వమందంతటా శాంతిని సుస్థిరం చేసి దేవతలతో, ప్రమథులతో కుమారస్వామి సంతోషంగా కాలం గడుపుతున్నాడు. ఒకనాడు త్రిలోకసంచారి అయిన నారదమహర్షి శివపుత్రుని చేరి వల్లిని వివాహం చేసుకోవాల్సిందిగా సూచించాడు.



కుమారస్వామిని కొలిస్తే ఈతిబాధలు తొలగుతాయి

ఒకఅడవిలో తల్లిదండ్రులు విడిచిపోయిన ఒకబాల ఒకభిల్లనాయకుని కంటబడింది. అడవిమార్గంనుంచి తన గృహానికిపోతున్న ఆ భిల్లుడు ఆ పసికందును తీసుకువెళ్ళి భార్యకప్పగించాడు. భిల్లదంపతుల గారాబుపెంపకంలో పెరిగిన ఆ బాలిక దినదినప్రవర్ధమానమై అతిలోకసౌందర్యరాశిగా రూపుదిద్దుకొంది. ఆ జగదేకసుందరిని చూసితీరాలని నిశ్చయించుకొన్నాడు స్కందుడు. అనుకొన్నదే తడవుగా యువక భిల్లుకరూపాన్ని ధరించాడు. పరమశివుడు కృతకవటువు వేషంతో ఎలా పార్వతీదేవిని సమీపించాడో- అదేమాదిరి కృతకవేషంతో భిల్లుకుడిగా సౌందర్యవల్లిని చేరి ఆమె ముగ్ధ మోహనరూపానికి ముగ్ధుడైపోయాడు. ధైర్యంచేసి ఆమెతో మాట్లాడాడు.

"జగదేకసుందరీ! నేను పరమేశ్వరునిపుత్రుణ్ణి. నీవు నన్ను వరిస్తే-మనిద్దరివివాహం త్వరగా జరిగిపోతుంది. నీ అంగీకారంకొరకు ఎదురుచూస్తున్నా"నని కుమారుడనగానే దిగ్గున లేచి నిలుచుంది వల్లి. "నారదుడు చెప్పిన వరుడితడేనా? శివపుత్రుడీ సుందరాకారుడేనా? ఎందుకో నా మనసుకూడా ఇతనిపై లగ్నమౌతోంది. అదే విధివిలాసమేమో!" అనుకొంటూ అతనికి ఈవిధంగా సమాధానమిచ్చింది వల్లి.

"నేను కన్యను. భిల్లదంపతులు నా తల్లిదండ్రులు. వారు అనుమతిస్తేనేగాని నా వివాహం జరగదు. అదీగాక నారదుడు శివపుత్రుడే నాకు మగడౌతాడని చెప్పాడు. నేను స్కందుణ్ణే పెండ్లాడాలని నిశ్చయించుకున్నాను" అని అనీఅనగానే కృతక భిల్లుడు కుమారస్వామిరూపాన్ని ధరించి వల్లిని సంతోషింపజేశాడు. ఈలోగా వనంనుంచి బిడ్డను గృహానికి తీసుకుపోవడానికి భిల్లరాజు రావడంతో స్కందుడు మామిడిచెట్టుగా మారిపోయాడు. వల్లి తండ్రితో గృహానికి వెళ్ళిపోయింది.

వల్లీదేవి విరహవేదనను చూడలేకపోయిన ఆమె చెలులు కుమారుడున్నచోటుకు ఆమెను తీసుకొనిపోయి, వారిరువురిని కలపడంతో వారి ఆనందానికంతం లేకపోయింది. మరునాడు ఉదయం భిల్లరాజు కుమార్తె కనపడకపోవడంతో ఆమెను వెదుకుతూ అడవిలోఉన్న వారినిచూసి ముందు ఆగ్రహించినా ఆ వచ్చిన యువకుడు శంభుతనయుడని గ్రహించి సంతోషాత్ముడై వారికి మహావైభవంగా వివాహం జరిపించాడు.



కుమారస్వామి తన అదృష్టానికి మురిసిపోయి వల్లితోసహా కైలాసానికి వెళ్ళి పార్వతీపరమేశ్వరులకు వల్లిచేత నమస్కరింపచేసి, తరువాత దేవసేనకుకూడా నమస్కరింపచేశాడు. ఆది దంపతుల ఆశీస్సులనందుకొని కుమారస్వామి పత్నీద్వయంతో మహదానందభరితుడైనాడు.

*"వల్లీ సనాథ మమదేహి కరావలంబం"*

## 2022, డిసెంబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

- **04** - గీతాజయంతి
- **05** - శ్రీచక్రతీర్థముక్కోటి
- **06** - తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామిసన్నిధిన కృత్తికాదీపోత్సవం
- **07** - శ్రీదత్తజయంతి
- **17** - ధనుర్మాసం ప్రారంభం
- **22** - తిరుమల శ్రీవారిసన్నిధిన అధ్యయనోత్సవారంభం

**గమనిక**

*ఇది బ్రహ్మోత్సవసంచిక కాబట్టి ధారావాహికలను ప్రచురించలేకపోతున్నాం. తర్వాతి సంచిక నుండి యథాతథంగా ధారవాహికలు ప్రచురిస్తాం!!*

*- ప్రధానసంపాదకుడు*




# పుష్పాలతో చేసేదే పుష్పయాగము

- నాగజ్యోతి

శ్రీవేంకటేశ్వరస్వామివారికి, తిరుచానూరు శ్రీఅలమేలు మంగమ్మకు బ్రహ్మోత్సవాల అనంతరం కార్తికమాసంలో పుష్ప యాగం జరుగుతుంది. వీరికి జరిగిన బ్రహ్మోత్సవంలో ధ్వజా రోహణంనుండి అవభృతస్నానంవరకు జరిగినకార్యాల్లో లోపాలు, దోషాలు జరిగితే వాటి దోషనివారణార్థం పుష్ప యాగం చేస్తారు. ఈ పుష్పయాగాన్ని విగ్రహప్రతిష్ఠాంతంలో, ఉత్సవాల ముగింపులో, మేషతులాసంక్రమణాల్లో, కటకమకర సంక్రమణాల్లో, సూర్యోపరాగంలో, చంద్రోపరాగంలో, యుగాన్తంలో, సంక్రాంతిలో, శ్రవణనక్షత్రంలో, రాజు, గ్రామం, యజమానుల జన్మనక్షత్రసమయాల్లో, దుర్భిక్ష, అనావృష్టి, దుస్స్వప్న, రాష్ట్రవిభ్రమ, పరచక్రభయ, మహావ్యాధిపీడనాది సర్వోపద్రవసమయాల్లో స్వామివారికి, అమ్మవారికి అభిషేక పూర్వకంగా పుష్పయాగం నిర్వహించాలని ఆగమశాస్త్రాలు చెప్తున్నాయి. ఆ యా కాలాల్లో లభించే వివిధరకాలైన పుష్పా లతో వైభవంగా ఈ యాగం నిర్వహిస్తారు.

హరినామస్మరణతోపాటు శ్రీమహావిష్ణువుని పుష్పాలతో అర్చించడంవల్ల అనంతమైన పుణ్యఫలాలు కలుగుతాయి. తపస్సు, శీలము, సద్గుణాలను కలిగి వేదపారంగతుడైన బ్రాహ్మ ణునికి పదిసువర్ణముద్రికలను దానంచేస్తే ఎంతపుణ్యం కలుగు తుందో అంతటిఫలితం శ్రీమహావిష్ణువుకు చేసే పుష్పార్చనవలన కలుగుతుందని శాస్త్రవచనం.

కుమారస్వామిచే రచింపబడిన 'వైష్ణవామృతం' గ్రంథంలో ఇలా ఉంది. విష్ణువును తెల్లసన్నజాజి, తులసి, తామర, అవిసెపూలతో పూజించినవారు విష్ణుపదాన్ని పొందు తారు. విష్ణువుకు కదంబమాలను ధరించడమంటే అత్యంతఇష్టం. కడిమిపూలతో విష్ణుపూజ చేస్తే భక్తుడు ఏడుజన్మలపర్యంతం ఐశ్వర్యవంతునిగా వెలుగొందుతాడు. వసంతఋతువులో సుర పొన్నలతో, మల్లికాకుసుమాలతో విష్ణుమూర్తినిపూజిస్తే వారికి ఉత్తమఫలితాలు కలుగుతాయి. కార్తికమాసంలో సన్నజాజులతో విష్ణువును పూజించినవారికి నూరుకపిలగోవులను దానంచేసిన ఫలితం కలుగుతుంది. అవిసెపూలతో విష్ణుమూర్తిని పూజించిన వారికి దేవేంద్రుడు సైతం నమస్కరిస్తాడు.

వర్షాకాలంలో విష్ణువును చంపకపూలతోపూజించే వారికి పునర్జన్మ ఉండదు. జమ్మిపత్రితో స్వామినిపూజిస్తే యమునిమార్గాన్ని సులభంగా దాటేందుకు వీలు కలుగుతుంది. లేతగరికతో విష్ణుపూజచేస్తే నూరురెట్లు అధికమైన పూజాఫలం దక్కుతుంది. మామిడిపూతను విష్ణువుశిరస్సుపై ఉంచి పూజిస్తే కోటిగోవులను దానం చేసినంత ఫలం లభిస్తుంది. అశోక పుష్పాలతో శ్రీహరిని పూజిస్తే ఎటువంటిశోకాలు భక్తులను దరిచేరవు. కలిగొట్టుపువ్వులతో జనార్దనుని పూజిస్తే బంగారాన్ని దానంచేసినంత ఫలాన్ని పొందుతారు. అన్నిరకాలైనపువ్వులతో శ్రీమన్నారాయణుని పూజిస్తే కలిగేఫలం, ఒకేఒకతులసీదళంతో స్వామినిపూజిస్తే కలుగుతుంది. అలాగే, అమ్మవారినికూడా వివిధ రకాలపుష్పాలైన ఎర్రతామర, తెల్లతామర, కలువ, మొగిలి, మల్లి, సన్నజాజి, కనకాంబరాలు, చామంతులు, దవనం, మరువం, మందారం, లక్ష్మీతులసి, కృష్ణతులసి, మనోరంజని, సంపెంగ, నందివర్ధనం మొదలైనపుష్పాలతో పూజిస్తే అమ్మవారి అనుగ్రహం కలుగుతుంది. ఇంతటి ప్రాశస్త్యమున్నపుష్పాలతో పూజలు చేసేవిధానం ఎంతో పవిత్రమైనది. లోకోపకారకమైన, దివ్యమైన ఈవిధానంవల్ల సర్వజగత్తుకు సుఖసంపదలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని చేసే గొప్ప పూజావిధానమే **"పుష్పయాగం"**.



శ్రీమహావిష్ణువుని పుష్పాలతో అర్చించడంవల్ల అనంతమైన పుణ్యఫలాలు కలుగుతాయి

***తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి కార్తికబ్రహ్మోత్సవాల్లో విశేషమైన గజవాహనంపై శ్రీమహాలక్ష్మిఅలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు. శ్రీపద్మావతిఅమ్మవారికి ఎంతో ప్రీతికరమైంది గజవాహనం. గజపటాన్ని ఆరోహణం చేయడంతోనే అమ్మవారిబ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయి. పాలసంద్రంలో ప్రభవించిన సిరులతల్లికి గజరాజులు భక్తితో అభిషేకించాయి. అలాంటి ప్రాశస్త్యమున్న ఈ ఏనుగుపై ఆసీనురాలై తిరువీధుల్లో ఊరేగే అలమేలుమంగ ఎంతచక్కగా ఉందో అని భక్తులు అమ్మవారిని స్మరిస్తూ ఈసేవలో దర్శించుకుని ధన్యులౌతారు. అంతటిప్రాశస్త్యమున్న ఏనుగుగురించి తెలుసుకుందాం...***



# గజవాహనంపై ఐశ్వర్యప్రదాయిని

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, 99890 63761

సృష్టిలో ఏనుగుకు ఒకప్రత్యేకత ఉంది. ప్రపంచంలోనే అన్ని జంతువులకన్నా భారీశరీరం, అధికబలం కలిగిఉన్నది ఏనుగు. అంతేకాదు చాలా తెలివైనది, పాలిచ్చే పెద్దజంతువు, అన్నిటికన్నా జ్ఞాపకశక్తి ఎక్కువగా కలిగినది ఏనుగే. మానవుడితర్వాత అంతకంతగా ప్రేమించే హృదయమున్న జంతువు ఏనుగే. ఏనుగు బుద్ధికి, నాయకత్వశక్తికి ప్రతీక. పరమశివుడు తనపుత్రుడు వినాయకుని గజముఖునిగాచేసి, గణనాయకునిగా నిలబెట్టాడు. ఏనుగుకు ప్రత్యేకఅవయవం తొండం. అది ఓంకారరూపంలో ఒంపుతిరిగి ఉంటుంది. అందుకే వినాయకుణ్ణి మనం ప్రణవ రూపునిగా కొలుస్తున్నాం.

మానవులు ఏనుగును రకరకాలుగా పూజిస్తున్నారు. దేవలోకంలో తూర్పుదిక్కును పాలించే దిగ్గజం ఐరావతం. క్షీరసాగరంలోనుండి పుట్టింది. స్వర్గాధిపతి దేవేంద్రునికి వాహనం. ఐరావతం బ్రహ్మవరంతో పుట్టిన దివ్యగజం. కశ్యప ప్రజాపతికి మగఏనుగుగా పుట్టి, సూర్యుని సోదరునిగా ప్రఖ్యాతి చెంది, పూజలందుకుంటోంది. ఐరావతం వరప్రదాయిని. వర్ష ప్రదాయిని. ఏనుగును అర్చిస్తే కరువుకాటకాలు నశించి, వర్షాలుపడి, భూమి సస్యశ్యామలం అవుతుందని పూర్వీకుల ప్రగాఢవిశ్వాసం. ఆరోజుల్లో గజపూజ తప్పనిసరిగా చేసి, అనుగ్రహాన్నిపొంది, మానవులు విరాజిల్లేవారు. గజపూజ గోపూజతో సమానమని నమ్మకం. శివుడు గజచర్మాంబరధారి.

సమస్తలోకాలకు జనని, అష్టైశ్వర్యప్రదాయిని, సౌభాగ్యదాయిని, సకలవిజయకారిణి, సర్వవిద్యాప్రదాయిని, సంతాన ప్రదాత్రి అయిన శ్రీమహాలక్ష్మిఅమ్మవారి అష్టరూపాలలో ఒకటి గజలక్ష్మిరూపం. జగన్మాతకి ఇరువైపులా రెండుఏనుగులు తొండాలెత్తి అభిషేకిస్తున్నట్లుండే ఆ రూపం బుద్ధిప్రదాత. శక్తి ప్రదాత. సిద్ధిప్రదాత. ఐశ్వర్యప్రదాత. మోక్షప్రదాత.

ఆగమశాస్త్రప్రకారం ఏ ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నా శ్రీవారిని, అమ్మవారిని తప్పనిసరిగా ఏనుగుమీద నిలిపి ఊరేగిస్తుంటారు. దీనినే గజవాహనోత్సవం అంటారు. మహాపుణ్యక్షేత్రమైన తిరుచానూరులో పద్మావతీఅమ్మవారికి గజవాహనమహోత్సవం కన్నులపండువుగా, వైభవంగా జరుగుతుంది. తనివితీరా చూసి తరించవలసిందే. ఆలయంలో



దైవకార్యాలకు నియోగించిన ఏనుగులను భద్రగజాలని అంటారు. భాగవతమహా పురాణంలోని గజేంద్రమోక్షంకథ చాలా ప్రఖ్యాతిచెందింది. ఒకజంతువు అయిఉండి కూడా ఆపత్కాలంలో భగవంతుని ఎలుగెత్తి పిలిచి రక్షించమని వేవిధాలుగా వేడు కున్నది. ఏనుగుమొరవిని శ్రీమన్నారాయ ణుడే దిగివచ్చి మరీ ప్రార్థిస్తున్న ఏనుగును పట్టిపీడిస్తున్న మొసలిని తనచక్రంతో ఖండించి, ఏనుగును రక్షించి ఆపన్నశరణ్యు డయ్యాడు. ఆ ఏనుగుకేకాక మొసలికికూడా మోక్షాన్నిచ్చాడు. సాక్షాత్తు పరమాత్ముడే స్వయంగా వచ్చి రక్షించడంవలన ఏనుగు ప్రఖ్యాతి ఈనాటికీ వెలిగిపోతూనే ఉంది.

ద్వాపరయుగంలో పాండవమాత కుంతీ దేవి పుత్రకవ్రతంచేసి సంతానానికి ఆయువు, ఆరోగ్యం, బలాలను చేకూర్చింది. ఈవ్రతం సంతానవతులందరూ చేసుకోవచ్చు. గౌరీ దేవిని అర్చించి, ఏనుగును పూజించి, ఆ ఏనుగుమీదనే ఊరేగి, స్త్రీలకు వాయనా లివ్వడం ఈ వ్రతవిధానం. కౌరవులు మట్టి ఏనుగును తయారుచేసి, తల్లి గాంధారీ దేవిచేత ఈవ్రతం చేయించారు. కానీ పాండవులు స్వర్గలోకంలోని దివ్యగజమైన ఐరావతాన్ని ఈలోకానికి తెచ్చి, తల్లి కుంతీ దేవిచేత వ్రతం చేయించారు. అలా ఒకవ్రతానికే ప్రాధాన్యతను సంతరించి పెట్టింది ఏనుగు. దీనికి గజవ్రతం అనిపేరు. ఈ కలియుగంలో బావాజీగా పేరుగాంచిన హాథీరాం అనే భక్తునిభక్తిని నిరూపించడానికి సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంగా ఏనుగురూపంలో వచ్చి, చెరుకుగడలనన్నిటినీ తిని, భక్తుని అనుగ్రహించి, అంతర్థానం చెందాడు. ఈ దృశ్యాన్ని కనులారా చూసిన భక్తవరేణ్యులెందరో ఉన్నారు. శ్రీవారుకూడా ఏనుగురూపంలోనే రావడం విశేషం.

మొన్న మొన్నటిదాకా రాజ్యానికి రాజుకానీ, మంత్రికానీ కరువైన సమయంలో పట్టపుటేనుగుచేత పూలమాల ధరింపచేసి, ఆమాలను ఆఏనుగు ఎవరి మెడలో వేస్తే వారినే ఎన్నుకునేవారు. రాజుని, మంత్రిని ఎన్నుకునేప్రాధాన్యత, యోగ్యత ఏనుగుదే! ఏనుగు శుభప్రదం. శుభసూచకం. శుభశకునం. చాలామంది ఇళ్ళల్లో రెండుఏనుగుబొమ్మలను ఉంచుకుంటున్నారు. ఒంటిఏనుగును ఉంచుకో రాదని పెద్దలు చెప్తున్నారు.

ఇప్పటికీ గజారోహణం అనేది చాలా గొప్పగౌరవం. అశేష పేరు ప్రఖ్యాతులు పొందినవారిని ఏనుగుమీద ఊరేగించి వారిఘనతను వెల్లడిచేస్తారు. ఏనుగుదంతాలు చాలా విలువైనవి. వాటితో ఎన్నోరకాలుగా దంతపుబొమ్మలు, పెట్టెలు, గాజులు, నానా అలంకారవస్తువులు ఇలా ఎన్నిటినో తయారుచేస్తారు. పూర్వం ఏనుగులను మచ్చిక చేసుకునేవారు. మనిషి ఎత్తలేని బరువులను ఏనుగులచేత ఎత్తించి మోయించేవారు. విశేషమేమిటంటే బరువైనపనులు చేసేవి ఆడఏనుగులు. యుద్ధంలో చతురంగబలాలలో గజబలం ఒకటి. యుద్ధంలో పాల్గొనేవి మగఏనుగులు. పొలాలు దున్నేసమయంలో ఏనుగులచేత తొక్కించేవారు.

ఏనుగు 22నెలలపాటు గర్భాన్నిమోసి, గున్నను ప్రసవిస్తుంది. 70ఏళ్ళకు పైగా జీవిస్తుంది. ఏనుగుకి వెలగపండు, అరటిపండు, కొబ్బరికాయ, చెరకులు అంటే ఎంతోఇష్టం. ఏనుగు పూర్తిగా శాకాహారి. అలాంటిఏనుగుపై తిరుచానూరు అమ్మవారు ఆసీనులై తిరుమాడవీథుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు.

ఏనుగువిలువ తెలియచేసే చక్కనిసామెత ఒకటుంది "ఏనుగు బతికిఉన్నా వెయ్యే చచ్చినా వెయ్యే" అని. 2012లో "ప్రపంచ ఏనుగుల దినోత్సవం" ఆగష్టు 12న జరుపుకోవాలని నిర్ణయించారు. అప్పటినుండీ అన్ని దేశాలవారు ఆరోజున ఏనుగులను అలంకరించి, సత్కరించి, గౌరవాన్ని అభిమానాన్ని ప్రదర్శించి, ఉత్సవం చేసుకుంటున్నారు.



*ఓం గజముఖాయ నమః*
*ఓం శ్రీ గజలక్ష్మీదేవ్యై నమః*

**తిరుమల శ్రీవారికి 27-09-2022 నుండి 05-10-2022 వరకు జరిగిన బ్రహ్మోత్సవ వైభవ చిత్రమాలిక.**

అందులో పాల్గొన్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు మరియు భక్తులు



















# ఆకాశరాజు పుత్రిక 'పద్మావతి'- తిరుచానూరు 'పద్మావతి'

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

అనంతమైన బ్రహ్మాండభాండాల్లో సాటిలేని మేటిదేవుడు ఏడుకొండలవాడు. ఆ స్వామివారిని వేదాలు కూడ స్తుతించలేక ఒక్క మాటలో 'యో౽సి సో౽సి' అని అన్నాయట. అంటే "ఓ స్వామీ! నీవు ఎవడివి అయివున్నావో, వాడివే అయి ఉన్నావు" అని. అలా కీర్తింపబడిన ఏడుకొండలవాడికి ఈ కలియుగంలో ఇద్దరుపత్నులు ఉన్నారు.

ఆ ఇద్దరి పెండ్లాలపేర్లూ పద్మావతులే! ఒకరేమో మట్టిలోని పద్మంలో పసిపిల్లగా పుట్టింది. మరొకరు నీళ్లలోని పద్మంలో, పదహారేళ్లపడుచుగా అవతరించింది. ఇలా వీళ్లిద్దరికి ఎన్నోతేడాలుఉన్నా, ఎన్నెన్నో భేదాలుఉన్నా, చిట్టచివరి ఘట్టంలో ఆ ఇరువురూ ఏకమై, మమేకమై కలిసిపోయి, ఒకేరూపాన్ని సంతరించుకొని 'వ్యూహలక్ష్మి' అనే కొత్తపేరుతో ప్రభువైన వేంకటేశుని హృదయపీఠాన్ని అలంకరించి ఆనందంగా ఉన్నారు. దానివల్ల తమ విభునికి 'శ్రీనివాసుడు' అని సార్థకమైన పెద్దపేరునే తెచ్చిపెట్టారు.

చాలాబాగుంది. మరి ఎంతో విచిత్రంగానూ, ఆశ్చర్యంగానూ ఉన్న ఈ పద్మావతు లిద్దరిగాథను కాస్త వివరంగా చెప్పుకొని ఆనందిద్దాం.

## ఆకాశరాజు పుత్రిక పద్మావతి

తిరుపతికి 50కి.మీ.దూరంలోఉన్న నారాయణ వరానికి ప్రభువు ఆకాశరాజు. ఈయన సంతానంకోసం పుత్రకామేష్టి యాగాన్ని తలపెట్టి దానికోసం పొలాన్ని దున్నాడు. ఆ మట్టిలో బంగారుపద్మం, అందులో ఒక పసిపిల్ల దొరికింది. పద్మంలో ఉన్న ఆ ఆడపిల్లకు 'పద్మావతి' అని పేరుపెట్టి పెంచి పెద్దచేశాడు ఆకాశరాజు. ఇదేసమయంలో...

వైకుంఠంనుండి అలిగి భూలోకం చేరుకున్న శ్రీమహాలక్ష్మిని వెతుకుతూ శ్రీమహావిష్ణువు భూలోకంలోని ఆదివరాహ క్షేత్రాన్ని చేరుకున్నాడు. తల్లి వకుళమాతఆశ్రయంలో ఉంటూ, ఒకనాడు వేటకువెళ్లిన వేంకటేశ్వరుడు ఆకాశరాజుకూతురు పద్మావతిని చూసి మోహించి, ఆమెతో పెళ్లి చేయించుమని తల్లి వకుళమాతను ప్రాథేయపడ్డాడు. ఆమె చక్రవర్తిపుత్రికకదా అని సందేహించిన వకుళమాతతో "రామాయణకాలంనాటి 'వేదవతే' ఈమె. సీతకోసం లంకలో బాధలుపడిన ఆమెను పెండ్లాడుమని సీతకోరగా, కలియుగంలో వేంకటేశుడిగా వచ్చి వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాను. ఆ వేదవతే ఇప్పుడు మట్టిలోని పద్మంలో 'పద్మావతి'గా అవతరించింది." అని చెప్పగా వకుళమాత, ఆకాశరాజుదగ్గరికి పిల్లపెత్తనానికి వెళ్లి ఈ కథనంతా రాజుతో చెప్పి, చక్కగా వెంకటేశునికి పద్మావతికి పెళ్లి జరిపించింది.

తర్వాత, కొంతకాలానికి పద్మావతిని వకుళమాతకు అప్పజెప్పి వేంకటేశ్వరుడు ఇలా అన్నాడు. 'అమ్మా! లోకకల్యాణ కోసం వచ్చిన నా దగ్గరికి శ్రీమహాలక్ష్మి తప్పక రావలసి ఉంది. ఆమె కొల్హాపురంలో ఉంది. పోయి పిలుచుక వస్తానని చెప్పి వెళ్లాడు. కాని, అక్కడ కన్పించలేదు లక్ష్మి.

ఇంతలో "వేంకటేశా! నీకు ఇక్కడ శ్రీమహాలక్ష్మి దర్శనం కాదు. స్వర్ణముఖీతీరంలో పద్మసరస్సును నిర్మించి తపస్సు చెయ్యి. అక్కడ ఆమె నీకు ప్రత్యక్షమవుతుంది" అంటూ ఆకాశవాణి విన్పించింది.

## తిరుచానూరు పద్మావతి

వెంటనే వేంకటేశ్వరుడు స్వర్ణముఖీతీరానికి వచ్చి పద్మ సరోవరంచెంత పన్నెండేండ్లపాటు లక్ష్మీదేవికోసం తపస్సు చేశాడు. ఒకానొక కార్తికశుద్ధపంచమీ శుక్రవారం ఉత్తరాషాఢా నక్షత్రయుక్త అభిజిత్‌లగ్నంలో (మధ్యాహ్నం 12గం॥లకు) పద్మ సరోవరంమధ్యలో వేయిదళాలుఉన్న బంగారుపద్మంలో పద హారేళ్లపడుచుగా దివ్యకాంతులతో శ్రీమహాలక్ష్మి ఆవిర్భవిం చింది. నీళ్లలో పద్మంలో ఆవిర్భవించిన ఈమెను "పద్మావతి" అని దేవతలంతా కీర్తించారు. 'అలర్‌మేల్‌మంగ' అని అన్నారు. అంటే పుష్పంపైన ప్రకాశిస్తున్న దివ్యవనిత అని అర్థం. ఆమె 'అలమేలుమంగ".

దేవతలు, ఋషులు, యక్షకిన్నగంధర్వులు, మానవులు అనేకవిధాలుగా పద్మావతిని ఇలా స్తుతించారు, కీర్తించారు.

ఓం నమశ్శ్రియై లోకధాత్ర్యై బ్రహ్మమాత్రే నమో నమః
నమస్తే పద్మనేత్రాయై పద్మముఖ్యై నమో నమః

ప్రసన్నముఖపద్మాయై పద్మకాంత్యై నమో నమః
నమో బిల్వవనస్థాయై విష్ణుపత్న్యై నమో నమః

విచిత్ర క్షౌమధారిణ్యై పృథుశ్రోణ్యై నమో నమః
పక్వబిల్వ ఫలాపీన తుంగస్తన్యై నమో నమః

సురక్త పద్మ పత్రాభ కరపాదతలే శుభౌ
సురత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితే

యక్ష కర్దమ సంలిప్త సర్వాంగే కటకోజ్జ్వలే
మాంగల్యాభరణై శ్చిత్రైః ముక్తాహారై ర్విభూషితే

తాటంకై రవతం సైశ్చ శోభమాన ముఖాంబుజే
పద్మహస్తే నమస్తుభ్యం ప్రసీద హరివల్లభే
ఋగ్యజుస్సామరూపాయై విద్యాయై తే నమో నమః

ప్రసీదాస్మాన్ కృపాదృష్టిపాతై రాలోకయాబ్ధిజే
యే దృష్టా స్తే త్వయా బ్రహ్మ రుద్రేంద్రత్వం సమాప్నుయుః

బ్రహ్మాదిదేవతలప్రార్థనపై 'అలమేలుమంగ' 'పద్మా వతి'గా అర్చారూపంలో పూజలందుకొంటున్నది. పూర్వం ఈ ప్రాంతం శ్రీశుకమహర్షిఆశ్రమమట. కాలాంతరంలో తిరుశుకనూరుగా పిలువబడి 'తిరుచానూరు'గా మారిందని పెద్దలమాట.

ఆనాటినుండి ఆమె అవతరించిన కార్తికశుద్ధపంచమి నాటికి పూర్తిఅయ్యేట్లుగా పదినాళ్లపాటు బ్రహ్మాదిదేవతల ఆధ్వర్యంలో తిరుచానూరు పద్మావతికి ఉత్సవాలు జరుగు తున్నాయి. అప్పటినుండి పంచమినాడు తిరుమల శ్రీవారి నుంచి చీరసారె వగైరాలు పంపించబడుతున్నాయి.

వేంటనే వేంకటేశ్వరుడు 'అలమేలుమంగ'ను ఆలింగనం చేసుకొని తన హృదయంమీద 'వ్యూహలక్ష్మి'గా ప్రతిష్ఠించుకొని వేంకటాచలానికి వెళ్లాడు. అక్కడ ఉన్న ఆకాశ రాజు పద్మావతిని కూడ 'వ్యూహలక్ష్మి'లో ఐక్యం చేసుకున్నాడు. ఆనాటినుండి వేంకటేశ్వరుడు అష్టలక్ష్మీసుసంపన్నుడై "శ్రీనివాసుడు' అనే సార్థకనామధేయంతో అద్భుతమైన సాల గ్రామశిలామూర్తిగా ఆవిర్భవించి భక్తులందరిచేత కీర్తింప బడుతూ వరాలను గుప్పిస్తున్నాడు.

వక్త్రాబ్జే భాగ్యలక్ష్మీః కరతలకమలే సర్వదా దానలక్ష్మీః
దోర్దండే వీరలక్ష్మీః హృదయసరసిజే భూతకారుణ్యలక్ష్మీః
ఖడ్గాగ్రే శౌర్యలక్ష్మీః నిఖిలగుణగణాడంబరే కీర్తిలక్ష్మీః
సర్వాంగే సౌమ్యలక్ష్మీః మయితువిజయతాం సర్వసామ్రాజ్యలక్ష్మీః

ఓం శ్రియై నమః



**తిరుమల శ్రీవారికి 27-09-2022 నుండి 05-10-2022 వరకు జరిగిన బ్రహ్మోత్సవ వైభవ చిత్రమాలిక.**

అందులో పాల్గొన్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు మరియు భక్తులు










# బంగారువెలుగులతో.. దేదీప్యమానంగా...

- డా॥ కె.వి.యల్.యన్.అప్పలాచార్యులు,
7799207878

**తిరుచానూరులో శ్రీనివాసుడు తపస్సుచేసిన పద్మసరోవరంలోనుండి శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించింది. ఆ తల్లి ఎలా ఆవిర్భవించిందంటే... వేయివెలుగులతో ప్రకాశిస్తున్న బంగారురథంమధ్యలో బంగారుపద్మపీఠంపై బంగారుపద్మంలోనాళంద్వారా, పద్మంలోని కర్ణికమధ్యలో ఆసీనురాలై ఆవిర్భవించింది. ఆ సమయంలో అందాల నవరత్నాలకిరీటం, మెడలో రకరకాల కంఠాభరణాలు, చేతులకు గాజులు, ముక్కుకు రత్నాలముక్కెర, కాళ్లకు పట్టీలు, కడియాలు, నడుముకు వడ్డాణం మొదలైన వజ్రవైడూర్యమరకతమాణిక్యాదులతో ఆపాదమస్తకమూ నిండిఉన్న సర్వాభరణాలతో దేదీప్యమానమైన వెలుగులతో గజరాజులు సేవిస్తుండగా బంగారు కమలంలో ఆవిర్భవించింది. అలా ఆవిర్భవించి తిరుచానూరులో అలమేలుమంగగా కొలువై పూజలందుకుంటోంది. అలా కొలువై ఉన్న అమ్మవారికి ఎందరో, ఎందరెందరో అసంఖ్యాకభక్తులు ఎన్నో ఎన్నో ఎన్నెన్నోరకాలైన ఆభరణాలను భక్తితో సమర్పించుకున్నారు. ఆ ఆభరణాలతో నిత్యమూ అలంకరించబడిఉండే ఈ అమ్మవారిని చూడ్డానికి ఎన్నికన్నులున్నా సరిపోవు. అవన్నీ వెలకట్టలేనివి. అంతటి విశిష్టతకలిగిన ఆభరణాలంటే ఏంటో కొంత తెలుసుకుందాం...**

ప్రతినిత్యం పూజ చేసేటప్పుడు వాళ్ళ వాళ్ళ శక్తిని అనుసరించి షోడశోపచారాలు సమర్పించటం శాస్త్ర సంప్రదాయం. అన్నమయ్యకూడా “షోడశకళానిధికి షోడశోపచారములు జాడతోడ నిచ్చెలను సమర్పయామి” అని శ్రీ వేంకటేశ్వరస్వామికి షోడశోపచారాలని సమర్పించారు. వినాయక చవితికికాని, అమ్మవారికికాని, అయ్యవారికికాని పూజలుచేసేటప్పుడు, సమంత్రీకంగా ఆభరణాలని సమర్పించటం నేటికీ కనిపిస్తూనే ఉంది. సామాన్యగృహస్థులు ఆభరణార్థం పుష్పం సమర్పయామి లేదా అక్షతాన్ సమర్పయామి అంటూ ఆభరణాలకు బదులుగా పువ్వులని, అక్షతలని అమ్మవారిపైన చల్లుతారు. వరలక్ష్మీవ్రతంరోజునకానీ, దీపావళిరోజునకానీ కొత్తబంగారంతో నగలు చేయించుకొన్నవాళ్ళు ఆనగలతో అమ్మవారిని అలంకరించి తరువాత వాళ్లు ధరించటం మనం చాలాచోట్ల గమనిస్తున్నాం. ఈఆభరణాలనే తెలుగులో నగలు, సొమ్ములు అని పిలుస్తారు. ఈనగలు మహారాజులైతే ఏడువారాలసొమ్ములని చేయించుకొంటారు. పూర్వం రాజులుమాత్రమే ఎక్కువగా రత్నాలాభరణాలని ధరించేవాళ్ళు. కన్యాదానసమయంలోకూడా ‘కన్యాం కనకసంపన్నాం కనకాభరణైర్యుతామ్!’ అని సాలంకృతకన్యనే దానంచేస్తారు. ధనంలేనివాళ్ళయినా కనీసం ముక్కుపుడక, చెవులకికమ్మలుఅయినా బాలతొడుగుక్రింద పెళ్ళికూతురికి పెడతారు.



పాదాదికేశపర్యంతం ఈ ఆభరణాలని ధరించటంలో మానవులకి ఆరోగ్యసూత్రమే ప్రధానం. శ్రీవిగ్రహాలకి, పురుషమూర్తులకికూడా వేళ్ళకి ఆభరణాలు దర్శనమిస్తాయి. కాలివ్రేలికి మట్టెలు, చీలమండలదగ్గర పట్టాలు- చేతివేళ్ళకు ఉంగరాలు, ముంజేతులకు గాజులు, మోచేతులకి వంకీలు, మెళ్ళో గొలుసులు, నడుముకి వడ్డాణంలాంటి అనేకాభరణాలని అలంకరిస్తారు. తలపై పాపిడిబొట్టు, వెనుకవైపు నాగరంబిళ్ల,

తలకి రెండువైపుల సూర్యచంద్రులు ఇది ఒకప్పటి ఆచారం. బంగారంస్పర్శవల్ల ఆయాప్రదేశాల్లో నాడులు చైతన్యాన్ని పొంది మానసికప్రశాంతత, శారీరకవికాసం కలుగుతాయి. ఇకపోతే, ఏఏ గ్రహాలకి ఏఏ ఆభరణాలు ప్రీతికరమో తెలుసుకుందాం.



ఆదివారానికి సూర్యుడు అధిపతి. కెంపు అంటే సూర్యుడికి మహాప్రీతిపాత్రం. ఆరోగ్యప్రదాత అయిన సూర్యానుగ్రహంవల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆయుర్దాయం కలుగుతాయి. సూర్యోపాసనవల్ల సత్రాజిత్తు శ్యమంతకమణిని పొందాడు. ఆ మణి రోజుకు ఏడుబారువులబంగారాన్ని ఇచ్చేది. ధర్మరాజు సూర్యోపాసనవల్ల బంగారుఅక్షయపాత్రని పొందాడు. సాంబుడు సూర్యోపాసనతో కుష్ఠరోగాన్ని పోగొట్టుకున్నాడు. శ్రీరాముడు ఆదిత్యోపాసనవల్ల లోకభయంకరుడైన రావణాసురుణ్ణి జయించాడు. వాళ్ళంతా తపస్సు, ధ్యానం, ఏకాగ్రతగలవారు. అదిలేని ఈనాటివాళ్ళు (రత్నాన్ని) కెంపుని ధరించటం, దానంచెయ్యటంవల్ల సూర్యానుగ్రహాన్ని పొందుతున్నారు. మానవులు వాళ్ళస్వార్థంకోసం రత్నాలని ధరిస్తే రత్నాలు వాటిస్వార్థంకోసం అమ్మవారిని, అయ్యవారినీ ఆశ్రయిస్తాయి. ఒకప్పుడు కెంపులతో 'జిగినీ' అనే పేరుతో కంఠహారం పట్టెడని ధరించేవాళ్ళు.



సోమవారానికి అధిపతి చంద్రుడు. మనఃశాంతికి కారకుడు. చంద్రుడుకి ముత్యం అంటే ప్రీతి. నీలం- కెంపు- లేతఎరుపు రంగుల మిశ్రమవర్ణంలో నిగనిగలాడే ముత్యాలని సోమవారంనాడు మనశ్శాంతికోసం ధరిస్తే మంచిది.



మంగళవారానికి జయవారమని పేరు. కొంతమంది మంగళవారం అనకుండా భౌమ వాసరం అంటారు. ఈ వారానికి కుజుడు అధిపతి. కుజుడికి పగడం అంటే ఎంతోఇష్టం. కుజుడికి అధిదేవత అమ్మవారు. కుజగ్రహంవల్ల బాధలుకలిగితే వైష్ణవసంప్రదాయంలో నారసింహ లేదా సుదర్శనఆరాధనలు, హోమాలు చేయించుకొంటారు. ఎరుపురంగువస్త్రాలని దానం చేస్తారు. రక్తస్రావానికీ, నేత్రవ్యాధులకి, శిరస్సుకి సంబంధించిన ఇబ్బందులు కలుగకుండా తొలగిపోవాలంటే కుజుడికిష్టమైన పగడాన్ని ధరించటం తప్పనిసరి.



బుధవారం బుధుడికి ఇష్టమైనరోజు. మరకతం (ఆకుపచ్చ రాయి) అంటే ఇష్టం. కనుక బుధవారంరోజున పచ్చలతోచేసిన ఆభరణాలని ధరించాలి. బుధుడికి అధిదేవత శ్రీమహావిష్ణువు. బుధగ్రహం అనుకూలంగా ఉంటేనే వ్యాపారాభివృద్ధి, ధనలాభం, ఆరోగ్యలాభం చేకూరుతాయి.



గురువారం బృహస్పతికి ఇష్టమైనరోజు. పుష్యరాగమణులంటే ప్రీతి. కనకపుష్యరాగమనే మరొకరత్నం ఉంది. దీని ధారణవల్ల బుద్ధివికాసం. ధార్మికకార్యక్రమాలు, భగవంతుడి ఆరాధనలు నిరాటంకంగా సాగుతాయి.



శుక్రవారానికి శుక్రుడు అధిపతి. అమ్మవారు అధిదేవత. వజ్రం ప్రీతిపాత్రం. శుక్రానుగ్రహంవల్ల సుఖశాంతులు, దాంపత్యసుఖం మొదలైనలాభాలు చేకూరుతాయి.



శనివారానికి శని అధిపతి. నీలం అంటే ఇష్టం. శని అనుకూలంగా ఉంటే ఆయుర్దాయం, నరాలబలం, గృహయోగం మొదలైనవాటిని కలిగిస్తాడు. నీలాలు రకరకాలున్నాయి. ఇంద్రనీలం, సముద్రనీలం, ఆకాశనీలం, మయూరనీలం. ఇలా వివిధరకాలుగాఉన్న నీలాలలో ఏది అనుకూలమో సిద్ధాంతిని అడిగి ధరించాలి.



షోడశమహాదానాలలో రత్నదానంకూడా ఒకటి. ఈనాడు దానాలు ఇవ్వటం కష్టమైతే పుచ్చుకోవటం అంతకంటే కష్టం. దానం పుచ్చుకొన్నవాడికి ఇచ్చినవాడిబాధలు చుట్టు కొంటాయి. వాటిని పోగొట్టుకోవాలంటే అనుష్ఠానం ఎక్కువ చేసుకోవాలి. అలా చేసుకొంటూంటే జీవనభృతి కష్టమౌతుంది. కనుకనే 'దానసాద్గుణ్యార్థం ఇయం దక్షిణా' అని దక్షిణని సమర్పించాలి. ఈ ద్రవ్యంతో ఆ ప్రతిగ్రహీత దానం పుచ్చుకొన్న వాడు సుఖంగా జీవనంచేస్తూ అనుష్ఠానంపైనే ధ్యాసఉంచి జపం చేసుకోవటానికి అవకాశం ఉంటుంది.

మానవులకి దానం చేయటంకంటే భగవంతుడికి సమర్పించటం చాలావిశేషం. ఏబాధనైన పోగొట్టగలశక్తి అమ్మవారికి, అయ్యవారికే ఉంటుంది. "సర్వాలంకార యుక్తాం సకలమభయదాం మణిగణైః నానావిధైః భూషితామ్" అని అమ్మవారిని సర్వాభరణభూషితురాలుగా వర్ణించారు పెద్దలు. అలమేలుమంగమ్మకి ఏడువారాలసొమ్ములున్నాయి. ఆమె జగన్మాత-ఆదిలక్ష్మి ఎన్నింటినైనా ధరించగలదు. కొందరు



భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామికి నందకంవంటి బంగారుకత్తిని శంఖచక్రాలని, వజ్రకిరీటాలని సమర్పించటం భక్తుల శ్రేయస్సు కోసమే. అలాగే అమ్మవారికికూడా సమస్తాభరణాలని భక్తులు యధాశక్తిగా సమర్పించి, గ్రహాల అనుగ్రహాన్నికూడా పొంది ఈతిబాధలనుండి విముక్తులై ఆయురారోగ్యఐశ్వర్యాలతో వర్ధిల్లుతున్నారు.

## వైకుంఠపాళి
### :: 82 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 కే | | 2 హా | లా | 3 హ | ల | 4 ము | | 5 ఆ |
| దా | | యి | | రి | | క్తి | | స్త్రీ |
| 6 ర | తి | | 7 శ్రు | తు | డు | | 8 చా | కు |
| ము | | 9 సిం | | డు | | 10 గాం | | డు |
| | 11 సిం | హి | త | | 12 వి | ధా | త | |
| 13 సా | | త | | 14 సా | | రి | | 15 సు |
| 16 ర | జి | | 17 సా | త్వ | తి | | 18 గూ | బ |
| ఋ | | 19 దా | | తు | | 20 గ | | లు |
| డు | | 21 రం | భు | డు | | 22 య | జ్ఞు | డు |

# జగదేకవీరుడు పరశురాముడు

– డా॥ పి.వి. ఉమాశశి, 94407 35155



***భృగుమహర్షి పౌత్రుడైన జమదగ్ని అఖండ తపోనిధి. ఆయన తపస్సుకు మెచ్చి శ్రీమహావిష్ణువే ఆరవ అవతారపురుషుడై పుత్రుడిగా జన్మించాడు. ఆ పుత్రుడే పరశురాముడు. పరశువును ఆయుధంగా ధరించి క్రూరజననాశనం చేసిన కారణంగా పరశురాముడిగా ప్రసిద్ధి చెందినాడు. రామనామంతోనే కృతయుగాంతంలో ప్రవేశించినవాడు. తండ్రి జమదగ్ని, తాత ఋచీకుడు, ముత్తాత భృగుమహర్షులవద్ద సర్వవిద్యలు నేర్చి తేజోమూర్తిగా విరాజిల్లిన పరశురాముడు– అన్యాయాన్ని మాత్రం సహించలేని జగదేకవీరుడయ్యాడు.***

జమదగ్ని అరణ్యంలో ఉగ్ర తపస్సుచేస్తున్నసమయంలో ఒకనాడు పరశురాముడు తల్లి రేణుకాదేవితోను, రుమణ్వాది నలుగురన్నలతోను కలిసి పండ్లు తీసుకురావటానికి అడవికి వెళ్లాడు. ఆ అడవిలో ఒకసరోవరంలో భార్యలతోకూడి జలక్రీడలాడుతున్న చిత్రరథుడనేరాజును చూసిన రేణుకాదేవిమనసు చలించడాన్ని దివ్యదృష్టితో గ్రహించిన జమదగ్ని, భార్యమీద ఆగ్రహించాడు. కొడుకుల్ని పిలిచి రేణుకని వధించమని ఆదేశించాడు. కానీ వారు మాతృవధ మహాపాపమని తలచి ఆ పనికి పూనుకోరు. చివరికొడుకైన పరశురాముని ఆ పనికి నియోగించాడు. మొదటి నలుగురుకొడుకుల్నీ శపించాడు. తండ్రి ఆనతివిన్న పరశురాముడు తక్షణం తనచేతిలోని పరశువుతో (గండ్రగొడ్డలితో) ముందూ వెనకా చూడకుండా తల్లిని సంహరించాడు. పరశురాముని సాహసాన్ని, పిత్రాజ్ఞనిర్వహణత్వాన్ని చూసి ఆనందించిన జమదగ్నిమహర్షి ఆతనిని వరం కోరుకో, ఇస్తానన్నాడు. అందుకు పరశురాముడు నా తల్లిని, అన్నలను బ్రతికించుమని కోరాడు.



ఒకానొకసమయంలో హైహయవంశీయుడైన కార్తవీర్యుడు జమదగ్నిఆశ్రమానికి వచ్చి అతిథిసత్కారాలు పొందాడు. కాని కృతఘ్నుడై మహర్షిసత్తముని ఆశ్రమప్రాంతమంతటినీ చిందరవందరచేసి, మునులనవమానించి, జమదగ్ని హోమధేనువును దాని దూడతోసహా తన రాజ్యానికి తీసుకొచ్చేశాడు. జమదగ్ని పరశురాముడికి కార్తవీర్యుని దురంతాన్ని సవిస్తరంగా చెప్పి హోమధేనువును దూడతోసహా తిరిగి తీసుకురావయ్యా అని బాధతో అన్నాడు. అదివిన్న పరశురాముడు గర్వోన్మత్తుడైన కార్తవీర్యుని సంహరించాడు.

తమతండ్రిని పరశురాముడు వధించటంతో కార్తవీర్యునిపుత్రులు బద్ధవైరులై జమదగ్నిమహర్షిశ్రేష్ఠుని వధించి పగచల్లార్చుకొన్నారు. పరశురాముడాశ్రమానికి వచ్చేటప్పటికి రేణుకాదేవి "రామా! రామా!" అని 21సార్లు ఆక్రోశిస్తూ దుఃఖించటం కనిపించింది.



ప్రక్కనే మరణించిఉన్న తండ్రిని చూశాడు. అలాగే వెళ్లి రాజుల గర్వాలను, అవినీతిని తుదముట్టించాడు. ఆ నృపతులరక్తంతో భూమినంతటినీ తడిపేశాడు. ఆ తర్వాత కశ్యపమహర్షికి సమస్త భూమండలాన్ని సంభావనగా దానంచేసి తండ్రిఋణం తీర్చుకొన్నాడు.

ధర్మమార్గప్రవర్తకుడైన పరశురాముడు తనను శరణుకోరేవారిపాలిట కల్పవృక్షమై వారికోరికలు తీరుస్తాడన్న విషయం విన్న అంబ– ఆ మహర్షిశ్రేష్ఠుని ఆశ్రయించింది. ఏ భీష్ముడివల్ల తనకన్యాయం జరిగిందో ఆ భీష్ముడికే ధనురాచార్యుడైన పరశురాముడు తనవేదన బాపగలడని, గురువుమాట భీష్ముడెన్నడూ తిరస్కరింపజాలడని భావించి పరశురాముని శరణుకోరింది. ఆర్తురాలైన అంబను తీసుకొని భీష్ముడివద్దకు వచ్చి పరశురాముడిలా అన్నాడు.

స్వయంవరోత్సవంనుంచి ఈ అంబను నీబలంతో తీసుకొచ్చావు. ఇప్పుడు నీవవసరంలేదు, వెళ్ళిపో అంటే ఎక్కడికెళ్తుంది? నీ తమ్ముడికిచ్చి ఈమెకు వివాహం జరిపించు. అలా నీవు చేయకపోతే– అది అధర్మమే అవుతుంది అన్నాడు. ఆ మాటలకు భీష్ముడు "అంబ సాళ్వుని ప్రేమించానని చెప్పటం వల్లనే ఆమెను అతనిచెంతకు పంపించాను. ఆమెను నా తమ్ముడికిచ్చి ఏవిధంగా పెండ్లి చేస్తానన్నాడు. గురుధిక్కారాన్ని సహించని పరశురాముడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. గురు



## సెప్టెంబరునెల క్విజ్–2 సమాధానాలు

| | |
|---|---|
| 01) వైఖానసాగమం | 11) కన్యారాశి |
| 02) త్రివిక్రముడు | 12) వేమన |
| 03) గొప్పవినాశనం | 13) గుణసంధి |
| 04) తామ్రధ్వజుడు | 14) సామవై పెరుందేవి |
| 05) చూళిక | 15) అర్జునవిషాదయోగం |
| 06) భగవతీఆరాధన | 16) లడ్డూప్రసాదం |
| 07) తొండమనాడు | 17) తిరుప్పేర్‌నగర్ |
| 08) వినత | 18) తాళ్లపాక అన్నమాచార్యులు |
| 09) శ్రవణ | 19) ధ్వజావరోహణం |
| 10) పుట్ట | 20) ఆనందనిలయం |

శిష్యులమధ్య యుద్ధం భీకరంగా జరిగింది. ఆ యుద్ధంచూచి గురువువిషయంలో కఠినత్వం పనికిరాదు. సమ్మోహనాస్త్ర ప్రయోగాన్ని ఉపసంహరించు అని వసువులు చెప్పటంతో భీష్ముడు ఎక్కుపెట్టిన దివ్యాస్త్రాన్ని ఉపసంహరించాడు. అదే సమయంలో జమదగ్నిమహర్షి, ఆయన పితరులు, గంగాదేవి వచ్చి పరశురామునిచేత యుద్ధాన్ని విరమింపచేశారు. పరశురాముడు అంబతో "తల్లీ ఇంతకన్న ఎక్కువ నేనేమీ చేయలేను. నీ ఇష్టం వచ్చినచోటుకు వెళ్లు" అని చెప్పి అక్కడినుండి వెళ్లిపోయాడు.

ఆగ్రహానుగ్రహాలలో మహోన్నతుడు పరశురాముడు. తనవద్దకువచ్చి విద్య నేర్పమని అడిగినవారందరికీ యోగ్యతానుసారంగా వారినందరినీ శస్త్రాస్త్రశాస్త్రధురీణులుగా తీర్చిదిద్దిన ఆచార్యసత్తముడు భార్గవరాముడు. పరశురాముడు చిరంజీవికావడంతో తరతరాలవాళ్ళూ ఆయనవద్ద శిష్యరికం చేశారు. అటువంటివారిలో కర్ణుడుకూడా ఒకడు.

బ్రహ్మజ్ఞానసంపన్నుడైన పరశురాముణ్ణి సేవించి బ్రహ్మాస్త్రాదిదివ్యాస్త్రాలను పొందాలని కోరివెళ్ళిన కర్ణుడు ఆ దయాసాగరుడికి అసత్యవచనాలుచెప్పి శిష్యుడిగా చేరాడు. కర్ణుడిశ్రద్ధకు మెచ్చి పరశురాముడు బ్రహ్మాస్త్రాన్ని, భార్గవాస్త్రాన్ని, మరికొన్ని దివ్యాస్త్రాలను అతనికిచ్చి వాత్సల్యాన్ని కురిపించాడు. ఆపత్సమయంలోనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాలని, వేరు సమయాల్లో కాదని చెప్పాడు. కాని అసత్యం కొంతకాలమే కదా నిలిచేది.

ఒకనాడు పరశురాముడు కర్ణునితొడమీద పడుకొని నిద్రిస్తున్నసమయంలో జరగకూడనిపని జరిగిపోయింది. ఒక



కీటకంవచ్చి కర్ణునితొడను తొలిచేసింది. అక్కడినుండి రక్తం కాలువై ప్రవహించసాగింది. నిద్రాభంగం జరిగిన పరశురాముడు కర్ణుడి నిగ్రహశక్తినిచూసి అతడు బ్రాహ్మణుడు కాడని గ్రహించాడు. కర్ణుడు తాను సూతసుతుడనని నిజం ఒప్పుకొని తలదించుకొన్నాడు. అసత్యమాడి, దివ్యాస్త్రాలను పొందిన కర్ణుని ప్రవర్తనకు ఆగ్రహించాడు పరశురాముడు. గురుద్రోహిఅయిన కర్ణుని క్షమించలేకపోయాడు. కర్ణుడెవరా అని క్షణకాలంపాటు దివ్యదృష్టితో చూసిన ఆ మహాత్ముడు- కర్ణునివల్ల జరగబోయే దురాగతాలను (భావిప్రళయాన్ని), దుష్టచతుష్టయంలో ఒకడిగా చేరబోయే అతడి ఆలోచనను గుర్తించాడు. ఆతడు సూర్యవరసంజాతుడని, పైపెచ్చు కౌంతేయుడని గ్రహించినా లోకశాంతి కోసం అతడికి తాను ప్రసాదించిన విద్యనిరుపయోగం కావాలని భావించాడు. బ్రహ్మాస్త్ర, భార్గవాస్త్రాలు నీకు అవసరమైనకాలాల్లో స్ఫురించవని, మరణసమయంలోనే జ్ఞప్తికి వస్తాయని కర్ణుని శపించాడు. గురుదేవుని మాటలకు ఎదురాడలేక కర్ణుడు బాధతో వెళ్ళిపోయాడు. పరశురామునిమహిమ లోకకల్యాణానికి చెందిందేగాని కేవలం క్షత్రియజాతి నశించడానికి మాత్రంకాదు. అంబను రక్షించడానికే పూనుకొన్న దయార్ద్రచిత్తుడు. కర్ణుని శపించడమే ధ్యేయంగా కలిగిన నిర్దయుడు కాడు. ఆయనదృష్టి అంతా సద్ధర్మనిర్వహణకే నిల్చింది. పాపప్రక్షాళనకే ఆయన మనసు పరుగులు పెట్టింది.

పరశురాముడు కోపావేశంతో ఇరవైఒక్కసార్లు రాజులను వెదకి వెదకి చంపాడు. ఆతర్వాత దయార్ద్రహృదయుడై అశ్వమేధ యజ్ఞంచేసి భూమినంతటినీ కశ్యపుడికి దానం చేశాడు. అంతటితో తనివిచెందక వసిష్ఠాదిమునులనడిగి, వారు చెప్పిన ప్రకారం సువర్ణదానం చేశాడు. బంగారం అగ్నిమయం. దేవతలూ అగ్నిరూపులే. బంగారం దానమిస్తే దేవతలనిచ్చినట్లే అని వేదాలు చెబుతున్నాయి. సువర్ణదానం పరమపవిత్రతను ప్రసాదిస్తుందని తెలుసుకొని "ఆ రాముండు శుచిత్వ శ్రీరాజితు"డై పుణ్యుడైనాడు.

*॥ ఓం నమో పరశురామాయ ॥*



## శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, తిరుచానూరు

### 2022, నవంబరు 20 నుండి 28 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 20-11-2022 | ఆది | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 21-11-2022 | సోమ | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 22-11-2022 | మంగళ | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 23-11-2022 | బుధ | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 24-11-2022 | గురు | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 25-11-2022 | శుక్ర | సర్వభూపాలవాహనం | గరుడవాహనం |
| 26-11-2022 | శని | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 27-11-2022 | ఆది | రథోత్సవం | అశ్వవాహనం |
| 28-11-2022 | సోమ | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారి అవభృథము, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



# గాజుల విశిష్టత

– డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

**వైకుంఠంనుండి మహాలక్ష్మికోసం స్వామి భువికొచ్చాడు. ఇక్కడ అడవుల్లో తిరుగుతూ, వకుళమాలికతో కలసి జీవిస్తున్నాడు. ఆసమయంలో పద్మావతిని చూశాడు స్వామి. ఆమెనే పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. పద్మావతికూడా అలాగే అనుకొంది. ఈ విషయాన్ని పెద్దలకు ఎలా తెలియజేయాలో అర్థంకాలేదు స్వామికి. ఆసమయంలో స్వామియే తనను పెళ్లాడతాడనే విషయం ఎలాగైనా పద్మావతికి చెప్పాలి, ఎలా అని ఆలోచిస్తూండగా ఒక ఆలోచన స్ఫురించింది. వెంటనే అమలుపరచేశాడు. స్వామి తలచుకుంటే ఎంతసేపు మరి.**

**ఆ ఆలోచనే ఒక ఎఱుకత చెప్పే స్త్రీగా అవతరించేలా చేసింది స్వామిచేత. ఎఱుకతగా మారిన స్వామి పెద్దకొప్పుతో, నొసటన పెద్ద బొట్టుతో, మెడనిండా, చేతులనిండా వివిధరకాల మట్టి. చెక్క, లక్క, దంతపు కంఠాభరణాలు, గాజులన్నీ ధరించాడు. అంచు ఉన్న నేతచీరను ధరించాడు. అలా స్వామి పద్మావతి ఇంటికెళ్లాడు. అక్కడ పద్మావతి చెయ్యి అందుకుని ఈవిధంగా ఎఱుక చెప్పాడు. ఆ ఏడుకొండలవాడే నీకు భర్తగా వస్తాడన్నాడు. అలా పద్మావతి ఎడమచేతిని అందుకున్నప్పుడు ఆమె చేతులనిండా వజ్ర, వైడూర్య, మరకత, మాణిక్య, రత్నాలగాజులతో ఎంతో శోభాయమానంగా ఉంది. వాటిమధ్యలో వివిధరంగుల్లో మట్టిగాజులున్నాయి. అవి గలగలశబ్దాలు చేస్తున్నాయి. స్వామి కుడిచేతికున్న వివిధరకాల ఆకృతులతో ఉన్న గాజులన్నీ విచిత్రంగా శబ్దాలు చేస్తున్నాయి. స్వామి అలా పద్మావతి చేతులకున్న గాజులనే చూస్తూ చేయందుకున్నాడు. కాబట్టి అప్పడే పాణిగ్రహణం అయిపోయింది స్వామికి, పద్మావతికి. తిరిగీ ముక్కోటిదేవతలసమక్షంలో అంగరంగవైభవంగా పెళ్లిచేసుకున్నాడు స్వామి పద్మావతిని. అలా ఆ గాజులచేతులే కలిపాయి ఇద్దరినీ. ఇక ఆ గాజులవిశేషంకూడా కొంత తెలుసుకుందాం...**



సౌమాంగల్యానికి చిహ్నాలు, తరగని ఐదవతనానికి ప్రతీకలు గాజులు. ఈ గాజుల అలంకారం మహిళలకి మరింత శోభను చేకూరుస్తాయి. స్త్రీలు ధరించే గాజులు మట్టివైతే ఆ ఇంట మహాలక్ష్మి నివాసముంటుందని మన సాంప్రదాయం తెలియజేస్తోంది. మట్టిగాజులు ఐశ్వర్యాన్ని కలిగించటమేకాకుండా, వీటివలనవచ్చే శబ్దంకూడా వివిధములైన శుభఫలాలను అందిస్తుంది. గాజుల అలంకారం మనుషులమధ్య అనురాగాన్ని, అభిమానాన్ని కలిగిస్తుంది.

*సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే, శరణ్యే త్ర్యంబికే దేవి నారాయణి నమోస్తుతే*

పంచమాంగల్యాలైన నుదుటన బొట్టు, చేతికి గాజులు, కాళ్ళకి మట్టెలు మరియు పట్టీలు, తలలో పువ్వులు, మెడలో మంగళసూత్రం ధరించే మాంగళ్యవతికి సర్వ కార్యసిద్ధి కలిగి, కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుందని పెద్దలు చెబుతారు.

హిందూధర్మంలో ప్రతీవిషయం శాస్త్రీయత కలిగిఉంటుంది. అయితే వాటిని సరైనరీతిలో అర్థం చేసుకుని, ఆచరించి, సంప్రదాయాన్ని గౌరవించటం నేర్చుకోవాలి.

గాజులను కేవలం మట్టిగాజులుగాని, గాజుతో తయారు చేసినవిగాని, బంగారంతోచేసినవిమాత్రమే ధరించాలి. ప్లాస్టిక్‌వాటిని ఎంతమాత్రం వాడరాదు. మనచేతినరంవద్ద రేడియల్ అనేనరం నేరుగా గుండెయొక్కనరాలతో అనుసంధానంకలిగి, గుండెస్పందనలతో సంబంధం కలిగిఉంటుంది. వైద్యులుకూడా చేతినరాలస్పందనద్వారా హృదయస్పందన తెలుసుకుంటారనే విషయం మనందరికీ తెలిసిందే!



అంతేకాకుండా ఈనరం రక్తపోటు వ్యత్యాసాలకుకూడా కారణం అవుతుంది. మనదేశంలో ప్రతిమహిళకు ఇష్టమైన ఆభరణాలలో గాజులు ముఖ్యమైనవి.

రక్తవర్ణం, సింధురవర్ణం ధనానికి, పసుపుపచ్చ సంపదకి, ఆకుపచ్చ సౌభాగ్యానికి, నీలంరంగు ఆత్మవిశ్వాసానికి, తెలుపు శాంతికి, గోధుమవర్ణం కీర్తిప్రతిష్ఠలకు, వంగపండు రంగు కుటుంబసౌఖ్యం, గులాబీరంగు సౌందర్యం, పగడపు రంగు దాంపత్యసౌఖ్యం, పుత్రసంతానం... ఇలా వివిధవర్ణాల గాజులు వివిధశుభఫలితాలను కలుగజేస్తాయని మహిళల విశ్వాసం.

ముత్తైదువుల ఐదోతనానికి గుర్తుగా ఆకుపచ్చగాజులు వేసుకుంటారు. హిందూపండుగలు లేదా శుభకార్యాలలో మామిడాకు ఆకుపచ్చతోరణంయొక్క ప్రాముఖ్యత మనకు తెలుసు. ముత్తైదువ ధరించే ఆకుపచ్చగాజులు జీవితపర్యంతం ఐదోతనాన్ని ప్రసాదించమనే అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. అంతేకాకుండా చక్కని కుటుంబసౌఖ్యం, భర్తకి సుదీర్ఘఆయువు ప్రసాదించమని ఆ పరమేశ్వరునికి చేసే ప్రార్థనకూడా కలిగి ఉంటుంది.

మన దక్షిణాదిరాష్ట్రాలలోను, మహారాష్ట్రలోను శుభ కార్యాలకు ఆకుపచ్చరంగు గాజులు ధరిస్తారు, ఉత్తరప్రదేశ్‌నందు పెళ్ళికూతురికి ఎర్రనిగాజులు, పంజాబునందు వినూత్నంగా పెళ్ళికి 21రోజుల ముందునుండి లేదా పెళ్ళితరువాత సంవత్సరంవరకూ ఏనుగుదంతంతో చేసినగాజులు ధరింపచేస్తారు. సిక్కులు తమఆచారం ప్రకారం లోహంతోచేసిన గాజులు ధరిస్తారు. అక్కడ గాజులను "కడ" అని పిలుస్తారు. ఆదివాసీ మరియు గిరిజనమహిళలు తమ చేతులనిండుగా గాజులు ధరిస్తారు. కొత్తపెళ్ళికూతురికి ఎరుపు, ఆకుపచ్చరంగులగాజులు ధరింప చేసి పెళ్ళితరువాత పదహారవరోజువరకు జాగ్రత్తగా చూసుకోమని చెబుతారు. పసిపిల్లలకు దిష్టిదోషాలు తగలకుండా నల్లగాజులు వేస్తారు.

గర్భిణీలకు ఏడవనెలలో సీమంతంచేసి పన్నెండు జతలగాజులు కుడిచేతికి, పదకొండుజతలగాజులు ఎడమ చేతికి వేస్తారు. ఆమెచేతికున్న గాజులశబ్ద తరంగాలవల్ల గర్భంలోని బిడ్డకి చక్కని వినికిడిశక్తి సవ్యంగా ఉంటుందట. అలాగే పెరిగేబిడ్డకి ఆత్మస్థైర్యంకూడా అలవడుతుందట.

నవరాత్రుల్లో దుర్గాదేవికి లక్షగాజులతో అలంకారం చేస్తారు. ఆ సమయంలో అమ్మవారు దేదీప్యమానంగా వెలిగిపోతుంటారు. దుర్గమ్మ ధరించిన గాజులను మాంగళ్యవతులకు ప్రసాదంగా పంచుతారు. వాటిని ధరించిన ముత్తైదువులు సౌభాగ్యంతో వర్ధిల్లుతారని నమ్మకం.

తిరుచానూరు అలివేలుమంగమ్మ బ్రహ్మోత్సవాల్లో సర్వసౌఖ్యాలు ప్రసాదించేవిధంగా అమ్మవారికి రకరకాలగాజులు భక్తులు సమర్పించుకుంటారు. ఆ గాజులను శ్రీపద్మావతిఅమ్మవారి పాదాలవద్ద పెట్టి దర్శించవచ్చిన భక్తులకి ఆ గాజులను పంచిపెడతారు.

*"నిండు కరముల బంగరుగాజులు ముద్దులొలుకు నాదమ్ములమువ్వలు, గలగలమని సవ్వడిజేయగ సౌభాగ్యవంతుల సేవలందగ..."* అంటూ సౌభాగ్యలక్ష్మీరూపంలో అమ్మవారిని అర్చిస్తారు. అన్నమయ్య తన సంకీర్తనలో– *"వచ్చెను అలమేలుమంగ ఈ పచ్చల కడియాల పణతి చెలంగ"* అంటూ ఆరాధించారు. మణిగణఖచితమైన గాజులఅలంకారాల్లో ప్రధాన అలంకరణగా అమ్మవారు విలసిల్లుతూ భక్తులను కాపాడుతుంటారు.



# దేవుడి నుండి దేవేరి కి..

-పల్లం పద్మావతి



తిరుచానూరులో శ్రీపద్మావతిఅమ్మవారికి పంచమీతీర్థమహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. భృగుమహర్షికారణంగా వేరైన లక్ష్మీనారాయణులు తిరిగీ కలుసుకున్న శుభదినం కాబట్టి పంచమితీర్థమహోత్సవం అంత గొప్పగా ప్రఖ్యాతి గాంచింది. ఇలాంటి ఉత్సవం ఒక్క తిరుచానూరులో ఉన్న పద్మావతిఅమ్మవారికి తప్ప మరెక్కడా జరగదు. ఈరోజున తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారు పెండ్లికుమారునిగ కన్పిస్తాడు. తిరుచానూరులోని పద్మావతిఅమ్మవారు పెండ్లికుమార్తెగా కన్పిస్తుంది.

శ్రీవేంకటేశ్వరస్వామివారి పట్టమహిషి శ్రీపద్మావతిఅమ్మవారు కదా! తనభర్త స్వయంగా తనకు, తాను అవతరించినవేళ పసుపు, పట్టువస్త్రాలు పంపడమంటే తన మాంగల్యానికి మంగళకరము కదా! శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంగా పంపే పసుపు, తులసి, పట్టుపీతాంబరవస్త్రాలు, ప్రసాదాలు ఛత్రచామరాలతో, మేళతాళాలతో, ఆలయమర్యాదలతో ఏనుగుపై ఊరేగింపుగా తిరుచానూరుమార్గంమీదుగా తిరుచానూరు పొలిమేరలో ఉన్న పసుపుమంటపానికి చేరుకుంటాయి. ఆపై ఊరేగింపుతో తిరుచానూరులోని తిరువీథులగుండా శ్రీ అమ్మవారిదేవాలయసన్నిధిని చేరుకుంటారు. పిదప పద్మావతిఅమ్మవారు, చక్రత్తాళ్వార్లు ఊరేగింపుగా పద్మసరోవరానికి చేరుకుంటారు. పంచమీతీర్థమండపానికి చేరుకున్న అమ్మవారికి, చక్రత్తాళ్వార్లకు తిరుమంజనం ప్రారంభిస్తారు. జియ్యంగార్లు స్నపనసామగ్రిని అందిస్తూండగా దేవాలయఅర్చకులు స్నపనము గావిస్తారు. వేదపారాయణందార్లు శ్రీసూక్తం, పురుషసూక్తం మొదలైన పంచసూక్తాలను; తైత్తిరీయ, నారాయణఉపనిషత్తులను గానంచేస్తారు.

ఈ స్నపనం పూర్తికాగానే అర్చకులు శ్రీచక్రత్తాళ్వారులను తీసుకొని పద్మసరోవరంలో చక్రస్నానం గావిస్తారు. అదేసమయంలో భక్తులుకూడ పద్మసరోవరంలో మునుగుతారు. ఈస్నానం పరమపుణ్యప్రదమైనది. పాపాల్ని హరిస్తుంది. సర్వరోగనివారణం చేస్తుంది. శుభాలను చేకూరుస్తుంది. సంపదలను చేకూరుస్తుంది. చక్రస్నానానంతరం జియ్యంగార్లు ప్రబంధపారాయణం గావిస్తారు. అర్చకులు శ్రీస్వామివారినుండి అమ్మవారికి సమర్పించిన పసుపు, తులసిని భక్తులకు పంచిపెడతారు. ఈ ఒక్కరోజుమాత్రమే శ్రీవారి తులసి భక్తులకు పంచబడుతుంది. సంవత్సరంలో ఈరోజుతప్ప మరి ఏరోజూ శ్రీవారితులసి దొరకడం కష్టమే.

ఆతర్వాత అమ్మవారిని పద్మసరోవరానికి ఎదురుగా ఉన్న గంగుండ్రమంటపం వద్దకు చేర్చి సాయంత్రం అమ్మవారిని విశేషవస్త్రాభరణాలతో, పుష్పాలతో అత్యంత వైభవంగా అలంకరించి నైవేద్యంపెట్టి, ఆస్థానంజరిపి తిరువీథులగుండా దేవా లయం జేరుకుని ధ్వజావరోహణంతో ఉత్సవాన్ని పూర్తిచేస్తారు.

ఆనాడు శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైఉన్న తిరుమల దేవాలయాన్ని వీడి స్వయంగా తిరుచానూరుకు చేరుకుని, పద్మావతిఅమ్మవారితో కలిసుంటారని ఐతిహ్యం.





# కార్తికపున్నమి జ్వాలాతోరణ మహోత్సవం

- *శ్రీమతి కె. నాగవేణి,*
*84978 11178*



శివకేశవులిద్దరికీ ప్రీతికరమైనమాసం కార్తికమాసం. ప్రతిసంవత్సరం కార్తికమాసంలో పూర్ణిమనాడు శివాలయాల్లో జ్వాలాతోరణోత్సవాన్ని నిర్వహిస్తారు. కార్తికపూర్ణిమనాడు చేసే స్నాన, దాన, దీపదానాదులతో అనంతమైన పుణ్యఫలా లను ప్రసాదించే ఉత్సవం 'జ్వాలాతోరణోత్సవం".

కార్తికపూర్ణిమరోజు సాయంత్రం శివాలయాల్లో ప్రధాన ఆలయానికి ఎదురుగా రెండుఎత్తైనకర్రలను నాటుతారు.



ఆ రెండింటినీ కలుపుతూ అడ్డంగా తోరణంలాగా ఎండుగడ్డితో చుట్టి, నూనెతో తడుపుతారు. ఆ గడ్డిని నిప్పుతో వెలిగిస్తారు. అది మండుతూ తోరణంలాగా కనిపిస్తుంది. దీనికే 'జ్వాలా తోరణం' అనిపేరు. శివపార్వతులను పల్లకీలో జ్వాలాతోరణం క్రిందుగా ఉత్సవంగా తిప్పుతారు. అందుకే ఈ ఉత్సవానికి 'జ్వాలాతోరణోత్సవం' అనిపేరు.

ఈ జ్వాలాతోరణోత్సవం జరపడానికి సంబంధించి ఒక పురాణగాథ ఉంది. ఈ ఉత్సవం ప్రచారంలోనికి రావడానికి పరమశివుడిభార్య శ్రీపార్వతీదేవితో ముడిపడిఉన్నట్లుగా పురాణ కథనం.

పూర్వం కృతయుగంలో అమృతంకోసం దేవదానవులు కలిసి క్షీరసాగరాన్ని మథించారు. అందుకోసం భూమధ్యలో ఉన్న మందరపర్వతాన్ని కవ్వంగా, వాసుకిసర్పాన్ని ఆ కవ్వానికి తాడుగా ఉపయోగించుకోవడానికి నిర్ణయించారు. మందర పర్వతాన్ని క్షీరసాగరంలోనికి దించగానే, అది పట్టుతప్పి పడి పోయింది. అప్పుడు ఆపర్వతాన్ని పైకిలేపేందుకు శ్రీమహావిష్ణువు కూర్మావతారాన్ని ధరించి, సముద్రంలోనికి వెళ్లి, తనమూపుతో పర్వతాన్ని పైకెత్తాడు. దేవదానవులు కలిసి క్షీరసాగరాన్ని మథించసాగారు. క్షీరసాగరంనుంచి ముందు 'హాలాహలము' వెలువడింది. అదిచూచి దేవదానవులు భయపడ్డారు. లోకహితంకోసం పరమశివుడు దానిని స్వీకరించాడు. ఆ సమయంలో పార్వతీదేవి, తనభర్తకు ఎటువంటిహాని కలగ కుండా పరమశివునికంఠాన్ని పట్టుకుంది. దీనితో హాలాహలం శివుడికంఠంలోనే ఉండిపోయింది. అందుకే శివుడు 'గరళ కంఠుడు' అయ్యాడు. ఈవిధమైన ఆందోళనసమయంలో పార్వతీదేవి, 'నా భర్తకు ఏకీడు కలుగకుండా, ఈ ఆపదనుంచి బయటపడితే నేను కుటుంబసమేతంగా అగ్నితోరణంక్రింద మూడుసార్లు దూరివస్తాను' అని మొక్కుకుంది. అనంతరం శివుడికి ఎటువంటి ఆపద కలగలేదు. అందుకే పార్వతీదేవి శివుడితో కలిసి జ్వాలాతోరణంక్రింద మూడుసార్లు దూరినట్లు పురాణకథనం. శివపార్వతులు ఈ తోరణంక్రింద దూరినరోజు కార్తికపూర్ణిమ. అందుకే కార్తికపూర్ణిమరోజున శివాలయాల్లో ఈ ఉత్సవాన్ని జరుపుతారు.

# పాంచరాత్రాగమం..

– శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు,
9701385006

పంచ అంటే ఐదు. రాత్ర అంటే రోజులు అని అర్థం. భగవంతుడు ఐదురోజులపాటు నాగరాజు అయిన గరుత్మంతుడు, అనంతుడు, విష్వక్సేనమూర్తి, చతుర్ముఖబ్రహ్మ, పరమేశ్వరుడు అనే ఐదుగురికి ఉపదేశించినవి కావున దీనికి పాంచరాత్రఆగమం అనేపేరు వచ్చింది. ఇది శ్రీవైష్ణవ పూజావిధానం. ఇది మనుషుల అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. లోకంలో ప్రతి జీవి పునరావృత్తిరహిత శ్రీవైకుంఠానికి చేరి శాశ్వతమైన ఆనందం పొందేందుకు పాంచరాత్రం దోహదపడుతుంది. పాంచరాత్ర ఆగమం అనుసరణకు గల ఒకకథను గురించి తెలుసుకుందాం.

హయవదనుడనే రాక్షసుడు వేదాలకు నిధి అయిన బ్రహ్మనుండి తస్కరించి సముద్రగర్భానికి వెళ్ళి దాక్కున్నప్పుడు వేదక్రతువులు జరగక దేవతలశక్తులు తగ్గిపోసాగాయి. అప్పుడు అయిదురాత్రులపాటూ దేవర్షులంతా కలిసి మంత్రం లేనందువలన (వేదాలు లేవు కనుక మంత్రం లేదు) తంత్రంతో పూజచేశారు. ఆవిధంగా విష్ణువు శక్తిమంతుడై మత్స్యావతారం దాల్చి హయవదనుణ్ణి చంపి వేదాలను రక్షించాడు. తిరిగి హయగ్రీవమూర్తిగా మారి వాటిని బ్రహ్మకు ఉపదేశించాడు.




అలా వేదాలు పోయి మరలా తిరిగివచ్చిన వ్యవధి అయిదురాత్రులలో భగవదారాధన వైదికపద్ధతిలోకాకుండా తంత్రంలో జరిగింది. అందువలన ఆ పంచరాత్రులపేరుమీద పాంచరాత్రం అని ఈ ఆగమశాస్త్రానికి పేరు రావడం జరిగింది. ఈ ఆగమంలో భగవంతుని సేవించేందుకు దివ్యము, అర్ఘ్యము, దైవము తదితర 108 పూజావిధానాలున్నాయి. శ్రీపాద్మసంహిత, శ్రీప్రశ్నసంహిత మొదలైనశాస్త్రాల్లో సూచించినప్రకారం శ్రీపద్మావతిఅమ్మవారిఆలయంలో నిత్య, నైమిత్తిక, కామ్యోత్సవాలను పాంచరాత్రాగమానుసారంగా జరుపుతున్నారు.

దైవ పౌరుషేయాలకు సమన్వయం తెలిపిన ఎందరో మహాఋషులు కరచరణాదులతో తిరుగాడిన పవిత్రభూమి మన హిందూదేశం. ఈ సమస్తసృష్టి శ్రీమహావిష్ణువుయొక్క స్పర్శతో నిండిఉన్నది. ఆ శ్రీహరినామాన్ని ఉచ్చరించినంత మాత్రంచేతనే సమస్తకష్టాలు తొలగిపోతాయి.

వేదమంత్రాలు వేరైనా, వాటి ఉచ్చారణలు వేరైనా, అన్ని వేదాలసారాంశం, భావం ఆ పరంధాముని శరణు వేడి మనజీవితాలు సుఖమయంగా ఉండాలని కోరటమే అని తెలుసుకోవాలి. అన్నివేదాల్లో తెలిపిన– ధర్మానికి ఉన్న నాలుగు పాదాలు– సత్యం, శౌచం, తపస్సు, దయ అనే పరమపవిత్రమైన గుణాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ సుఖమయమైన జీవితాన్ని గడుపుతూ మోక్షానికి సోపానాలను వేసుకుందాం. ఏనామంతో పిలిచినా, ఏరూపంతో కొలిచినా ఆ పరమాత్మ ఒక్కడే అనేస్థితికి ఈ మానవుడు చేరినప్పుడు దైవానుగ్రహం పరిపూర్ణమై మరుజన్మ లేనివరాన్ని పొందుతాడు.

**108 దివ్యదేశాలు**

# తిరుక్కూడలూర్

## (ఆడుదుర్రై పెరుమాళ్‌కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

**తామ్దుమ్ పెరుమై యతియార్ తూదు వేన్దర్కాయవేన్దరూర్ పోల్**
**కాన్దళ్ విరల్ మెన్ కలై నన్మదవార్ కూన్దల్ కమళుమ్ కూడలూరే.**
**తక్కన్‌వేళ్వి తకర్త తలైవన్ తుక్కముడైత తుణైవరూర్ పోల్**
**ఎక్కలిడు నుణ్ మణల్ మేల్, ఎఙ్గుమ్ కొక్కిన్ పళమ్ వీళ్ కూడలూరే**

సర్వజ్ఞుడైన శ్రీమన్నారాయణుడు తనకేమీ తెలియనట్టు తన ఆశ్రితవాత్సల్యంచేత అందరిని అనుగ్రహించేవిధంగా ఈ తిరుక్కూడలూర్ అనే దివ్యదేశంలో జగద్రక్షకభగవంతుడిగా వేంచేసి ఉన్నాడని తిరుమంగైఆళ్వార్లు మంగళాశాసనం చేశారు. కృష్ణావతారంలో దేవదేవుని ఆశ్రితవాత్సల్యమనేది సుస్పష్టమైనది అని ఆళ్వార్లు కీర్తించిఉన్నారు.

ఈ దివ్యదేశం తంజావూరుజిల్లా తిరువయ్యూరు–కుంభకోణం వెళ్లేమార్గంలో పదకొండుకిలోమీటర్లదూరంలో అమరి ఉంది. మధురైనగరంలో ఉన్న దివ్యదేశానికి తెన్తిరుక్కూడలూర్ అని, తంజావూరుజిల్లాలో ఉన్న దివ్యదేశానికి వడతిరుక్కూడలూర్ అని ఒక వ్యవహారముంది. ఈ క్షేత్రానికి ఆడుదుర్రై పెరుమాళ్‌కోయిల్ అని మరొకపేరు కూడా ఉంది. అందరూ కూడా తిరుక్కూడలూర్ అనే ఈ పేరుకన్నాకూడా ఆడుదుర్రై పెరుమాళ్ కోయిల్ అంటేనే సులభంగా ఈ దివ్యదేశానికి చేరగలుగుతారు. ఈ దివ్యదేశంలో వేంచేసిఉన్న మూలవర్లకు వైయ్యం కాత్త పెరుమాళ్ జగత్తుని రక్షించినదేవుడుకనుక జగద్రక్షకస్వామి అయ్యాడు.

తూర్పుముఖం నిలిచిఉన్నభంగిమలో స్వామి దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. చక్రతీర్థం, శుద్ధసత్వవిమానం, ఆలయగోపురం అత్యద్భుతంగా ఉంటాయి. దశావతారశిల్పాల కళావైభవంతో శోభిల్లుతూంటుంది. అత్యద్భుతమైన మండపాలు, చక్రత్తాళ్వార్లు ఉత్తరదిశనుచూస్తూ షోడశఆయుధాలతో వేంచేసి ఉంటాడు. స్వామి వెనకాల నృసింహస్వామి మనకు దర్శనమిస్తుంటాడు. మండపం దక్షిణభాగంలో వరాహస్వామిఒడిలో భూమాదేవి అలా వేంచేసి ఉండి అందరినీకూడా అనుగ్రహిస్తూంటుంది. గర్భాలయమండప సమీపంలో విష్వక్సేనులవారు, శ్రీదేవిభూదేవిసమేతుడైన వరద రాజస్వామి వేంచేసి ఉంటారు. ప్రాకారంలో తిరుమంగైఆళ్వార్లు మరియు మిగతా ఆచార్యులందరూకూడా ప్రత్యేకమైన సన్నిధిలో మనకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తూంటారు. ఈక్షేత్రం అమ్మవారు పుష్పవల్లి పద్మాసనవల్లితాయారు. ఈ అమ్మవారి ఉత్సవవిగ్రహం వలత్తూర్ అనేఊరిలో ఉన్నట్టు ప్రజలమాట.

అమ్మవారిసన్నిధికి సమీపంలో అద్భుతమైన ఒకపనస వృక్షం ఉంది. ఇదే ఈఆలయం స్థలవృక్షంగా భావింపబడుతుంది. అలాగే ఈ పనసవృక్షంసమీపంలో ఒకపెద్దశంఖు ఆకారంలో ఒకటి కనిపిస్తూంటుంది. భగవంతుని సాన్నిధ్యం ఇలా శంఖుఆకారంలో ఉన్నదని ప్రజలమాట. స్థలవృక్షమైన ఈ పనసవృక్షంసమీపంలో గోదాదేవి ఆలయముంది.



తిరుక్కూడలూర్ దైవం శ్రీజగద్రక్షకస్వామి

ఇక ఈఆలయం స్థలపురాణమేమంటే... లోకాన్ని పీడిస్తున్న హిరణ్యున్ని వధించేసందర్భంలో దేవతలు మరియు నందకమహర్షి అందరూకలసి ఒకచోట చేరారు. అందువల్ల దీనికి తిరుక్కూడలూర్ అనేపేరు వచ్చింది. భగవంతుడు వరాహావతారాన్ని స్వీకరించి ఆ భూమిలోపలికి వెళ్ళింది ఈ తిరుక్కూడలూర్ దివ్యదేశంలోనే జరిగినట్టు పురాణం చెప్తోంది. వరాహావతారం జరిగిన ప్రదేశంగాకూడా ఆళ్వార్లు కీర్తించారు.

నందకమహర్షివారి పుత్రిక ఉష. ఆమెని చంద్రవంశోద్భవుడైన విశ్వజిత్ అనేరాజు ప్రేమవివాహం చేసుకున్నాడు. ఆమెపైన రాజకులానికిచెందిన కొందరు కొన్ని ఆరోపణలు చేశారు. అవి విని విశ్వజిత్ ఉషను అక్కడినుండి పంపించేశాడు. ఆ అపచారానికి అతడు తన ఐశ్వర్యాన్నంతటినీకూడా పోగొట్టుకున్నాడు. ఒక పెద్దవ్యాధి వచ్చింది. తానుచేసిన ద్రోహానికి పరిహారంకొరకు తనభార్యను వెతుకుతూన్నసందర్భంలో ఒకసన్యాసిని చూశాడు. ఆ సన్యాసి అతణ్ణి తిరుక్కూడలూర్ జగద్రక్షుణ్ణి నీవు సేవిస్తే నీపాపం తొలగిపోతుంది. నీభార్యను కూడా పొందగలవు అని చెప్పాడు. అలా అతడు జగద్రక్షకస్వామినిసేవించి తనవ్యాధిని పోగొట్టుకుని తన భార్యనుకూడా పొందాడు. ఈప్రకారంగా ఈక్షేత్రానికి ఉన్నవైభవం ఏమిటంటే ఎవరైనా దంపతులు విడిపోతే వాళ్లని ఒకటిగాచేర్చే దివ్యదేశం కూడలూర్ అని చెప్తుంటారు.

అలాగే ఇక్కడ అద్భుతమైన తేరు ఉంది. దానికి అంబరీషరథమని పేరు. రాజైన అంబరీషునికి దుర్వాసమహర్షి చేత కల్గిన ఒకకష్టం తొలగినందువల్ల ఆ భగవంతుడికి రథాన్ని చేయించినట్లు కథనం. ఒకానొకసందర్భంలో కావేరినదీమాత ప్రవాహంచేత అంబరీషమహర్షిచేత కట్టబడిన ఈ క్షేత్రం అలాగే మునిగిపోయింది. భగవంతుడివిగ్రహాలు అన్నీకూడా అలాగే కొట్టుకొనిపోయాయి. అవి మత్స్యకారులవలలో చిక్కాయి. వాళ్లు చాలాకాలం ఆ భగవంతునివిగ్రహాలకు పూజచేశారు.

మధురనగరిని పరిపాలిస్తున్న రాణిమంగమ్మకలలో భగవంతుడు కనిపించి తాను ఉన్నచోటు ఆమెకి చెప్పి తనకొక ఆలయం నిర్మించాలనే ఆజ్ఞ చేశాడు. రాణిమంగమ్మ ఆలయాన్ని నిర్మించి, ఆ విగ్రహాలనంతాకూడా మత్స్యకారులదగ్గరనుండి తీసుకునివచ్చి ప్రతిష్ఠచేయించింది. అంబరీషమహర్షిచేత కట్టబడిన ఆలయం కావేరీప్రవాహంలో కొట్టుకొనిపోయింది.



ఆ ఇసుక ఇప్పటికి కూడా కనిపిస్తూంటుంది. దాన్ని పెరుమాళ్ పొక్కల్ అంటారు. వైఖానసాగమంప్రకారం ఈదేవాలయంలో పూజలు జరుగుతున్నాయి. తిరుమంగైఆళ్వార్లు పదిపాశురములతో ఈ స్వామిని కీర్తించిఉన్నారు. మనమందరంకూడా ఈపద్మాసనవల్లి అమ్మవారితో వేంచేసిఉన్న జగద్రక్షకస్వామిని సేవించి తరిద్దాం.

శ్రీమత్సర్వసురేద్యమేలనపురే దేవో జగద్రక్షకః
తీర్థం చక్రసరో విమానాపి వై తత్ శుద్ధసత్వాహ్వయమ్
తస్మిన్ నన్దకతాపసాయ వరదో దేవీ తు పద్మాసనా
ప్రోద్యాత్ భాస్కరఙ్ముఖః సురగణైః సంసేవితో దృశ్యతే

## ప్రబోధనైకాదశి

**కార్తికశుద్ధఏకాదశియందు శ్రీమహావిష్ణువు యోగనిద్రనుండి మేల్కొంటాడట. ఈరోజున శిష్టులు దేవతామంత్రదీక్షలను తీసుకొని దేవతావ్రతాలు, పూజలు చేయటం గొప్ప విశేషం.**

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గతసంచిక తరువాయిభాగం...*

మనుష్యజన్మలో ఇటు కాస్త పుణ్యంకూడా చేరిఉంది. అటు పాపంకూడా చేరిఉంది. పాపం చేరిఉంది కాబట్టి రక రకాలకష్టాలు పడుతూనే ఉన్నాము. ఈ శరీరం రక్షించుకోవాలి. దీన్ని పోషించుకోవాలి. కష్టాలు నిరంతరం ఉంటూనే ఉన్నాయి.

అదేసమయంలో ఈశరీరంలో సాధించగలిగినటువంటి ప్రయోజనాలు మరి ఏశరీరంలో లేవు. అటు దేవశరీరాల్లో కూడ లేవు. దేవతాశరీరాల్లోకూడ వాళ్లు సాధించగలిగేది పెద్దగా ఏం లేదు. వాళ్లు అక్కడ ఉండేటువంటి భోగాలను అనుభవించటం. మళ్ళీ తిరిగి వచ్చేయటమే కానీ మనుష్యశరీరంలో ఉంటే ఏమైనా సాధించవచ్చు. ఏం సాధించవచ్చు అంటే ఈలోకంలో కాదు. పరలోకంలోకాదు. ఆపై లోకంలోకాదు. తత్త్వజ్ఞానంవరకు సుఖంగా సాధించగలిగినటువంటి ఏకైక శరీరం మనుష్యశరీరం. అది కాబట్టి పుణ్యఫలమూ, ఇటు పాపగుణమూ రెండుకలసి వ్యామిశ్రముగా మిశ్రితంగా ఉండేటువంటి విచిత్రమైనజన్మ మనుష్యజన్మ కాబట్టి పుణ్యజన్మలకీ పుణ్యకర్మలఫలితాలు, కొన్ని పాపకర్మలకు ఫలితాలు కొన్ని సంక్లిష్టమైనటువంటి మిశ్రమఫలితాలు.

ఇలా ఫలితాలు రకరకాలుగా ఉంటాయి. కాబట్టి దేహాలుకూడ రకరకాలుగ ఉంటాయి ఒకేమనిషి మూడుకర్మలు చేయొచ్చు. శుద్ధమైన పుణ్యకార్యం చేయొచ్చు. పాపకార్యం అంటే దాంట్లో పుణ్యం లేశంకూడా కలవకుండా కేవలం పాపమే చేయొచ్చు. మిశ్రితంగాకూడ చేసుకోవచ్చు. ఇట్లా మనం చేసుకున్నటువంటి కర్మలకు ఫలితంగా ఆయా విచిత్రమైనటువంటి దేహాలు మనకే వస్తాయి. రకరకాలజీవులకు రకరకాల దేహాలవలన ఈ ప్రపంచంలో ఇట్లాంటిదేహాలతో నిండి ఉంది.

అతి తీవ్రమైన పాపం చేస్తే ఏ జన్మ వస్తుంది? అంటే రకరకాలజన్మలు ఒకటి నరకంలోకి వెళ్తాం. వాటిన్నిటికంటే ఘోరమైన జన్మ ఒకటుంది. ఏమిటంటే ఒకచెట్టుగా పుట్టడం. మనం గురువులను కనుక 'హుం' అంటే వాళ్ళని ఎదిరించే మాటైతే, వాళ్ళని అనరానిమాటలేమైనా అన్నట్లయితే, మనకు చదువు చెప్పినవాళ్ళు, మంచిమాటలు చెప్పినవాళ్ళు వాళ్ళని అనరానిమాటలేవైనా అన్నట్లయితే, మంచి చదువుకున్నటువంటి వ్యక్తులను మనం ఏదో మన తెలివితేటలతో ఓడించినట్లయితే ఏం ఫలం వస్తుందంటే ఆ పాపానికి ఫలితం స్మశానంలో చెట్టుగా పుడతాడు. చెట్టుగా పుడతాడు అంటే చెట్టుకికూడా దానినీడలో ఎవరోఒకరు చల్లగా కూర్చుంటే ఆచెట్టుకి ఇంత పుణ్యమైనా వస్తుంది కాని స్మశానంలో చెట్టుక్రింద ఎవరు కూర్చుంటారు? దానిచుట్టూ ముళ్లుంటాయి. దానిమీద గద్దలు కూర్చుంటాయి. ఇట్లాంటి జన్మవస్తుంది అని చెప్పారు.

కాబట్టి వృక్షజన్మకుకూడ ఒక పాపఫలితం ఉండనే ఉంది. ఆ వృక్షజన్మ అనేది మనకు ఈ జన్మనుండి పైజన్మలో కలగనే కలగరాదు. అలాంటి పాపం మనం చేయరాదు. ఇంతే కాకుండ ఇలాంటిపాపాలు మరేవీకూడా మనం చేయరాదు అని దానికి తగ్గట్టుగా మనమందరం నడుచుకోవాలి. నడచుకొని మంచిజన్మలనైతే పొందాలి. అలా లేకపోతే జన్మరాహిత్యాన్నైనా శ్రీవారి అనుగ్రహంతో పొందాలి. దానికి తగ్గట్టుగా నడుచుకుందాం.

'కృష్ణం వందేజగద్గురుమ్'



## ధన్వంతరి

**విష్ణుమూర్తి ఏకవింశతి (21) అవతారాలలో పదకొండవది ధన్వంతరిరూపం. అందుకే "ధన్వంతరి నారాయణా" అని కొలుచుకుంటున్నాం. ధన్వంతరి తన ఆయుర్వేదశాస్త్రగ్రంథంలో ఎనిమిదిరకాల వైద్యవిధానాలను వివరించాడు. 1)కాయచికిత్స-నోటిలోనికివేసేమందు, 2)బాలచికిత్స- గర్భస్థశిశువునుండి 20ఏళ్ళవరకు కలిగేరోగాలకు మందు, 3)భూత లేదా గ్రహచికిత్స- మానసికవైకల్యానికి మందు, 4)శలాకచికిత్స- కన్ను, ముక్కు, చెవి, గొంతులకు మందు, 5)శల్యచికిత్స- మందులతోకాకుండా చికిత్స (సర్జరీ), 6)విషతంత్రచికిత్స- శరీరంలోకిచేరిన రకరకాల విషప్రభావ వివరణ, 7)రసాయనతంత్రచికిత్స- వివిధరకాలమూలికల, పసరులతో రోగనివారణ, 8)వశీకరణతంత్రచికిత్స- నపుంసకత్వాన్ని పోగొట్టడం, సంతాన భాగ్యాన్ని కలిగించడం.**

**ఇంత విస్తారమైన వైద్యశాస్త్రం మరొకటిలేదు. నేటి వైద్యశాస్త్రాలన్నింటికీ ఈగ్రంథమే మూలాధారం. ఇవన్నీ సులభంగా అర్థం కావడానికి "వైద్యనిఘంటువు"నుకూడా నిర్మించాడు ధన్వంతరి.**

శ్రీవేంకటేశ్వరలీలలు



# స్వామి అక్షతలతో..

-శ్రీ పెనుగొండ శ్రీనివాస్, 96036 45003

నా స్వామి ఎప్పుడూ నా మొర ఆలకిస్తాడు. మేము నలుగురు అన్నదమ్ములం. నేను ద్వితీయపుత్రుణ్ణి. నా తర్వాత తమ్ముడు. వాళ్లఅమ్మాయి ఉద్యోగినిగా పనిచేస్తోంది. కాని, ఆమెకు ఎన్ని సంబంధాలుచూసినా ఒక్కటీ కుదరలేదు. మా తమ్ముడు సుమారుగా 60, 70 సంబంధాలు చూశాడు. కానీ ఏవీ కుదరలేదు.

నేను మే 31వతేదీన రూ.300/- టిక్కెట్, జూన్ 1వతేదీన శ్రీవేంకటేశ్వరస్వామికల్యాణంటిక్కెట్ ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్నాను. నేను బయలుదేరేముందు ఈ విషయాన్ని మాతమ్మునికి, వాళ్లభార్యకు చెప్పడం జరిగింది. అప్పుడు మా మరదలు వాళ్ల అమ్మాయికి పెళ్లి కుదరాలని శ్రీస్వామివారికి విన్నవించమని చెప్పడం జరిగింది.

మేము మొదటిరోజు 12గం॥కు రూ.300/- దర్శనానికి వెళ్లాం. స్వామివారి బంగారువాకిలిదగ్గరికి వెళ్లేటపుడు ఏమైందో తెలీదు కానీ మధ్యవరుస గరుడాళ్వార్‌ముందు ఖాళీగా ఉంది. నేను, నాభార్య, మాపాప మాత్రమే ఆ వరుసలో ముందుకి వెళ్లిచూస్తే ఎదురుగా స్వామివారున్నారు. అప్పుడు మా మరదలు చెప్పినవిధంగా స్వామివారికి మొరపెట్టుకున్నాను. నేను ఎప్పుడు స్వామిముందు ఏ కోరికలు కోరలేదు. ఈసారి కోరడం జరిగింది.




రెండవరోజు జూన్ 1వతేదీన స్వామివారికల్యాణంలో రెండవ వరుసలో కూర్చునే అవకాశం స్వామివారు ఇచ్చారు. మొదటివరుసలో పెద్దప్రముఖులు వారి కుటుంబసభ్యులు కూర్చొని ఉన్నారు. ఆరోజే మేము విష్ణుసహస్రనామ పుస్తకాలుకూడా పంచాం.

మేము ఇంటికి వచ్చినతర్వాత కల్యాణం అక్షతలు, స్వామి వారి లడ్డుప్రసాదం మా తమ్ముడికి ఇచ్చి అమ్మాయితలపై స్వామి అక్షతలు వెయ్యమని చెప్పాం.

స్వామివారిలీల ఏమని చెప్తాం. నాలుగురోజుల్లో అమ్మాయికి పెళ్లిసంబంధం కుదిరింది. అబ్బాయివాళ్లకి తిరుపతి కొండమీద వివాహం చేయాలని మొక్కు ఉందంట. ఆ ప్రకారమే తిరుమలకొండమీద ఆగష్టునెలలో మ్యూజియం ప్రక్కన, రింగ్‌రోడ్డుదగ్గరగా ఒక సంస్థ మినీహాలులో వివాహం చేయటానికి స్వామివారు అనుమతించడం జరిగింది. ఇది స్వామివారిలీల కాకుంటే ఇంకేమిటి. మా ఇలువేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి ఎల్లవేళలా మమ్మల్ని, మా కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తారని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్వామీ! నీ లీలలు అమోఘం! అనంతం!! తండ్రీ!!!

*గోవిందా! గోవిందా!! గోవిందా!!!*

విశ్వదాభిరామం          వేమన పద్యసూక్తి



# మనసు మార్చరానిది

**మాట దిద్దవచ్చు మరి యెగ్గు లేకుండ;**
**దిద్దవచ్చు రాయి తిన్నగాను;**
**మనసు దిద్దరాదు మహి నెంతవారికి;**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** దిద్దవచ్చు= సవరించవచ్చు; ఎగ్గు= దోషం; తిన్నగాను= చక్కగా; మహి= భూమి.

**భావం:** మాటలో తప్పులుంటే, దోషంలేకుండ సరి చేయవచ్చు. ఎగుడుదిగుడుగాఉన్నరాతిని సమంగా మలచుకోవచ్చు. కాని చెడుమార్గంలో నడుస్తున్నమనస్సును మంచిమార్గంలోకి మళ్లించడం ఎంతవారికైనా సాధ్యంకాదు.

**వివరణ:** పిన్నలుగానీ, పెద్దలుగానీ పలికేమాటలలో దోషాలు ఉన్నపుడు అది తెలిసినవాడు ఆ మాటను పదే పదే పలికించి, దోషాలను వివరించి, తప్పులేకుండా సరిచేయవచ్చు. వంకతర టింకరగా ఉన్నప్పటికీ కఠినమైనరాయిని గూడ నేర్పు కలిగినవాడు తగువిధంగా చెక్కి, అందంగా శిల్పంగా మలచవచ్చు. కాని, ఎంతటిసమర్థుడయినా, ఇతరులమనసులో నిలిచిఉన్న దోషాలను తొలగించి, మంచివాడిని చేయలేడు. మనసుకు అంటిన చెడుభావాలు ఎంతకష్టపడినా మారవు. కాబట్టి మనిషి బాహ్యంగా దోషాలు కలిగిఉన్నా ఇబ్బందిలేదు. కాని అంతరంగికంగా మాత్రం చెడిపోగూడదు అని తాత్పర్యం.

*– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

# శ్రీకృష్ణామృతం

విశ్వమోహనరూపం
విమలహృదయవిచలితం
వివరమెరుగని మనోవివశం
వికసిత అవ్యక్త ఆత్మపరవశం

వేదవేదాంగులసైతం
విస్మయపరచుసందం
వెన్నదొంగకెట్లుసొంతం
విస్మయమున పుట్టెసందేహం

ఎట్లయినవి ఆహాసితములు
ఎల్లరను కట్టిపడవేయు పాశములు?

పెదవులనెడబాసి మనలేనిదాస్యం
ప్రియమార అధరములధరియించు నీలాస్యం
ముగ్ధమనోహరహసితములు రచియించుకావ్యం
మిగుల తర్కించినగాని వివరింపనలవికానిభాష్యం

ఏతీరు బలములావీక్షణములు
ఎల్లలుదాటి జనుల బంధించుబంధములు

మీననేత్రపుటంచులవీడి ప్రసరించువీక్షణం
మిక్కిలిశోభల్ల మెరయుచు భక్తులజేరును తక్షణం
గ్రహదశలు స్థితిగతులు కావేవి ప్రమాణం ఏక్షణం
గ్రక్కున అనుగ్రహామృతములు వర్షించుటే వాటిలక్షణం

ఎట్టిమంత్రజాలములను ఇమడ్చెనో ఆఅడుగులు
ఎంతటివారికయినా కాంక్షపెంచు చేర నీపదములు

మృదుపదములు నేలనుతాకినసవ్వడి
మృదంగవాద్యములు మెత్తగమ్రోగిన సడి
మృత్తిక తనభాగ్యమునకు మురిసి పట్టుగామారె చూడుడి
మృగ్యమగు దివ్యచరణాలచేర సర్వులు పరుగిడేవడివడి

మనసు శ్రీకృష్ణునివశం
మదిని నీనామభజన అనిశం
ముముక్షువులకీ మార్గమేనిర్దేశం
ముదమున శ్రీకృష్ణునివేడగ చేరదునిను ఏక్లేశం

*– "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు),*
*99103 45794.*



దైవకార్యాలకు ఆవుపాలే శ్రేష్ఠమైనవి

# సంస్కృతం నేర్చుకుందాం..!!

## పాఠం-17

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| अन्नम् | = అన్నము | पुरा | = మునుపు | कुर्युः | = చేయుదురు, వలెను - చాలుదురు |
| घृतम् | = నెయ్యి | चिरम् | = చాలకాలము | कुर्यात | = మీరు చేయుదురు, వలెను - చాలుదురు |
| आलस्यम् | = జాగు | अर्थम् | = కోసము | कुर्याम | = చేయుదుము, వలెను-చాలుదుము |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) अद्य पाकं के कुर्युः?

02) गृहे घृतं नास्ति।

03) तटाके जलं नास्ति।

04) आलस्यं करोषि किम्?

05) त्वं तत्र चिरं आसीः किमर्थम्?

06) देवः पुरा प्रथमं जलं अकरोत्।

07) वयं पाकं सम्यक् कुर्याम।

08) त्वं शाकं कुर्यः, अहं पाकं कुर्यानि।

09) घृतं नास्ति चेत् शाकं कथं कुर्याम?

10) अस्मद्गृहे युष्मद् जनकः तूष्णीमेव आलस्यं करोति; त्वमपि अत्रासि किं? शीघ्रं स्नानं कुरु।

### అ) జవాబులు

01) ఇవ్వేళ వంట ఎవరు చేయుదురు?

02) ఇంట్లో నెయ్యి లేదు.

03) కొలనులో నీరు లేదు.

04) జాగు చేయుచున్నావేల?

05) నీవక్కడ చాలకాలము ఎందుకు ఉన్నావు?

06) దేవుడు మునుపు మొదటగా నీటిని చేసెను.

07) మేము వంట బాగా చేయుదుము.

08) నీవు కూర చేయి. నేను వంట చేస్తాను.

09) నెయ్యి లేకపోతే వంట ఎలా చేసెదను?

10) మా ఇంటిలో మీనాన్న ఊరకనే జాగు చేయుచున్నాడు; నీవు కూడ ఇక్కడనున్నావా ఏమిటి? త్వరగా స్నానం చేయుడు.

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) ఇవ్వేళ వంట నెవరు చేయుదురో?

02) మీకోసము నేనే చేయుచున్నాను.

03) లేకపోతే ఎవడు చేయును?

04) మీ తండ్రి.

05) ఇవ్వేళ వారందరు మీ ఇంట్లో నున్నారా?

06) ఏమియును లేదు; అట్లే కానిమ్ము.

07) మీ పిల్లలు మా ఇంట్లో అన్నము కోసమున్నారు.

08) అలాగా, మీరు కొంచె మిక్కడ నుండుఁడు.

09) మీరు వేదికనందున్నారా?

10) ఊరకుండుము.

### ఆ) జవాబులు

01) अद्य पाकं कः करोति?

02) युष्मदर्थम् अहमेव करोमि।

03) नो चेत् कः करोति?

04) युष्मत्पिता।

05) अद्य ते सर्वे युष्मद् गृहे सन्ति वा?

06) किमपि नास्ति; तथैव भवतु।

07) युष्मद् पुत्राः अस्मद् गृहे अन्नार्थं सन्ति।

08) एवं वा, यूयं किञ्चिदत्र भवन्तु।

09) यूयं मञ्चे सन्ति वा?

10) तूष्णीं भव।

చిత్ర కథ

# అలమేలుమంగ అనుగ్రహం

కథ– డా॥ జె.అనీల్‌కుమార్
చిత్రాలు– శ్రీ కె.ద్వారకనాథ్

లక్కమాంబ నారాయణసూరిదంపతులు పుత్రుడు కావాలని వేంకటేశునికి మొక్కుకున్నారు.
వాళ్లకు నందకాంశతో అన్నమయ్య జన్మించాడు.




అన్నమయ్యా! లే నాయనా! (అన్నపిలుపు వినబడింది)
అమ్మా! నీవెవరు? నాకెవరూ కన్పించడం లేదు.
నేను అలమేలుమంగను! నీ కాలికున్న జోళ్లు తీసి చూడు.
అంతా కనపడుతుంది.
అన్నమయ్యా! ఆకలిగా ఉంది కదూ!
ఇవిగో స్వామివారి ప్రసాదాలు అంటూ...
పెరుగన్నం, పులిహోర, పొంగళ్లను తినిపించింది.
వెంటనే అన్నమయ్యకు సత్తువ వచ్చింది. ఉత్సాహం కలిగింది.
కవిత్వం అబ్బింది. వెంటనే అలమేలుమంగను స్తుతిస్తూ..
ఒక పద్యశతకాన్ని ఆశువుగా చెప్పాడు.
అమ్మ ఆనందపడుతూ.. ఆశీర్వదించి అదృశ్యమయ్యింది.
'అదివో! అల్లదివో!
హరివాసము' అని
గానం చేసుకుంటూ
కొండమెట్లను ఎక్కాడు..

బాలనీతి

# కాకమ్మే కాపాడింది!!

– శ్రీ పచ్చా పెంచలయ్య, 99128 22341.

విదర్భపురంలో విష్ణుశర్మ అనే ఓ విప్రుడుండేవాడు. అతడు చాలా పేదవాడు. బహుసంతానవంతుడు. భార్య సుశీల కూడా భర్తకు తగినదే. ఉన్నదాంతో తృప్తిపడి సంసారాన్ని నెట్టుకొస్తూంది. విష్ణుశర్మ భౌతికంగా బీదవాడేకాని, ఆధ్యాత్మికంగా, పరోపకారాపేక్షలో ఎంతో సంపన్నుడు. తనతండ్రి ఎప్పుడూ ఇలా చెబుతుండేవారు "నాయనా సహృదయతతో మనం చేసే ప్రతీపనీ నిస్వార్థంగా ఉండాలి. అందువల్ల మనకు దైవకృప తప్పక కలుగుతుంది" అని. ఆ మాటలు విష్ణుశర్మ హృదయంలో బలంగా నాటుకుపోయాయి.

రోజుమాదిరిగానే అతను సమీపగ్రామానికి యాచన నిమిత్తమైపోయి, దొరికిన పదార్థాలతో ఇంటిముఖం పట్టాడు. దారిలో చిన్న అటవీప్రాంతముంది. దానిని దాటి తన స్వగ్రామానికి చేరుకోవాలి. దారిమధ్యలో అతనికి కాలు విరిగి క్రిందపడి అల్లాడుతున్న ఓ కాకిపిల్ల కనిపించింది. అదిచూచి అతను "జోలె దింపి ప్రక్కనబెట్టి తనపై ఉన్న తుండుగుడ్డలో కొంచెం చింపి దాని కాలికి కట్టుగట్టి జాగ్రత్తగా ఇంటికి తీసుక వచ్చాడు కాకిపిల్లని. భార్యకు విషయం చెప్పి, కాకిపిల్లకి చిరువైద్యం చేసి, నూకలు ఆహారంగా వేసి జాగ్రత్తగా కాపాడసాగాడు.

అలా కొన్నిరోజులు గడిచాయి. కాకిపిల్ల క్రమంగా కోలుకుంది. కోలుకోగానే ఇల్లు విడచివెళ్లిపోతుందనుకున్న ఆ కాకి వారిని వదలిపోలేదు. దొరికిన ఆహారం తింటూ వారివద్దనే ఉండిపోయింది.

ఓరోజు విష్ణుశర్మ తెల్లవారకముందే లేచి పెరటిలోకి వెళ్తుండగా ఆ కాకి కావు.... కావుమని అరుస్తూ ఆతనితలను కాళ్లతో తన్నసాగింది. "ప్రొద్దున్నే ఏమిటి దీని చేష్టలు" అని విసుగుపడ్డాడు శర్మ. ముందుకడుగేశాడు. కాకి మరలా అలాగే అరుస్తూ ఆయన్ను తలపై తన్నుతూ ముందుకు కదలనీకుండా చేస్తూ ఉంది. ఈలోగా కొంచెం మసక వదలి వెలుతురొస్తూ ఉంది. అప్పుడు కనిపించింది అతనికి. పెరటిదారిలో ఎలుకనో, కప్పనోతిన్న పామొకటి అడ్డంగా పడుకోనుంది కదలలేక. శర్మ అడుగువేసి ఉంటే ఆ అడుగు దానిపై పడేది. అప్పుడుగాని మనసుకు రాలేదు కాకి తనను ఎందుకు ముందుకు అడుగేయనీయకుండా ఆపిందో శర్మకు.



అయ్యో నా ప్రాణాలు కాపాడటానికి ఈ కాకి ఎంతశ్రమ తీసుకుంది. అదే గనుక లేకపోయుంటే ఎంత అపాయం ముంచుకొచ్చుండేది అని అనుకుంటూ కొమ్మపై కూర్చున్న "కాకి" వైపు కృతజ్ఞతగా చూశాడు శర్మ. తన తండ్రి చెప్పినట్లు తను చేసిన చిన్నసహాయానికి కాకి తనకు ఎంతసహాయం చేసిందోకదా అనుకున్నాడు.

ఎప్పుడూ నిస్వార్థంగా మనం చేసే ప్రతీసహాయం భగవత్కృపకు దారి తీస్తుందనేదే "సత్యం".

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### షోడశోపచారములు

01) అర్ఘ్యము
02) పాద్యము
03) ఆచమనము
04) శుద్ధోదకస్నానము
05) వస్త్రయుగ్మము
06) యజ్ఞోపవీతము
07) గంధలేపనము
08) అక్షతధారణము
09) ఆభరణాలంకారము
10) పుష్పాణిపూజనము
11) ధూపఘ్రాణము
12) దీపదర్శనము
13) నైవేద్యనివేదనము
14) తాంబూలము
15) నీరాజనము
16) మంత్రపుష్పము

## పిల్లలూ..జతచేయండి!!

| | | | |
|---|---|---|---|
| 1) | లక్ష్మీదేవినాచ్చియార్ | అ) | రేవతినక్షత్రం |
| 2) | ఆండాళ్‌నాచ్చియార్ | ఆ) | శతభిషనక్షత్రం |
| 3) | పద్మావతినాచ్చియార్ | ఇ) | పూర్వఫల్గునినక్షత్రం |
| 4) | శ్రీదేవినాచ్చియార్ | ఈ) | ఉత్తరాషాఢనక్షత్రం |
| 5) | భూదేవినాచ్చియార్ | ఉ) | ఉత్తరఫల్గునినక్షత్రం |

జవాబులు: 1-(ఉ); 2-(ఇ); 3-(ఈ); 4-(ఆ); 5-(అ)

## చెప్పండి చూద్దాం!



ఈ క్రింది బొమ్మల్లోని 'ఆళ్వారుల' పేర్లని గుర్తించి రాయండి!






1) ..................... 2) ..................... 3) ..................... 4) .....................

జవాబులు: 1)తొండరడిప్పొడిఆళ్వార్ 2)కులశేఖరాళ్వార్ 3)పెరియాళ్వార్ 4)నమ్మాళ్వార్

## కనుక్కోండి

ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

ఇ రు ను ని వ నీ అ మా ప తా
ల త అ మా స్తే వే న వ వు డ

జవాబు:
ఇతరులను అవమానిస్తే
నీవే అవమానపడతావు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 04

01) తిరుమలేశుని హృదయంమీద కొలువైఉన్న దేవేరిపేరు? జ)................

02) శ్రీమహావిష్ణువుకు శ్రేష్ఠమైనపుష్పాలనుగురించి ఏ గ్రంథంలో ఉంది? జ)................

03) అమ్మవారిని ఏరంగుకుంకుమతో పూజిస్తే రాహుగ్రహబాధలు తొలగిపోతాయి? జ)................

04) అన్నాభిషేకమహోత్సవానికే మరోపేరు? జ)................

05) దేవసేన, వల్లీసమేతంగా కొలువైఉండే స్వామిపేరు? జ)................

06) శివుడుకంఠంలో విషాన్ని నిలుపుకున్నందువల్ల ఏ పేరొచ్చింది? జ)................

07) పూజాదికార్యక్రమాల్లో లక్ష్మీప్రదవస్త్రాలు ఏవి? జ)................

08) 'మంగళవారం'నకు మరోపేరు? జ)................

09) దేవలోకంలో తూర్పుదిక్కును పాలించే దిగ్గజమేది? జ)................

10) తిరుచానూరుఅమ్మవారి లడ్డూప్రసాదంపేరు? జ)................

11) తల్లిఋణం, తండ్రిఋణం రెండింటినీ తీర్చుకున్న గొప్ప కారణజన్ముడెవరు? జ)................

12) తిరుచానూరు శ్రీపద్మావతిదేవిఆలయంలో పాటించే ఆగమంపేరు? జ)................

13) తిరుకురుంగుడిలో ప్రతిరోజూ దాసరి ఆలపించే కీర్తన ఏది? జ)................

14) విదర్భపురంలో ఉన్న విష్ణుభక్తుడిపేరు? జ)................

15) శ్రీవేంకటేశ్వరస్వామి బంగారుకత్తి పేరు? జ)................

16) తిరుచానూరుఅమ్మవారి ఆవిర్భావానికి కారకులెవ్వరు? జ)................

17) బ్రహ్మోత్సవాల్లో భక్తులు దర్శించేసేవలు ఏవి? జ)................

18) కోరిన కోరికలనిచ్చే దేవమణిపేరు? జ)................

19) 'జలధి'కి అర్థం? జ)................

20) 'పాంచరాత్రం' అంటే అర్థం? జ)................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందానమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-11-2022.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరిమాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధానపత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: ................ వయస్సు: ................

పాఠశాల: ................ తరగతి: ................

పేరు: ................

చిరునామా: ................

................

................

................ పిన్‌కోడ్: ................

ఫోను నెంబరు: ................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# నవంబరు, 2022 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** ఇతరులకు మీవంతు సహాయాన్ని అందిస్తారు. విందువినోదాలు కలసివస్తాయి. దైవారాధనలో, సాంఘికకార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటారు.



**వృషభం-** మనస్సున ధైర్యం, స్వశక్తితో కార్యజయం, ఉన్నతవిద్యల్లో సంతానం రాణిస్తారు. ఇతరదేశం వెళ్ళే అవకాశం, ఉన్నత విద్యలతో వినోదం కల్గుతుంది. సుబ్రహ్మణ్య, సూర్యభగవానుని ఆరాధనవల్ల శరీరారోగ్యం బాగుంటుంది.



**మిథునం-**గృహంలో సమస్యలు తొలగుతాయి. కుటుంబవాతావరణం అనుకూలమవుతుంది. సంతానంవిషయంలో ఉన్నతి. శుభకార్యాల ప్రయత్నాలు కలసివస్తాయి.



**కర్కాటకం-**ప్రియసంభాషణం, ధనకనకవస్తు వస్త్రలాభాలు కల్గుతాయి. ప్రతీవిషయాన్ని అనేకకోణాల్లో ఆలోచించడం, విషయవిశ్లేషణ చేయడం, సమయపాలన, ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం కనుగొని దూసుకుపోతారు.



**సింహం-** మనస్సున ఆనందం, ఆధ్యాత్మిక ఉన్నతి, ధార్మికకార్యక్రమాల్లో పాల్గొనడం, ఇతరులకు సాయంచేయటం, సాంఘికసేవలో తనవంతు పాత్రపోషించటం, ఆర్థికవిషయాలు ప్రోత్సాహకరం.



**కన్య-**శరీరమున స్వస్థత ఏర్పడి ఆయుర్దాయం వృద్ధిఔతుంది. స్నేహితులతోనూ, చుట్టాలతోనూ సహపంక్తిభోజనం. కుమారులవల్ల సౌఖ్యం, ఆకస్మికధనలాభాలు, మనోనిబ్బరం, మనసుకు ప్రశాంతత కల్గుతాయి.



**తుల-** వ్యసనాలకు లోనయినవారికి ఇబ్బందులు తప్పవు. ధనలోటు మిమ్ములను ఇబ్బంది పెడుతుంది. సంతానంవిషయంలో శ్రద్ధజేస్తారు. మిత్రులఅండదండలు మీకు పుష్కలంగా ఉంటాయి.



**వృశ్చికం-** దీర్ఘకాలికఅనారోగ్యంవిషయంలో జాగ్రత్త అవసరం. దైవసంబంధకార్యక్రమాల్లో పాల్గొంటారు. అన్నదానంవంటి ధార్మికవిషయాల్లో శ్రద్ధవహిస్తారు. విద్యావిషయాల్లో మరింత పురోగతి కనబడుతుంది.



**ధనుస్సు-** విందులువినోదాలకు ధనాన్ని ఖర్చు చేస్తారు. వ్యాపారాల్లో అధికలాభాలు ఆర్జిస్తారు. ఆదాయం కొన్నిరెట్లు అనూహ్యంగా పెరుగుతుంది. గౌరవం పెరుగుతుంది. విద్యార్థులు విద్యావిషయాల్లో ముందంజవేస్తారు.



**మకరం-** గ్రహస్థితి కొంతమెరుగ్గా ఉంటుంది. పుణ్యకార్యములందాశక్తి, ధర్మబుద్ధి. మనస్తాపాలు తొలగటం. వృత్తివ్యాపారాల్లో ముందంజ, ఉద్యోగలబ్ధి, ధనాదాయమార్గాలు మెరుగవుతాయి.



**కుంభం-** ప్రభుత్వఉద్యోగంకోసం చేసే కృషి ఫలిస్తుంది. విద్యార్థులు ఉద్యోగసంబంధనియామకపుపరీక్షల్లో రాణించి ఉద్యోగం సాధిస్తారు. గృహవాతావరణం అనుకూలం. భోగభాగ్యాలను భవిస్తారు. సంపద వృద్ధిచేస్తారు.



**మీనం-**ఉద్యోగస్తులకు పదోన్నతులు కల్గుతాయి. ధనం నిల్వఉంటుంది. లాభస్థానంలో శనిసంచారం అనుకూలంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభం కల్గుతుంది. అన్నిరంగాలవారికి అనుకూలసమయం.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

_______________________________________

_______________________________________

_______________________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | | |

**2. కావలసినభాష :**
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సరచందా :** ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. చందా పునరుద్ధరణ :**
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 82

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| | ■ | 21 | | | ■ | 22 | | |

నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

2)పాలసముద్రాన్ని మథించగా ముందు లభించినది(5); 6)ప్రజాపతి భార్య. నహుషునితల్లి(2); 7)భగీరథునిపుత్రుడు(3); 8)దీనితోకూడా కూరగాయలను కోయవచ్చు(2); 11)రాహువుతల్లి(3); 12)బ్రహ్మ(3) 16)ఆయువుకుమారుడు(2); 17)శ్రీకృష్ణునిమేనత్త(3); 18)'గూబ గుయ్‌మంది' ఇందులో ఒకపక్షి దాగిఉంది(2); 21)మహిషాసురుని తండ్రి(3); 22)ఆకూతి రుచి ప్రజాపతులకుమారుడు(3)

### నిలువు

1)హిమాలయపర్వతాలలో ఉన్న ఒకశిఖరంపేరు(4); 2)సుఖంగా ఉంది అనటానికి మరొకపేరు(2); 3)అంబరీషునిమనుమడు(4); 4)దేనికొరకు మహర్షులతపస్సు(2); 5)జనమేజయుడు చేయుచున్న సర్పయాగాన్ని ఆపినది(4); 9)హిరణ్యకశిపునిసోదరి(3); 10)శకుని సోదరి(3); 13)రావణాసురిని వేగులవాడు(4); 14)పురుహోత్రుని పుత్రుడైన అంశువుకుమారుడు(4); 15)గాంధారదేశాధిపతి(4); 19)దీనితో పువ్వులను మాలగా కడతారు(2); 20)ఇక్కడ పితృదేవతలకు పిండాలు వేస్తారు.(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

## తిరుమల శ్రీవారికి 27-09-2022 నుండి 05-10-2022 వరకు జరిగిన బ్రహ్మోత్సవ వైభవ చిత్రమాలిక.

ఈ ఉత్సవ ఆరంభంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు. అందులో పాల్గొన్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రభృతులు










SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-10-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

